హైదరాబాద్
ఆదివారం
25-3-2018
సంపుటి: 2, సంచిక: 113
పేజీలు: 12+16, వెల: రూ.6
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



నేను గొప్ప తండ్రిని కాను

- వి. విజయేంద్ర ప్రసాద్

'మూవీ ప్లస్'లో..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

నోట్ల రద్దు మతిలేని చర్యే

ఆర్థిక వ్యవస్థకు పెను శాపం

నిరుద్యోగ సమస్యకు కారణమదే

యువతకు ఆర్థికసాయం చేయాలి

ఉద్యోగ కల్పనలో వెనకబడ్డాం

కోర్టుల్లో గుట్టలుగా కేసులు

ముందు జడ్జిలను నియమించండి

తప్పుడు వార్తల ప్రచారం తర్వాత

న్యాయ మంత్రికి రాహుల్ హితవు

7లో..

మీలో మీకే శృతి లేదు.. మాపై విమర్శలా?

కేంద్ర మంత్రులు ప్రశంసిస్తారు.. మీరేమో ఆరోపణలు చేస్తారు

- మోసగాళ్లకు కేంద్రం అండ
- ఆర్థిక నేరగాళ్లకు వత్తాసు
- బీజేపీపై కేటీఆర్ తీవ్ర ధ్వజం
- దీటుగా బదులిచ్చిన కిషన్‌రెడ్డి
- ఇద్దరి మధ్య మాటల యుద్ధం
- 'సిర్పూర్'ను పునరుద్ధరిస్తాం
- పేపర్ మిల్లును తెరిపిస్తాం
- ఖాయిలా పరిశ్రమలకు హెల్త్ క్లినిక్
- నియోజకవర్గానికో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్: మంత్రి





హైదరాబాద్, మార్చి 24 (మనం ప్రతినిధి):

''మీలో మీకే శృతి లేదు. మాపై విమర్శలు చేస్తారా? ఓ వైపు కేంద్రమంత్రులేమో మా ప్రభుత్వాన్ని ప్రశంసిస్తారు. మీరేమో మాపై విమర్శలు చేస్తారు. ఇదెక్కడి తీరు'' అని రాష్ట్ర బీజేపీ నేతలపై మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. ''బడా వ్యాపారులు నీరవ్ మోదీ, విజయ్ మాల్యా వంటి మిగతా 6లో..



ఆధార్.. డేంజరే!

- ఎవరి వివరాలైనా తెలుసుకోవచ్చు
- ప్రభుత్వ రంగ సంస్థ ఏపీఐలో లోపం
- దాని ద్వారా హ్యాకర్ల పని సులభం
- చెప్పినా సరిచేసుకోని యూఐడీఏఐ
- జీడీ నెట్ వెబ్ సైట్ సంచలన కథనం

న్యూఢిల్లీ, మార్చి 24:

మీ ఆధార్ కార్డులో ఉన్న వివరాలన్నీ భద్రంగానే ఉన్నాయా? మీకు సంబంధించిన వ్యక్తిగత వివరాలను వేరే ఎవరైనా ఎంచక్కా తెలుసుకోవడమే కాక డౌన్‌లోడ్ కూడా చేసుకోగలరా? సరిగ్గా రెండోదే జరుగుతోంది. ఒక కేంద్ర ప్రభుత్వరంగ సంస్థకు సంబంధించిన ఓ యుటిలిటీ కారణంగా ఎవరైనా ఆధార్ కార్డు ఉన్నవాళ్లందరి వ్యక్తిగత సమాచారం మొత్తాన్ని సులభంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ విషయాన్ని జీడీనెట్ అనే వెబ్‌సైట్ తెలిపింది. పేరు, 12 అంకెల ఆధార్ నంబరు, వాళ్ల బ్యాంకు ఖాతాల వివరాలు, ఇతర మిగతా 6లో..

ఇదీలోకం!



ఈ మధ్యే ఒక్కో ఎంపీకి మూడు లక్షలకు పైనే ఫాలోవర్స్ పెరిగారట .. కాకపోతే వారంతా ఏపీకి హోదా కోరుతున్నారట సార్..!



హైదరాబాద్ శివారులోని వీబీఐటీలో శనివారం 'విభ-2018' పేరుతో నిర్వహించిన 'షార్ట్ ఫిలిం' పోటీల కార్యక్రమానికి హాజరైన సినీ నిర్మాత కందూకూరి రాజు 'మనం' దినపత్రికను ప్రదర్శిస్తున్న దృశ్యం

కూర్చోకండి!

లేచి నడవాలంటున్న వైద్యులు

ఎక్కువ సేపు కూర్చుంటే కొవ్వు

అరగంటకోసారి లేస్తేనే మంచిది

నాలుగు అడుగులు వేయాల్సిందే

కనీసం నిలబడినా కొంత పర్వాలేదు

లేకుంటే కొలెస్ట్రాల్ పెరిగే ముప్పు

గుండె పనితీరుపైనా దుష్ప్రభావం

అమెరికన్ పరిశోధకుల వెల్లడి



6లో..

ముహూర్తం

శ్రీవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి ఉ.8.03, నవమి తె.5.55; నక్షత్రం: ఆర్ద్ర మ.2.18 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా.1.36-3.06; దుర్ముహూర్తం: సా.4.48-5.36; రాహుకాలం: సా.4.54-6.25; అమృతఘడియలు: తె.4.55-6.25; శుభసమయం: ఉ.7.00-9.00.

సూర్యోదయం: 6.20,
సూర్యాస్తమయం: 6.25

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో ఆదివారం ఎండ తీవ్రత పెరగుతుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రాత్రిపూట గంటకు 13 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 38 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 22 డిగ్రీలు

గాలిలో తేమ: 67 శాతం



లాలుకు 14 ఏళ్ల జైలు

రూ.60 లక్షల జరిమానా కూడా

- దాణాస్కాంలో సీబీఐ కోర్టు తీర్పు
- ఐపీసీ.. అవినీతి నిరోధక చట్టాల కింద శిక్ష
- రెండు శిక్షల విధింపు.. ఒకదాని తర్వాత ఒకటి
- జరిమానా కట్టకపోతే మరో రెండేళ్లు జైలు
- మరో 18 మందికి వేర్వేరుగా శిక్షల విధింపు
- రాంచి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న లాలు
- మా నాన్న ప్రాణాలకు ముప్పు: తేజస్వి యాదవ్

6లో..



కొత్తగా 23 మున్సిపాలిటీలు

నగరపంచాయితీలకు ప్రమోషన్

సీఎం నియోజకవర్గంతో పాటు.. వేములవాడకూ జాబితాలో చోటు

సర్కారు తాజా ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, మార్చి 24:

రాష్ట్రంలోని 23 నగర పంచాయితీలకు ప్రమోషన్ లభించింది. వాటిని నగర పంచాయితీల నుంచి మున్సిపాలిటీలుగా మార్చుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా మున్సిపాలిటీల జాబితాలో ముఖ్యమంత్రి కేసీఆర్ మిగతా 6లో..

సారొస్తున్నారు!

వీఆర్ఎస్‌కు లక్ష్మీనారాయణ దరఖాస్తు



- త్వరలో ఏపీ రాజకీయాల్లోకి ప్రవేశం?
- ఆయనపై ఇప్పటికే పలు పార్టీల కన్ను
- తెరవెనుక పావులు కదుపుతున్న నేతలు
- నేడు కార్యాచరణ ప్రకటించే అవకాశం

తెలుగు బిల్లుకు సై

- ఆమోదించిన తెలంగాణ శాసనసభ
- అన్ని పాఠశాలల్లోనూ తెలుగు బోధన
- తెలుగుకు పూర్వవైభవం.. మళ్లీ పట్టం
- భాషపై గత ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి
- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి
- బిల్లును స్వాగతించిన ప్రతిపక్ష సభ్యులు
- కొన్ని మినహాయింపులకు సూచనలు



హైదరాబాద్, మార్చి 24:

రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో తెలుగు భాషను తప్పనిసరిగా అమలు చేయాలంటూ ప్రవేశపెట్టిన బిల్లును శాసనసభ శనివారం ఆమోదించింది. రాబోయే విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు, కేంద్రప్రభుత్వ, మిగతా 6లో..

టెక్నోస్మానియా సంబరాలు అదుర్స్

- చేనత రంగంలో సమస్యలపై చర్చ
- విద్యార్థులకు శాస్త్రవేత్తల సూచనలు
- అట్టహాసంగా ముగింపు వేడుకలు
- ఆటపాటలతో హోరెత్తిన ప్రాంగణం
- ముగిసిన 'టెక్నోస్మానియా-2కే18' ఫెస్ట్



హైదరాబాద్ సిటీ, మార్చి 24(మనం ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ కళాశాలలో 'మనం' నిర్వహిస్తున్న 'టెక్నోస్మానియా-2కే18' శనివారం ముగిసింది. చివరి రోజు కార్యక్రమాల్లో భాగంగా 'చేనేత రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు-పరిష్కారాలు' పై శనివారం ఉదయం చర్చ నిర్వహించారు. పలువురు శాస్త్రవేత్తలు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు ఈ కార్యక్రమంలో భావి ఇంజనీర్లకు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు. టెక్స్‌టైల్ విభాగం ఆధ్వర్యంలో 'గ్రీన్ రెవల్యూషన్ ఇన్ టెక్స్‌టైల్స్'అనే అంశంపై టెక్స్‌క్రోమా కార్యక్రమం నిర్వహించారు. ఉస్మానియా కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ పరిధిలోని పలు అఫీలియేటడ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని పేపర్ ప్రజంటేషన్‌లు ఇచ్చారు. జాతీయ వేదికపై ఎంతో నేర్చుకున్నామని ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తెలిపారు.

అట్టహాసంగా ముగింపు వేడుకలు..

మూడు రోజులుగా జరుగుతున్న టెక్నోస్మానియా-2కె18 జాతీయ కల్చరల్ ఫెస్ట్ ఘనంగా ముగిసింది. ముగింపు వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల ఆటపాటలతో ఉస్మానియా ప్రాంగణం హోరెత్తిపోయింది. పలువురు విద్యార్థులు దాండియా ఆడారు. ఫెస్ట్ జరిగిన మూడు రోజుల్లో తమ అనుభవాలను స్నేహితులతో పంచుకుంటూ సందడి చేశారు. ముగింపు కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్.రామచంద్రం, రైమ్ ఆర్గానిక్స్ ఎండీ రాజమహేందర్‌రెడ్డి, సునంద గుండవజాలా, ప్రొఫెసర్ ఆర్.శ్యాంసుందర్, ఈవెంట్ కన్వీనర్ జి.ప్రభాకర్‌రెడ్డి తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.శ్యాంసుందర్, వైస్ ప్రిన్సిపాల్ వి.రమేశ్‌కుమార్, డాక్టర్ శ్రీనునాయక్, టెక్నోస్మానియా కో కన్వీనర్ ఎ.విజయ్‌కాంత్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డా. ఎ.పరశురాములు, ఎ.కవిత, కె.శ్రీనివాసులు, ఎల్.ధీరజ్, డి.అర్జున్, హరీష్, ఎ.రవీందర్, ఎం.అభిలాష్, వి.భాస్కర్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు డీఎస్.గౌతమ్, ఎ.వశిష్ఠ, పి.నిఖిత, ఎ.ఆనంద్, ఫణిశ్రీకాంత్, బుర్హానుద్దీన్, జయంత్, రమాదేవి, బిందుజ, సహజ, సాయికృష్ణ, మిధున్, అఖిల, కార్తీక్, సాయితేజ, చంద్రలేఖ, సైఫుద్దీన్ తదితరులు ఫెస్ట్‌కు ఆర్గనైజర్లుగా పనిచేశారు.





అట్టహాసంగా 'విభ 2018'

- 'విజ్ఞానభారతి'లో విద్యార్థుల సందడి
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- సినీ నిర్మాత రాజు కందుకూరి హాజరు

హైదరాబాద్ సిటీ, మార్చి24(మనం ప్రతినిధి): దుమ్మురేపే దాండియా, అలరించిన ఆటపాటలు, ఆకట్టుకున్న షార్ట్‌ఫిల్మ్‌లు, అవగాహన పెంచిన స్టాల్స్‌కు తోడు విద్యార్థుల ఈలలు కేకలతో విజ్ఞానభారతి ఇంజినీరింగ్ కళాశాల ప్రాం గణంలో శనివారం సందడి కనిపించింది. 'విభ2018'లో భాగంగా కళాశాలలో శనివారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు సంప్రదాయ వస్త్ర ధారణలో సంద డి చేశారు. అంతేకాక షార్ట్‌ఫిలిం కాంటెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత రాజు కందుకూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమాల్లో న్యూ టాలెంట్‌ను ప్రోత్సహిస్తానని, నైపుణ్యం కలిగిన యువత తనను ఎప్పుడైనా సంప్రదించవచ్చని చెప్పారు. పోటీలో భాగంగా ప్రదర్శించిన కొన్ని షార్ట్ ఫిలిమ్స్ చూశానని, బాగున్నాయని ప్రశంసించారు. హీరో రాజ్‌తరుణ్ కూడా బ్యాక్‌లాగ్‌లు రాసుకుంటూ సినిమాల్లోకి వచ్చిన వాడేనని ఆయన తెలిపారు. కాగా,సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు చేసిన నృత్యాలు అదరహో అనిపించాయి.

శ్రీరామనవమికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- 25న ఎంజీబీఎస్ నుంచి భద్రాచలానికి 72 సర్వీసులు



హైదరాబాద్, మార్చి 24(మనం ప్రతినిధి): శ్రీరామనవమి నేపథ్యంలో ఈ నెల 25 నుంచి 3 రోజుల పాటు వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలం వరకు టీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. 25న హైదరాబాద్(ఎంజీబీఎస్) నుంచి మొత్తం 72 (రెగ్యులర్ సర్వీసులతో కలిపి) బస్సులు, తిరుగు ప్రయాణం కోసం 26న 72 బస్సులను నడపనున్నారు. ఖమ్మం-భద్రాచలం మధ్య 117 బస్సులు ఆదివారం నుంచి మూడురోజుల పాటు నడపనున్నారు. పర్ణశాల, మధిర, కొత్తగూడెం, మణుగూరు, సత్తుపల్లి ప్రాంతాల నుంచి భద్రాచలానికి బస్సులు నడుస్తాయని, ఆయా బస్సులకు రిజర్వేషన్ సదుపాయం కూడా ఉందని టీఎస్‌ఆర్టీసీ అధికారులు శనివారం ప్రకటించారు. ఏపీ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఈ నెల 26న భద్రాచలం నుంచి విజయవాడ, రాజమండ్రి, ఏలూరు, వరంగల్‌కు బస్సులు నడపనున్నారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి భద్రాచలం వరకూ బస్సులు నడిపిస్తామని అధికారులు వెల్లడించారు.

దక్షిణ మధ్య రైల్వేకు రైల్వే మంత్రి ప్రశంస

హైదరాబాద్, మార్చి 24(మనం ప్రతినిధి): విద్యుత్ ఆదా లక్ష్యంగా చేపట్టిన ఎల్‌ఈడీ బల్బుల అమరికలో దక్షిణ మధ్య రైల్వే (ఎస్సీఆర్) దూసుకెళ్తోంది. దేశంలోనే వందశాతం ఎల్‌ఈడీ బల్బుల అమర్చిన తొలి జోన్‌గా దక్షిణ మధ్య రైల్వేను నిలిపిన జీఎం వినోద్ కుమార్ యాదవ్, సిబ్బందిని రైల్వే శాఖ మంత్రి పియూష్ గోయల్ అభినందించారు. జోన్ పరిధిలోని మొత్తం 733 స్టేషన్లలో ఎల్‌ఈడీ బల్బుల అమరిక పూర్తయింది. దీంతో ఏడాదికి రూ.2.70 కోట్ల విలువైన 32 లక్షల యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని దక్షిణ మధ్య రైల్వే శనివారం ప్రకటించింది. జోన్‌లోని సిబ్బంది క్వార్టర్స్, కార్యాలయాల్లో కూడా ఎల్‌ఈడీ బల్బుల బిగింపు పూర్తిచేయాలని పీయూష్ గోయల్ అధికారులకు సూచించారు.

పీజీ మెడికల్‌లో వెయిటేజీపై పిటిషన్

హైదరాబాద్, మార్చి 24 (మనం లీగల్ ప్రతినిధి): పీజీ మెడికల్ ఎడ్యుకేషన్‌లో ఇన్ సర్వీస్ కోటాకు బదులు వెయిటేజీ ఇవ్వాలని తెలంగాణ సర్కార్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. ఇన్ సర్వీస్ కోటానే కొనసాగించాలని, 2017లో జారీ చేసిన జీవో 27 అమలు జరిగే ఉత్తర్వులు ఇవ్వాలని ప్రజాహిత వ్యాజ్యంలో పిటిషనర్ హైకోర్టును కోరారు. ఇన్ సర్వీస్‌కు బదులు వెయిటేజీ ఇస్తూ జారీ చేసిన జీవోలు 21, 22లను కొట్టేయాలని వైద్యులు డాక్టర్ ఎం.వసుచరణ్‌రెడ్డి, మరో 12 మంది పిల్ దాఖలు చేశారు. పూర్వపు విధానం కొనసాగేలా కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇందులో ప్రతివాదులుగా కుటుంబ సంక్షేమ, మెడికల్ ఎడ్యుకేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కన్వీనర్‌లను చేశారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూల్స్ ప్రకారం పీజీలో నేషనల్ పూల్‌కు 50 శాతం సీట్లు పోగా, మిగిలిన 50 శాతం సీట్లు స్థానికులకే చెందేలా ఇచ్చిన జీవోలు చెల్లవన్నారు. క్లినికల్‌కు 30 శాతం, నాన్ క్లినికల్‌కు 50 శాతం కోటా కేటాయించే ఇన్ సర్వీస్‌ను రద్దు చేయడం చెల్లదన్నారు. తాజాగా ఇచ్చిన జీవోల అమలును నిలిపివేస్తూ స్టే ఇవ్వాలని, పూర్తి విచారణ తర్వాత వాటిని కొట్టేయాలని హైకోర్టును కోరారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రానుంది.

కనీస వేతనాన్ని సవరించలేదు

- ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదు
- ఉమ్మడి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాలు

హైదరాబాద్, మార్చి 24(మనం లీగల్ ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కనీస వేతనాలను సవరించకపోవడాన్ని తప్పుపడుతూ హైకోర్టులో రెండు వేరువేరు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను సవరించాలని, ఈ విధంగా చేయకపోవడం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రజాహిత వ్యాజ్యాల్లో పిటిషనర్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కనీస వేతనాల చట్టాన్ని సవరించలేదని తప్పుపడుతూ హైదరాబాద్‌కు చెందిన తెలంగాణ రీజినల్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ కార్యదర్శి పావువెల్లి జీవన్‌రావు మరో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. 1948లో తెచ్చిన చట్టాన్ని సరిగ్గా అమలు చేయడం లేయకపోవడమే కాకుండా పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతన సవరణ చేయలేదని వ్యాజ్యంలో పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలను అధ్యయనం చేసేందుకు అధికారిక కమిటీ లేదా సబ్ కమిటీ ద్వారా నివేదిక తెప్పించుకుని నిర్ణయం తీసుకోవాలనే చట్ట నిబంధనల్ని సర్కార్ తుంగలోకి తొక్కిందన్నారు. రెండేళ్లకోసారి వేతన సవరణ చేయాలనే నిబంధన అమలు జరిగే హైకోర్టు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

2014లో సలహా కమిటీ చేసిన 34 ప్రతిపాదనలను అమలు చేయకపోగా మరో రెండేళ్లకు ఇంకో కమిటీ వేసిందని, ఈ కమిటీ తొమ్మిది ప్రతిపాదనలు చేసినా ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్లను ప్రతివాదులుగా చేశారు. వెంటనే కనీస వేతన సవరణలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని ఏపీ రాష్ట్ర మల్టీపుల్ కాంట్రాక్టర్స్ లేబర్ యూనియన్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు దాఖలు చేసిన పిల్‌లో పేర్కొన్నారు.

డీజీపీ నియామక అధికారం రాష్ట్రానికే

సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం



హైదరాబాద్, మార్చి 24(మనం ప్రతినిధి): డీజీపీ ఎంపిక, నియామకానికి సంబంధించిన చట్ట సవరణ బిల్లును శాసనసభ శనివారం ఆమోదించింది. ప్రస్తుతం ఈ అధికారం యూపీఎస్సీకి ఉంది. ఎంపిక చేసిన ముగ్గురితో కూడిన జాబితాను రాష్ట్రం పంపిస్తే, డీజీపీని యూపీఎస్సీ ఒకరిని ఎంపిక చేస్తోంది. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుప్రకారం రాష్ట్రాలు దీనిపై సొంత చట్టాలు చేసుకునే వరకు ఇదే కొనసాగుతుంది. దీంతో ఈ బిల్లును ప్రవేశపెట్టినట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఈ బిల్లుకు అన్ని పక్షాలు మద్దతు పలికాయి. కాగా, అడ్వకేట్ల సంక్షేమ నిధి సవరణ బిల్లును కూడా శాసనసభ ఆమోదించింది. దీని ప్రకారం న్యాయవాదుల సంక్షేమ నిధిని రెండింతలు చేశారు. న్యాయవాదులకు డెత్ బెనిఫిట్‌ను మూడు లక్షలకు పెంచారు. దీనితో పాటు తెలంగాణ అడ్వకెట్స్, క్లర్క్స్ సంక్షేమ చట్టం సవరణకు కూడా శాసన సభ ఆమోదించింది. వక్లర్క్‌లకు డెత్ బెనిఫిట్‌ను రెండు లక్షలు చేశారు.

అర్హులకు అసైన్డ్ భూములు..

అసైన్డ్ భూముల చట్ట సవరణను అసెంబ్లీ ఆమోదించింది. రాష్ట్రంలో 20 లక్షలకు పైగా అసైన్డ్ భూములు ఉన్నాయని, వీటిలో చాలా వరకు మూడో అమ్మకాలు జరిగి ఇతరుల చేతుల్లోకి వెళ్లాయని బిల్లును శాసన సభలో ప్రవేశపెడుతూ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ చెప్పారు. ఇలా అసైన్డ్ భూముల కొన్న వారిలో అర్హులైన పేదలకే వాటిని తిరిగి రీ అసైన్డ్ చేసేందుకు వీలుకల్పించే చట్ట సవరణను ప్రతిపాదించారు. దీనిపై టీడీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇప్పటికే అసైన్డ్ భూములు బడా బాబుల చేతిల్లో దుర్వినియోగం అవుతున్నాయని, ఇప్పుడు చట్టబద్ధంగానే వారికి కట్టబెట్టే ప్రయత్నం జరుగుతుందని సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. ఈ భూములు ఎలాం టి దుర్వినియోగం కాకుండా ఆయా ప్రాంతాల శాసన సభ్యులతో కూడా సంప్రదించిన తరువా తే రీ అసైన్ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

డాక్టర్లకు తప్పనిసరి ప్రభుత్వ సర్వీస్ రద్దు

ఎంబీబీఎస్, ఎండీ పూర్తి చేసిన మెడికల్ విద్యార్థులు తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక సంవత్సరం పని చేయాలన్న నిబంధనను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు తెలంగాణ , మెడికల్ ప్రక్టీసర్, రిజిస్ట్రేషన్ చట్ట సవరణను మంత్రి లక్ష్మారెడ్డి సభలో ప్రవేశపెట్టారు. 2013లో రూరల్ ప్రాక్టీస్ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం చట్టం చేసింది. 2600 మంది డాక్టర్లను నియమిస్తున్నందున ఈ నిబంధనను రద్దు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి వివరించారు. డాక్టర్లకు వేతనాలు పెంచితే గ్రామీణ ప్రాంతాల్లో పని చేసేందుకు ముందుకు వస్తారని సభ్యులు సూచించారు.

1 నుంచి కాంగ్రెస్ రెండో దశ యాత్ర

హైదరాబాద్, మార్చి 24(మనం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రజా చైతన్య బస్సు యాత్ర రెండో దశ కార్యక్రమం ఏప్రిల్ ఒకటో తేదీన పెద్దపల్లి జిల్లా రామగుండంలో ప్రారంభమవుతుంది. అదే రోజు సాయంత్రం రామగుండంలో సభ నిర్వహించనున్నారు. ఏప్రిల్ రెండో తేదీ సాయంత్ర పెద్దపల్లిలో, 3న మధ్యాహ్నం మంథనిలో సాయంత్రం భూపాలపల్లిలో బహిరంగ సభలు నిర్వహిస్తామని పీసీసీ తెలిపింది. 4న మధ్యాహ్నం ములుగులో, సాయంత్రం పరకాల, 5న మధ్యాహ్నం వరంగల్ ఈస్ట్, సాయంత్రం వరంగల్ వెస్ట్, 6న మధ్యాహ్నం వర్ధన్నపేట్, సాయంత్రం నర్సంపేట్, 7న మధ్యాహ్నం స్టేషన్ ఘన్‌పూర్, సాయంత్రం పాలకుర్తి, 8న మధ్యాహ్నం డోర్నకల్, సాయంత్రం మహబూబాబాద్, 9న మధ్యాహ్నం ఇల్లందు, సాయంత్రం పినపాకలో బహిరంగ సభలు నిర్వహించనున్నారు. పదో తేదీ ఉదయం భద్రాచలంలో, సాయంత్రం వెంకటాపూర్‌లో సభ నిర్వహించి రెండో దశ బస్సు యాత్రను ముగించనున్నారు. ఈ యాత్రంలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌తో సహా పార్టీనేతలందరూ పాల్గొంటారు.

విద్యుత్ మిగులు రాష్ట్రం కాదు

- కొనుగోలు చేస్తున్నా

చార్జీలు పెంచం: జగదీశ్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 24(మనం ప్రతినిధి): ప్రస్తుతం మనది విద్యుత్ మిగులు రాష్ట్రం కాదని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి చెప్పారు. ప్రస్తుతం మన రాష్ట్రం విద్యుత్‌ను పలు సంస్థల నుంచి కొనుగోలు చేస్తుందని శనివారం నాడు శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో బీజేపీ సభ్యులు కిషన్ రెడ్డి, లక్ష్మణ్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. తెలంగాణ ఏర్పడి నాటి నుంచి ఇప్పటి వరకు 20 వేల 585 కోట్లతో 45486 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొనుగోలు చేసినట్లు చెప్పారు. 20204 నాటికి మన రాష్ట్రం విద్యుత్ రంగంలో విగులు సాధించే విధంగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నిర్మిస్తున్నామని చెప్పారు. 12.8 శాతం ఉన్న విద్యుత్ పంపిణీ నష్టాలను 10.03కు తగ్గించామని, దీన్ని మరింత తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ప్రస్తుతం మనం ప్రభుత్వ రంగ సంస్థలైన ఎన్టీపీసీతో పాటు, ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం నుంచి , ప్రయివేట్ సంస్థ సేంబ్ కార్ప్ ఎనర్జీ , సోలార్ డెవలపర్స్ నుంచి విద్యుత్ కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. సేంబ్ కార్ప్ ఎనర్జీ నుంచి యూనిట్‌కు 4 రూపాయల 15 పైసలకు, సోలార్ డెవలపర్స్ నుంచి 4 రూపాయల 66 పైసల నుంచి ఆరు రూపాయల 45 పైసల వరకు కొనుగోలు చేస్తున్నామన్నారు. ప్రయివేట్ సంస్థల కంటే ప్రభుత్వ రంగ సంస్థ ఎన్టీపీసీనే ఎక్కువ ధర చెబుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉదయ్ పథకంలో చేరామని , ప్రస్తుతం కేంద్రం నుంచి ఎలాంటి సాయం అందడంలేదనినారు. ఉదయం పథకంలో భాగంగా 16 వేల కోట్లకు అంచనాలు సమర్పించామని, ఇందులో 60 శాతం నిధులు మనకు అందే అవకాశం ఉందన్నారు. కాగా, రాష్ట్రంలో 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని, రైతులకు ఉచితంగా ఇస్తున్న రాష్ట్రం కేవలం తెలంగాణ మాత్రమేనన్నారు. పరిశ్రమలు ఓపెన్ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలును ప్రభుత్వం ప్రోత్సహించడంలేదని, దీని వల్ల డిస్కంలకు నష్టం జరుగుతుందన్నారు. తెలంగాణ దేశంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రస్తుతం 3782 మోగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. విద్యుత్ రంగంలో మనమే దేశానికి ఆదర్శంగా ఉన్నామన్నారు. గతంలో కుదిరిన పీపీఏల వల్ల ఇంకా కొన్ని సంస్థల నుంచి ఎక్కువ ధరకే విద్యుత్ కొనాల్సి వస్తుందన్నారు. ఓపెన్ టెండర్ల ద్వారానే విద్యుత్ కొనుగోలు చేస్తున్నామని, ఇది కూడా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే చేస్తున్నామని చెప్పారు. పెద్ద ఎత్తున విద్యుత్ కొనుగోలు చేస్తున్నప్పటికీ విద్యుత్ ఛార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు.

ఎస్‌ఆర్‌డీపీ కింద 52 పనులు: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 24(మనం ప్రతినిధి): హైదరాబాద్ నగరంలో వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి కార్యక్రమంలో 26459 కోట్ల 81 లక్షల అంచనా వ్యయంతో 52 పనులు చేపట్టినట్లు పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చెప్పారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో టీఆర్ఎస్ సభ్యులు అరెకపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. ఈ పథకంలో చేపట్టిన 16 పనులు పూర్తి కావచ్చాయని తెలిపారు. ప్రధానంగా బయో డైవర్శిటి- జెఎన్‌టియూ కారిడార్‌ను 379 కోట్లుతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఎల్ బి నగర్ కారిడార్‌ను 448 కోట్లు, అంబర్ పేట 6 నెంబర్ చౌరస్తాలో ఫైఒవర్ 270కోట్లు, జూపార్క్ నుంచి ఆరాంఘర్ ఎలివేటెడ్ కారిడార్‌ను 636 కోట్ల 80 లక్షలతో చేపడుతున్నట్లు చెప్పారు. ఇందిరా పార్క్ నుంచి విఎస్‌టీ వరకు ఎలివేటెడ్ కారిడార్‌ను 426 కోట్లతో చేపట్టనున్నట్లు తెలిపారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మియాపూర్ నుంచి బాచుపల్లి వరకు విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఉందని, ఈ మార్గాన్ని మరింత విస్తరించాలని అరికపూడి గాంధీ కోరారు. నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సిటీ శాసన సభ్యులతో త్వరలో సమావేశం నిర్వహిస్తామన్నారు. తెలంగాణలో మొత్తం 193 బ్రిడ్జి కం చెక్ డ్యాంల నిర్మిస్తున్నట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరారావు తెలిపారు. చెక్ డ్యాంల వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో టీఆర్ఎస్ సభ్యులు చల్లా ధర్మారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. ఈ చెక్ డ్యాం బ్రిడ్జిలను 647 కోట్ల 94 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నామని మంత్రి వివరించారు. మొత్తం 511బ్రిడ్జిలను నిర్మిస్తున్నామని, వీటిలో 193 బ్రిడ్జి కం చెక్ డ్యాంలు ఉంటాయన్నారు. వీటి లో ఇంకా 179 బ్రిడ్జీలు, 37 చెక్ డ్యాంలు పూర్తి కావాల్సి ఉందన్నారు. 94 చెక్ డ్యాంలను పూర్తి చేశామన్నారు. మిగిలిన 99 చెక్ డ్యాం కం బ్రిడ్జీలను ఈ సంవత్సరం జూన్ నాటికి , 37 బ్రిడ్జిలను సెప్టెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు.

డిసెంబర్ నాటికి 21, వచ్చే సంవత్సరం మార్చి నాటికి 29 పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో తిరుగుతున్న అనుమతిలేని ప్రయివేట్ బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి చెప్పారు. శనివారం నాడు శాసన సభ ప్రశ్నోత్తర సమయంలో టీఆర్ఎస్ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు కేసులు పెట్టిన వాటిలో 939 స్టేజీ క్యారియర్లు, 735 బస్సులు పన్ను కట్టకుండా తిరుగుతున్నాయని, 432 బస్సులు తెలంగాణ పర్మిట్ లేకుండా తిరుగుతున్నవి, 146 సరకు రవాణా చేస్తున్నవి, 48 బస్సులు రెండో డ్రైవర్ లేకుండా తిరుగుత్నువి, ఇలా మొత్తం 9439 బస్సులపై కేసులు పెట్టినట్లు చెప్పారు. డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లే ఎక్కువ ప్రమాధాలు జరుగుతున్నాయని తెలిపారు.

ఆంధ్రా పార్టీలకు పోరాట పటిమ లేదు

- రిజర్వేషన్లపై మా పోరాటంలో న్యాయం ఉంది..
- హోదా కోసం టీఆర్ఎస్‌పై నిందలెందుకు?
- ఆంధ్ర ప్రజలను మోసం చేసేందుకు అక్కడి పార్టీలు రెడీ
- ఏపీ పార్టీలు ప్రజలను పిచ్చి వాళ్లుగా మార్చొద్దు
- ఫెడరల్ ఫ్రంట్‌కు కేసీఆర్ నాయకత్వాన్నే

ఏపీ ప్రజలు కోరుకుంటున్నారు: మంత్రి తలసాని


హైదరాబాద్, మార్చి 24, మనం ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పార్టీలు ప్రజలను మరోసారి మోసం చేస్తున్నాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తమ దిగజారుడు రాజకీయాలతో ఏపీ ప్రజలను పిచ్చి వాళ్ళుగా మార్చే ప్రయత్నం పార్టీలు చేస్తున్నాయని తలసాని మండిపడ్డారు. శనివారం అసెంబ్లీ లాబీలో ఈ అంశంపై ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర పార్టీల ఎత్తులు, కుట్రలపై ఆయన విరుచుకుపడ్డారు. స్పెషల్ స్టేటస్ సాధించుకోవడానికి ఎన్నో వేదికలు ఉన్నాయన్నారు. ప్రత్యేక హోదా సాధన ఏపీ పార్టీలకు చేతకాకపోతే ప్రజలకు వదిలేయండి అంటూ తలసాని చురకలు అంటించారు. దశల వారీగా సాగిన తెలంగాణ ఉద్యమం చూసైనా చంద్రబాబు ఏమీ నేర్చుకోలేకపోయారని తలసాని వాఖ్యానించారు. నాలుగేళ్లుగా చంద్రబాబు ప్రత్యేక హోదా కోసం కేంద్రం మీద ఒత్తిడి పెంచకుండా ఏం చేశారు? అని ప్రశ్నించారు. ఏపీలో పార్టీలకు పోరాట పటిమ లేదని ఏద్దేవా చేశారు. రిజర్వేషన్ల కోసం తాము చేస్తున్న పోరాటంలో న్యాయం ఉందని.. ఈ విషయంలో టీఆర్ఎస్‌ను నిందించడం తగదని తలసాని అన్నారు.

ఇది ఆంధ్ర ప్రజల దురదృష్టం

విజయ సాయిరెడ్డి ఎవరిని కలిశారు? మరొకరు ఇంకెవరిని కలిశారు.. అనేదే ఏపీ పార్టీలకు ముఖ్యమైన అంశం కావడం అక్కడి ప్రజల దురదృష్టమని తలసాని విచారం వ్యక్తం చేశారు. ప్రజలను గందరగోళ పరచడానికి ఏపీలో పార్టీలు ఒకరిపై మరొకరు బురద చల్లుకుంటున్నారని విమర్శించారు. అవిశ్వాస తీర్మానంతో వచ్చే ప్రయోజనమేమిటని కూడా మంత్రి ప్రశ్నించారు. బీజేపీకి సొంతగా 273 మంది ఎంపీల బలం ఉన్న ప్రస్తుత సమయంలో అవిశ్వాసంతో ఒరిగేది ఏమీ లేదని ఆయన చెప్పుకొచ్చారు. కేసుల్లో నిందితుడిగా ఉన్న విజయసాయి రెడ్డి ప్రధానిని కలవడాన్ని చంద్రబాబు తప్పుబడుతున్నారు...కేసుల్లో నిందితుడిగా ఉన్న జగన్‌తో పాటు చంద్రబాబు మొన్నటి దాకా ఏపీ అసెంబ్లీలో ఎందుకు కూర్చున్నారు? అంటూ ప్రశ్నించారు. ఏపీ ప్రజల ఆవేదనను చూసి తాను చలించి ఈ అంశంపై నేను మాట్లాడాల్సి వస్తోందని తలసాని స్పష్టం చేశారు.

హోదా కోసం పోరాడేందుకు టీఆర్ఎస్ రెడీ

ఫెడరల్ ఫ్రంట్‌కు కేసీఆర్ నాయకత్వం వహించాలని ఏపీ ప్రజలు కూడా కోరుకుంటున్నారన్నారు. ఇందుకు కేసీఆర్ కూడా సిద్ధంగా ఉన్నారని తలసాని గుర్తుచేశారు. తెలంగాణ కోసం అన్ని పార్టీలను ఒప్పించిన ఘనత కేసీఆర్‌దేనని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక హోదా కోసం పోరాడాలని ఏపీ ప్రజలు కోరుకుంటే టీఆర్ఎస్ పార్టీ అందుకు సిద్ధంగా ఉందన్నారు. ఏపీ ప్రజలు, పార్టీలు తెలంగాణ నుంచి నేర్చుకోవాల్సింది ఉందన్నారు. ఏపీ ప్రజలను మూర్ఖులుగా మార్చే ప్రయత్నాన్ని అక్కడి పార్టీలు మానుకోవాలన్నారు. చంద్రబాబుకు అనుభవం ఉన్నా తొందరపడి ప్రకటనలు చేస్తున్నారని తలసాని అన్నారు. రాజీనామాలతోనే ఏపీ దేశ దృష్టిని ఆకర్షించగలదన్నారు. ఏపీ పార్టీలకు ప్రణాళిక లోపించిందన్నారు. రోజుకో డ్రామాతో అక్కడి పార్టీలు రక్తి కట్టిస్తున్నాయన్నారు. ఏపీ స్పెషల్ స్టేటస్ పై కేంద్రం వైఖరి స్పష్టం చేయాలని సీఎం కేసీఆర్ ప్రధాని మోదీని ప్రెస్ మీట్ ద్వారా ఇప్పటికే కోరారని తలసాని అన్నారు.



టీడీపీది సెల్ఫ్ గోల్

టీడీపీ వ్యవహారశైలితో పలు అనుమానాలు తలెత్తుతున్నాయని ఆయన ఆరోపించారు. పార్లమెంట్‌లో అన్నాడీఎంకే కూడా ఆందోళన చేస్తోందని..ఆ పార్టీ ఎంపీలతో టీడీపీ అవిశ్వాసం మీద మాట్లాడిందా అంటూ ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు. మీడియాలో వార్తలు చూస్తుంటే ఏపీ పార్టీలు అక్కడివారిని మోసం చేస్తున్నాయని అపిస్తోందన్నారు. ప్రజలను అమాయకులను చేసి ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో ఉన్న మొత్తం 25 మంది ఎంపీలు మూకుమ్మడి రాజీనామాలు చేస్తే ఏదైనా ఫలితం ఉండవచ్చని తలసాని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో రాజీనామాల ద్వారా ఒత్తిడి పెరిగిందన్నారు. ఏపీలో కొందరు ఏవో ఆపరేషన్లు అంటూ పిచ్చిగా మాట్లాడుతున్నారన్నారు. ఆ ఆపరేషన్ ప్రభావం తెలంగాణ రాజకీయాలపై ఉండబోదని మంత్రి అభిప్రాయపడ్డారు. టీడీపీ ఏపీలో సెల్ఫ్ గోల్ చేసుకుంటోందన్నారు.



రవీంద్ర భారతిలో 'సమ్మర్ సమురాయ్ క్యాంప్-2018'ను శనివారం నాడు ప్రారంభించిన మంత్రి జగదీశ్ రెడ్డి.. అనంతరం సమురాయ్ విద్యార్థితో కత్తి కలిపి ఫొటోలకు ఫోజులిచ్చారిలా!



రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు సంతోష్ కుమార్, బండ ప్రకాష్, లింగయ్య యాదవ్‌లు శనివారం మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన దృశ్యం.

రాష్ట్రంపై కేంద్రం చిన్నచూపు

- ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్



హైదరాబాద్, మార్చి 24(మనం ప్రతినిధి): తెలంగాణపై కేంద్రం చిన్నచూపు చూస్తోందని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ఆరోపించారు. 15వ ఆర్థిక సంఘం కింద రాష్ట్రానికి ఆర్థిక సహాయం అంశంపై పాతూరి సుధాకర్‌రెడ్డి వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ.. రాష్ట్రం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు వివిధ రంగాల్లో నిధులు అవసరం అవుతాయన్నారు. మిషన్ భగీరథ పథకానికి 19 వేల కోట్లు, మిషన్ కాకతీయ పథకానికి రూ.5 వేల కోట్లు ఇవ్వాలని నీతి అయోగ్ సిఫారుసు చేసినా కేంద్రం పట్టించుకోలేద న్నారు. అభివృద్ధి ప్రాజెక్టుల నిధులను ఆర్థిక సంఘం సాధారణంగా సిఫారసు చేయదన్నారు.

జిల్లాల్లో ట్యాంక్‌బండ్‌ల సుందరీకరణ

- భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, మార్చి 24(మనం ప్రతినిధి): జిల్లా కేంద్రాల్లో ఉన్న ట్యాంక్‌బండ్‌ల సుందరీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రాల్లో ట్యాంక్‌బండ్‌ల సుందరీకరణ, రాచకొండ ఎత్తిపోతల పథకం అంశాలపై పూల రవీందర్, కాటేపల్లి జనార్దన్ రెడ్డి, కర్నె ప్రభాకర్, పట్నం నరేందర్‌రెడ్డి, సుంకరి రాజు వివరణ కోరగా మంత్రి సమాధానమిచ్చారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ తరహాలో జిల్లాల్లోని ట్యాంక్‌బండ్‌లను సుందరీకరణకు చర్యలు తీసుకున్నామన్నారు. రాచకొండ ఎత్తిపోతల సాగునీటి పథకం దర్యాప్తు, సర్వే పనిని చేపట్టడానికి ఐ అండ్ సీఏడీ శాఖ జీవో ఆర్టీ నెం 496లో అనుమతినిచ్చిందన్నారు. నాలుగు నెలల్లో సర్వే పూర్తవుతుందన్నారు.

కాంట్రాక్టు కోచ్‌లకు న్యాయంచేస్తాం

- క్రీడా శాఖ మంత్రి పద్మారావు



హైదరాబాద్, మార్చి 24(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కోచ్‌లకు న్యాయం చేస్తామని ఆ శాఖ మంత్రి పద్మారావు తెలిపారు. ప్రాధికార సంస్థల్లో ఒప్పంద శిక్షకుల అంశంపై ఎన్.రామచందర్‌రావు ప్రశ్నకు మంత్రి సమా .దానమిస్తూ.. తెలంగాణ రాష్ట్ర ప్రాధికార సంస్థలో మూడు బ్యాచ్‌ల్లో కాంట్రాక్టు కోచ్‌లు పనిచేస్తున్నారని తెలిపారు. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో 9వ షెడ్యూల్డు జాబితా కింద ఉన్న సంస్థలు కార్పొరేషన్, ఇతర ప్రభుత్వ సంబంధ సంస్థల్లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు.


ఆదాయంలేని ఆలయాలకే ధూపదీపం

- దేవాదాయ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి




హైదరాబాద్, మార్చి 24 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో ఏ ఆదాయంలేని, ఐదెకరాలకన్నా తక్కువ ఉన్న ఆలయాలకు మాత్రమే ధూప, దీప నైవేద్య పథకం అమలు చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నిబంధనల మేరకు రాష్ట్రంలోని 3 వేల దేవాలయాలకు ఈ పథకం అమలు చేయాలని సబ్ కమిటీ నిర్ణయించిందని తెలిపారు. నూతన దేవాలయాలకు ధూప దీప నైవేద్య పథకం అంశంపై పురాణం సతీష్‌కుమార్, బాలసాని లక్ష్మీనారాయణ వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ... దేవాలయాల ఎంపిక ప్రక్రియ పూర్తయిన వెంటనే ఈ పథకాన్ని అమలు చేయనున్నట్టు తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వం పూజార్లుకు రూ.4000, నైవేద్యాలకు రూ.2500 ఇస్తున్నామని పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి వివరించారు. తెలంగాణ తిరుపతిగా యాదాద్రిని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. 250 కోట్లతో వెయ్యి ఆలయాలను అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు.

హిందువులంటే ఎందుకు వివక్ష: కృష్ణయ్య



హైదరాబాద్, మార్చి 24 (మనం ప్రతినిధి): ఫీజుల విషయంలో ఇతర మతస్థులకు పూర్తి మినహాయింపులు ఇస్తున్న ప్రభుత్వం హిందూవు లపై ఎందుకు వివక్ష చూపుతుందని, హిందూ మతంలో పుట్టడమే తప్పా.. అని టీడీపీ ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శనివారం ఆయన మాట్లాడారు. ప్రతిభ ఉన్నా ఫీజులు చెల్లించలేక చాలామంది విద్యార్థులు చదువు మానేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ అంశాన్ని ఎన్నిసార్లు ప్రస్తావించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, చెవిటోడి ముందు శంఖం ఊదినట్లు ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. వృత్తి విద్యా కోర్సుల్లో చదివే బీసీ, ఈబీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్‌ను పది వేల రూపాయలకు పెంచాలని టీడీపీ ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు.

సీఎం కేసీఆర్‌ది శిఖండి పాత్ర: జీవన్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 24(మనం ప్రతినిధి): సీఎం కేసీఆర్ శిఖండి పాత్ర పోషిస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి విమర్శించారు. శనివారం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. ప్రధాని మోదీతో నాలుగేళ్ల నుంచి అంటకాగి, గిరిజన రిజర్వేషన్ల విషయంలో కేంద్రంపై నెపం నెడుతున్నారని విమర్శించారు. గిరిజనుల జనాభా ప్రాతిపదికన రాజ్యాంగానికి అనుగుణంగా రాష్ట్ర పరిధిలో రిజర్వేషన్లు అమలు చేయొచ్చు, కానీ కేంద్రానిదే బాధ్యతంటూ కేసీఆర్ తప్పించు కుంటున్నారన్నారు. మోదీ చేతిలో కేసీఆర్ పావుగా మారారని, పునర్విభజన చట్టం ప్రకారం రావాల్సిన హక్కులను కాలరాస్తున్నారని ఆక్షేపించారు.

తెలంగాణ వందేండ్లు సుభిక్షం

అందుకోసమే కాళేశ్వరం ప్రాజెక్టు.. రీ ఇంజనీరింగ్ వల్లే ఇది సాధ్యం.. లేకపోతే తాగునీటికే పరిమితం

- మేడిగడ్డవద్ద నీటి లభ్యత ఉంది
- కాబట్టే అక్కడ నిర్మాణం చేపట్టాం
- చేపల పెంపక హక్కు నిర్వాసితులకే
- మండలిలో చర్చ.. హరీశ్ జవాబు



హైదరాబాద్, మార్చి 24 (మనం ప్రతినిధి): తెలంగాణ వందేండ్లు సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలన్న సీఎం కేసీఆర్ స్వప్న సాకారానికే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. ఈ ప్రాజెక్టుపై శనివారం శాసనమండలిలో లఘుచర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలు, సందేహాలతోపాటు వారి అభిప్రాయాలు, సూచనలపై ఆయన సుదీర్ఘ సమాధానమిచ్చారు. రాష్ట్రంలోని 19 జిల్లాలకు ఈ ప్రాజెక్టు వరప్రదాయని కానుందని తెలిపారు. తెలంగాణ సాధన ఉద్యమం తరహాలో, అదే స్ఫూర్తితో ప్రాజెక్టును నిర్మిస్తున్నట్టు చెప్పారు. మూడు షిఫ్టుల్లో, ఫ్లడ్ లైట్ల వెలుగులో కూడా పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. మొత్తం 20 రిజర్వాయర్లు, 19 పంపుహౌజ్‌లతో రూపొందుతున్న ఈ ప్రాజెక్టు కాలువల పొడవు 1832 కిలోమీటర్లని తెలియజేశారు. దేశంలో ఏప్రాజెక్టు కూ ఇంత పొడవైన కాలువలు లేవన్నారు. ప్రాజెక్టుకు 4,620 మెగావాట్ల విద్యుత్ అవసరం కాగలదని చెప్పారు. ప్యాకేజీలో 8లో భాగంగా నిర్మిస్తున్న పంపుహౌజ్‌లోని 650 టన్నుల బరువైన యంత్రాన్ని బీహెచ్ఈఎల్ త యారుచేసిందని, ఇది పనిచేయడానికి 139 మెగావాట్ల విద్యుత్ కావాల్సి ఉంటుందని తెలిపారు. ఇంతటి భారీ యంత్రాలు ప్రపంచ నీటిపారుదల ప్రాజెక్టులలో ఎక్కడా లేవన్నారు. సీఎం కేసీఆర్ మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేస్తున్నారని గుర్తుచేశారు. ప్రాణహిత-చేవెళ్ల పేరిట ఉన్నప్పుడు ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి వద్ద నీటిలభ్యత తక్కువ కాబట్టి ప్రత్యామ్నాయం చూడాలని కేంద్ర జలసంఘం నాటి కాంగ్రెస్ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాసిందని తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డాక తదనుగుణంగా 200 టీఎంసీల నీటి లభ్యతగల మేడిగడ్డను జలసంఘం నిర్ధారించడంతో అక్కడ నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. ఆ మేరకు ప్రాణహిత-చేవెళ్లను రీ-ఇంజనీరింగ్ చేయకపోతే అది తాగునీటి ప్రాజెక్టుగా మిగిలిపోయేదని చెప్పారు. ఇక కాళేశ్వరంతో ఎస్సారెస్పీని లింకు చేస్తున్నందున దానికింద 9.5 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. మొత్తంమీద కాళేశ్వరంద్వారా గోదావరి నది పరీవాహక ప్రాంతం అంతటినీ సస్యశ్యామలం చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటు న్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఎకరా భూమికీ నీరివ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.



రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలను నివారించి, ఆకుపచ్చ తెలంగాణ నిర్మించాలన్నది సీఎం కేసీఆర్ సంకల్పమని వివరించారు. ఆయన పట్టుదల ఫలితంగా ఇప్పటికే రైతు ఆత్మహత్యలు చాలావరకు తగ్గాయన్నారు. కాగా, టీఆర్ఎస్ ప్రభుత్వంపై అక్కసుతో కాంగ్రెస్ నేతలు కోర్టులను ఆశ్రయించి ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తద్వారా రైతు ఆత్మహత్యలు కొనసాగాలని ఆ పార్టీ కోరుకుంటున్నట్లుం దని మండిపడ్డారు. ఈ కుట్రలో భాగంగానే తాజాగా కాళేశ్వరం ప్రాజెక్టుకు లభించిన అటవీ-పర్యావరణ అనుమతుల రద్దు కోరుతూ హరిత ధర్మాసనంలో కేసులు వేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా 13 జిల్లాల ప్రజలు సానుకూలత తెలిపారని పేర్కొన్నారు. ప్రాజెక్టు కోసం 35 వేల ఎకరాలు సేకరించామని, కాంగ్రెస్ కుట్రలకు సంబంధించిన ఆధారాలన్నీ ప్రభుత్వంవద్ద ఉన్నాయని చెప్పారు. ఆ పార్టీ నేతలు సుప్రీంకోర్టులో ఎవరితో కేసు వేయించారు.. ఏ లాయరుకు ఎంత డబ్బును.. ఎవరి బ్యాంకు ఖాతాద్వారా ఇచ్చారు... ఢిల్లీకి విమాన టికెట్లు ఎవరి డెబిట్ కార్డుతో బుక్ చేశారు... తదితర వివరాలన్నీ ఉన్నాయన్నారు. కాంగ్రెస్ వారు సభలు ఉన్నప్పుడే ఇవన్నీ వెల్లడిస్తామని ప్రకటించారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టును అడ్డుకోవడానికి చనిపోయిన వారి పేర్లతో కోర్టులో కేసు వే సి దొరికిపోయిన చరిత్ర కాంగ్రెస్ నాయకులదన్నారు. తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే నీటిపారుదల ప్రాజెక్టులను అడ్డుకోవడమే వారి లక్ష్యమని దుయ్యబట్టారు. కాళేశ్వరం, పాలమూరు, డిండి ఎత్తిపోతలతోపాటు సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి అయితే తమ ఉనికికి ప్రమాదం తప్పదని విపక్షాలు వణికిపోతున్నట్టు వ్యాఖ్యానించారు. కాళేశ్వరానికి జాతీయ హోదా రాకపోవడానికీ కాంగ్రెస్సే కారణమన్నారు. రీ-డిజైన్‌వల్ల 274 కిలోమీటర్ల మేర గోదావరి జీవనదిగా మారుతుందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పెండింగ్ ప్రాజెక్టులను తాము రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చామని, ఎవరెన్ని కేసులు వేసినా కోటి ఎకరాలకు నీరందించడం ఖాయమన్నారు. అనుకున్న సమయానికే ప్రాజెక్టును పూర్తి చేస్తామని శాసనమండలిలో హామీ ఇచ్చారు. సభ్యులు కర్నె ప్రభాకర్, రామచందర్‌రావు, భాను ప్రసాద్, బోడకుంటి వెంకటేశ్వర్లు, పురాణం సతీష్, సయ్యద్ హసన్ జాఫ్రీ, ఫారుఖ్ హుస్సేన్‌లు తమ అభిప్రాయాలు, సందేహాలు, సూచనలు ఇచ్చారు.

హోంగార్డులకు కేసీఆర్ దేవుడు

- హోం శాఖ మంత్రి నాయిని



హైదరాబాద్, మార్చి 24(మనం ప్రతినిధి): హోంగార్డులకు సీఎం కేసీఆర్ దేవుడు అని హోంమంత్రి నాయిని నర్సింహరెడ్డి అన్నారు. అసెంబ్లీలో ఆర్థిక పద్దులపై జరుగుతున్న చర్చలో ఆయన మాట్లాడుతూ హోంగార్డులకు పెద్ద ఎత్తున వేతనాలు ఇస్తున్నామని తెలిపారు. హోంగార్డులను పర్మినెంట్ చేసే అవకాశాలు లేవన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు చాలా బాగున్నాయని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 11వేల మంది పోలీస్ సిబ్బందిని నియమించామని తెలిపారు. త్వరలో మరో14వేల మంది నియామకం చేపడతామన్నారు. నేరాల అదుపుకు అధునాతన పరికరాలను ఉపయోగిస్తున్నామని తెలిపారు. దాదాపు 500 మంది హోంగార్డులకు ఏడాదిలో నెల జీతం అందటం లేదని సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, సున్నం రాజయ్య, చింతల రామచంద్రా రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. వారికి న్యాయం చేస్తామని తెలిపారు. కానిస్టేబుళ్లకు పదోన్నతుల విషయం పరిశీలనలో ఉందన్నారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో 584 జాబ్‌మేళాలు నిర్వహించామన్నారు. భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఉస్మానియా, గాంధీ, నీమ్స్‌తో పాటు పలు విభాగాలు, జిల్లా వైద్యశాలల్లో ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారికి సుప్రీంకోర్టు తీర్పుకనుగుణంగా వేతనాలు చెల్లించాలని సభ్యులు అడిగారు. పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అధికారం వస్తామని బీజేపీ ఎమ్మెల్యేలు కలలు కనండి అంటూ విమర్శించారు.

పీహెచ్‌సీల్లో శిశు మరణాలు లేవు

- నిరుపేదల కోసం బస్తీ దవాఖానలు
- అసెంబ్లీలో మంత్రి లక్ష్మారెడ్డి



హైదరాబాద్, మార్చి 24(మనం ప్రతినిధి): కోహెడ పీహెచ్‌సీ పరిధిలో 2017 ఏప్రిల్ నుంచి 2018 ఫిబ్రవరి వరకు శిశు మరణాలు నమోదు కాలేదని వైద్య ఆరోగ్య మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. కోహెడ పీహెచ్‌సీలో వైద్యుల నియామకం అంశంపై పాతూరి సుధాకర్‌రెడ్డి వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ.. ఈ పీహెచ్‌సీల్లో గత ఏడాది 11 ప్రసవాలు జరిగాయన్నారు. పీహెచ్‌సీలో మొత్తం 29 పోస్టులు భర్తీ అయ్యాయని, అందులో 25 పోస్టుల్లో సిబ్బంది పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కాగా, హైదరాబాద్ జంట నగరాల మురికివాడల్లో నివసిస్తున్న పేద ప్రజల ఆరోగ్యంకోసం, వారికి అందుబాటులోకి వైద్య సదుపాయాలను తీసుకురావానికి బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. మురికివాడల్లో బస్తీ దవాఖానాలు అంశంపై ఎం.ఎస్ ప్రభాకర్‌రావు, సుంకరి రాజు వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ... ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సర్వీసులను ఏర్పాటు చేయడానికి జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రత్యేకించి మురికివాడల్లో 45 బస్తీ దవాఖానాలను ప్రతిపాదించినట్టు తెలిపారు. ఏప్రిల్ నుంచి 17 దవాఖానాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

సంచార ఆహార ప్రయోగశాలలు

తెలంగాణలోనూ న్యూఢిల్లీ తరహా సంచార ఆహార పరీక్ష ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. సంచార ఆహార ప్రయోగ శాలలపై సభ్యుల ప్రశ్నలకు మంత్రి వివరణ ఇస్తూ.. రాష్ట్రంలో ఒక ఆహార పరీక్ష ల్యాబ్ ఉందని, అందులో 32మంది సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కేంద్రాల్లో సిబ్బందిని పెం చనున్నామన్నారు. ఫిబ్రవరి 5 నుంచి ఆహార భద్రత వాహనాన్ని ప్రభుత్వం ప్రారం భించిందన్నారు. పాలు, పాల ఉత్పత్తులలో కల్తీని సంచార ఆహార పరీక్ష ల్యాబొరేటరీ విశ్లేషిస్తుందన్నారు. ఇతర ఆహారాల్లో కల్తీని కూడా పరీక్షిస్తుందన్నారు. సంచార యూనిట్ సత్వరంగా ఫలితాలను సమకూర్చి, శాంపిల్ సేకరణ, విశ్లేషణ, రిపోర్టింగ్ మధ్య కాల వ్యవధిని కూడా తగ్గిస్తుందన్నారు. మరింత విస్తృత పరీక్షలు అవసరమున్న శాంపిల్స్‌ను నిర్దిష్ట ప్రదేశంలో ఉన్న ల్యాబోరేటరికీ పంపుతారని తెలిపారు. రాష్ట్రంలో సంచార ఆహార ల్యాబోరేటరీ మారుమూల ప్రాంతాలు, అధిక జన సాంద్రతలకు వర్తింపు అవుతుందన్నారు.


నేరాలకు అడ్డాగా హైదరాబాద్

- దేశంలోనే నగరానికి రెండోస్థానం: చింతల



హైదరాబాద్, మార్చి 24(మనం ప్రతినిధి): దేశవ్యాప్తంగా నేరాల్లో ఢిల్లీ తర్వాత హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచిందని బీజేపీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శాసన సభలో పద్దులపై చర్చలో ఎమ్మెల్యే మాట్లాడారు. హైదరాబాద్‌లో సెక్స్ రాకెట్లు పెరిగిపోయిందని, ఎక్కడా దొరకని డ్రగ్స్ కూడా నగరంలో దొరుకుతున్నాయని చెప్పారు. మహిళలపై జరుగుతున్న దాడులను ఎందుకు ఆరికట్టలేకపోతున్నారని విమర్శించారు. నయీం కేసు వ్యవహారం ఎంతవరకు వచ్చిందని, ఎంతమంది ప్రముఖ రాజకీయ నాయకులను అరెస్టు చేశారని ప్రశ్నించారు. దాదాపు 15 రోజుల పాటు ప్రసార మాధ్యమాల్లో మారుమోగిన నయీం కేసును నీరుగార్చారని, అసలేం జరిగిందో స్పష్టం చేయాలని కోరారు. నక్సలైట్ల ఉనికి మళ్లీ పెరిగిందని, ఎన్‌కౌంటర్లలో చనిపోయిన పోలీసుల కుటుంబాలను ఆదుకోవాలని చెప్పారు. హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ట్రాఫిక్ సెన్స్‌ను ప్రజల్లోకి తీసుకురావాలని సూచించారు. కార్మికులకు కనీస వేతన చట్టాన్ని తీసుకురాలేకపోయారని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో మూతపడిన 6500 చిన్న తరహా పరిశ్రమలను తెరిపిస్తారన్నారని, ఇంతవరకు ఒక్క పరిశ్రమను తెరిపించలేదని చెప్పారు. పటాన్‌చెరువు, ఐడీఎల్ బొల్లారం వంటి ప్రాంతాల్లో కాలుష్యం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. చిన్న పరిశ్రమలు తయారు చేసిన వస్తువులను రాష్ట్రంలోనే వాడుకునేలా తెచ్చిన జీవో నం.51ను తుంగలో తొక్కారని పేర్కొన్నారు.

వీఐపీ కల్చర్‌ను తగ్గించాలి: సండ్ర




హైదరాబాద్, మార్చి 24(మనం ప్రతినిధి): రాష్ట్రంలో వీఐపీ కల్చర్ తగ్గించాలని, అనవసరపు వ్యక్తులకు పోలీసు ఎస్కార్ట్ కల్పించడం సరికాదని టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శాసనసభలో పలు పద్దులపై శనివారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సమకూర్చిన అత్యాధునిక వాహనాలను పోలీసులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. 24 గంటలు తాగమని పబ్‌లకు అనుమతిచ్చి.. రోడ్ల మీద డ్రంక్ అండ్ డ్రైవ్‌ల నిర్వహించి కేసులు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, కొత్త కమిషనరేట్లలో సిబ్బంది, వసతి సౌకర్యాలను పెంచాలని చెప్పారు. 500 మంది హోంగార్డులకు బడ్జెట్ కేటాయించక.. నెలరోజుల పాటు డ్యూటీలు వేయడం లేదని పేర్కొన్నారు. కానిస్టేబుల్స్‌కు ప్రమోషన్లు కల్పించాలన్నారు. సత్తుపల్లిలో ఏర్పాటుచేస్తామన్న ఫుడ్‌పార్కును త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్మికశాఖలో కాలం చెల్లిన జీవోలను సంస్కరిం చాలన్నారు. కార్మికులకు హెల్త్‌కార్డులు, సహజ మరణం పొందితే రూ.2లక్షలు, ప్రమాదంలో మరణిస్తే.. రూ.8లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. టూరిజం శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న 240 మందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

సుందరంగా వేములవాడ


- టెంపుల్ సిటీకి ఆధునిక హంగులు
- సమగ్ర ప్రణాళికలు రూపొందించండి
- వీటీడీఏ అధికారులతో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, మార్చి 24 (మనం ప్రతినిధి): రాష్ట్రంలోని ప్రముఖ శైవ క్షేత్రం వేములవాడ పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని మంత్రి కేటీఆర్ తెలిపారు. శనివారం అసెంబ్లీ హాలులో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీడీఏ) సంస్థ అధికారులతో మంత్రి సమీక్షించారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా పట్టణాభివృద్ధిని సమగ్రంగా చేసేందుకు ఒక విజన్‌తో ముందుకు పోవాలని అధికారులను ఆదేశించారు. అథారిటీల పరిధిలోకి పట్టణ పరిసర ప్రాంతాలను, ముంపు గ్రామాలను తీసుకుని వచ్చి, వాటిన్నంటిని వేములవాడ పట్టణ అభివృద్ధితో అనుసంధానం చేయాలన్నారు. మాస్టర్ ప్లాన్లో 5,10,25 సంవత్సరాలకు అందుకోవాల్సిన లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. భవిష్యత్తులో జరగాల్సిన అభివృద్ధికి, జనాభాకు, భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. దేవాలయ డిజైన్లను సీఎం పరిశీలిస్తారని తెలిపిన మంత్రి, పట్టణంలో చేపట్టే సివిల్ వర్క్స్(భవనాలు, బ్రిడ్జీలు, రోడ్ల) లో చోళ-చాళుక్య శిల్ప కళ ఉట్టిపడేలా చూడాలన్నారు. పట్టణంలో ప్రవేశించగానే ఒక టెంపుల్ టౌన్‌కు వచ్చామనే భావన కలిగేలా సర్వంగా సుందరంగా తీర్చిదిద్ది సదుపాయాలు కల్పించాలన్నారు. పారిశుద్ధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో విస్తరించనున్న రోడ్లలతోపాటు, పట్టణంలో గ్రీనరీ పైన ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గుడిచెరువులోకి మురికి



నీరు రాకుండ, ఒక నాలాను ఏర్పాటు చేయాలన్నారు. ఒక్క మురికినీటి చుక్క గుడి చెరువులోకి రావద్దని, ఇందుకు సంబంధించి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న బస్టాండ్ నుంచి దేవాలయం వరకు కేబుల్ కార్ ఏర్పాటును పరిశీలించాలన్నారు. పట్టణంలో భక్తుల సౌకార్యార్థం ఉచితంగా బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. వీటీడీఏ అభివృద్ధి పనులను స్వయంగా పర్యవేక్షిస్తానని, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కూమార్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తారని తెలిపారు. త్వరలోనే వేములవాడలో పర్యటించి అక్కడి పనులను క్షేత్ర స్థాయితో పరిశీలిస్తామని తెలిపారు.

రాష్ట్రంలో 99 మొబైల్ వెటర్నరీ క్లినిక్‌లు: తలసాని



హైదరాబాద్, మార్చి 24(మనం ప్రతినిధి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 99 మొబైల్ వెటర్నరీ క్లినిక్‌లు ఉన్నాయని పశు సంవర్ధక శాఖ మంత్రి తెలిపారు. సంచార పశు వైద్యశాలలు అంశంపై ఉల్లోల్ల గంగాధర్‌గౌడ్, మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ.. ఇప్పటి వరకు మొబైల్ వెటర్నరీ క్లినిక్‌లకు 2,84,921 కాల్స్ అందాయన్నారు. అందులో 2,28,899 కేసులకు చికిత్స చేసినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలోని పశువుల సంరక్షణ దృష్టిలో ఉంచుకుని ఈ మొబైల్ వాహనాల సంఖ్యను పెంచే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు.

> నాయకులు అన్నవాళ్లు ఎప్పుడైనా ప్రజాభిమానం చూరగొనాలంటే ఆయా ప్రాంతాలు లేదా నియోజకవర్గాలలో ఉన్న ప్రధాన సమస్యలు ఏమిటి?.. వాటిని ఎంతకాలంలో ఎలా తీరుస్తామన్న విషయాలను ప్రస్తావించాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉండేవాటికంటే ఎవరికి వారికి తమ ఇంటిముందు రోడ్డు, మంచినీళ్లు.. ఇవే పెద్ద సమస్యలు అవుతాయి. కనీసం నియోజకవర్గ స్థాయి సమావేశాలకు హాజరైనప్పుడైనా అవతలివాళ్లను తిట్టడానికి ఉపయోగించే సమయంలో పావువంతు అభివృద్ధి గురించి మాట్లాడితే జనం కాస్త సంతోషిస్తారు. ప్రతిరోజూ వాళ్ల నోళ్ల నుంచి వచ్చే తిట్ల పురాణాన్ని వినలేక చెవులు చిల్లులు పడుతున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్న విషయాన్ని ఇప్పటికైనా పాలకులు గుర్తించాలి.



సమయమంత్రి
చంద్రశేఖర శర్మ

మననం

తిట్ల పురాణం

రాజకీయాలు అంటే చాలు.. తిట్లతోనే మొదలవుతాయి, తిట్లతోనే ముగుస్తాయి అన్నట్లుగా ప్రస్తుత పరిస్థితి కనిపిస్తోంది. ఎదుటివాడిని మనం ఒకమాట అంటే వాడు పది మాటలు అంటాడన్న కనీస స్పృహ కూడా లేకుండా ఎవరికి వాళ్లు తిట్ల పురాణం లంకించుకుంటున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ప్రత్యేకహోదా చుట్టూనే రాజకీయాలన్నీ తిరుగుతున్నాయి కాబట్టి దాని చుట్టూనే ఈ తిట్ల వ్యవహారం కూడా సాగుతోంది.

అందరూ అందరే!

సాక్షాత్తు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి దగ్గర నుంచి ఆయన పార్టీలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. ఇలా ప్రతి ఒక్కరూ అవతలి పార్టీల వాళ్లను తమ నోటికి వచ్చినట్లు తిట్టడానికే ప్రయత్నిస్తున్నారు. రాజ్యసభ సభ్యుడైన వేణుంబాక విజయసాయిరెడ్డి ఎంపీ హోదాలో ప్రధానమంత్రి కార్యాలయానికి వెళ్లారు. ఢిల్లీలో ఉన్నప్పుడు.. అందులోనూ ఎంపీ అయినప్పుడు ఏదో ఒక పనిమీద ప్రధాని దగ్గరకో, ఇతర అధికారుల దగ్గరకో వెళ్లడం సర్వసాధారణం. కానీ, జగన్ ఆస్తుల కేసులో ఎ2 నిందితుడిగా ఉన్నారని, విజయసాయిరెడ్డి మీద చంద్రబాబు అసెంబ్లీలోను, టెలికాన్ఫరెన్సులలోను, ఇంకా బహిరంగ సభల వేదికల మీద.. ఇలా ఎక్కడ చాన్సు దొరికితే అక్కడ తిట్లు లంకించుకుంటున్నారు. ఏకంగా 'పీఎంవోలోనే వెళ్లి కాపురం పెట్టండి' అనే వరకు చంద్రబాబు వెళ్లారు. ఎ1, ఎ2 లకు ప్రధాని కార్యాలయంలో పనేంటి అని ప్రశ్నిస్తున్న ముఖ్యమంత్రి.. అదే సమయంలో ఆయన ఒక ఎంపీ అన్న విషయాన్ని ఎందుకు గుర్తించరో అర్థంకావడం లేదు. ఒకసారి అంటే సరి.. రెండు సార్లంటే పోనీలే అని ఊరుకున్నా ఆ ప్రవాహం ఆగకపోయేసరికి తాను సభాహక్కుల ఉల్లంఘన తీర్మానం ఇస్తానని విజయసాయిరెడ్డి చెప్పారు. దాని చుట్టూ కూడా కొంతమంది నాయకుల తిట్లు తిరుగుతూనే ఉన్నాయి. ఇక ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్నట్లు అధినేత బాటలోనే తెలుగు తమ్ముళ్లు కూడా నడుస్తున్నారు. ప్రత్యేక హోదా కోసం చంద్రబాబు దగ్గర నుంచి తమ పార్టీ నాయకులంతా చాలా కష్టపడుతున్నామని, చంద్రబాబు కూడా బస్సుల్లోనే తిరుగుతూ, వాటిలోనే నిద్రపోతూ పోరాటం చేస్తుంటే సినిమా వాళ్లు మాత్రం ఏసీ రూమ్ల్లో కులుకుతున్నారని ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ విమర్శించడం మరోసారి తేనెతుట్టెను కదిలించింది. రాజేంద్రప్రసాద్ వ్యాఖ్యల మీద సినీరంగంలో కాస్త దూకుడు ఎక్కువగా ఉండే పోసాని కృష్ణమురళి పలు సందర్భాల్లో గట్టిగానే స్పందించారు. తమలపాకుతో నువ్వొకటంటే తలుపు చెక్కతో నే రెండంటా అన్నట్లుగా పోసాని ఇంకా చాలా ఘాటుగా రియాక్షన్ ఇచ్చారు. ఒకసారి ప్రత్యేకహోదా కావాలని, మరోసారి అదేమీ సంజీవని కాదని, ఇంకోసారి మళ్లీ హోదా ఇచ్చి తీరాలని ఇలా చంద్రబాబు మూడు నాలుగుసార్లు మాట మార్చారని, ప్రతిసారీ ఆయన ఏమంటే అదే అంటూ వెనక తిరగడానికి తామేమైనా గొర్రెలమా అని నిలదీశారు. నిజమే మరి.. పోసాని మాటల్లో కూడా కఠోర వాస్తవం ఉంది. ఇదే విషయాన్ని ఒకవైపు ప్రతిపక్ష పార్టీలు, మరోవైపు ప్రజలు, ఇంకోవైపు సినీపరిశ్రమ వర్గాలు సూటిగా నిలదీస్తున్నాయి. వాళ్లకు సమాధానం చెప్పలేక ఎదురుదాడికి దిగుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు నిజానికి ఈ విషయంలో ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆ పని మానేసి తమకు వచ్చిన ఏకైకభాష అన్నట్లుగా తిట్ల పురాణానికి తెగబడుతున్నారు.

> ప్రతిపక్షాల వాళ్లను చవటలు, సన్నాసులు, ఎందుకూ పనికిరాని దద్దమ్మలు అనడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పీహెచ్‌డీ తీసుకున్నారు. ఆయన అధికారంలోకి వచ్చింది మొదలు ఇప్పుడు మళ్లీ ఎన్నికలకు సిద్ధం అవుతున్నంత వరకు దాదాపు ప్రతి సందర్భంలోనూ ప్రతిపక్షాల మీద దుమ్మెత్తి పోయడానికి అస్త్రశస్త్రాలను సిద్ధంగానే ఉంచుకుంటారు. కాంగ్రెస్, బీజేపీల మీద ఆయన చేసే విమర్శలు లక్ష్మణరేఖను ఎప్పుడో దాటిపోయాయి. సహజంగానే ఆయన అడుగుజాడల్లో నడిచే మంత్రివర్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు సైతం అదే భాషను అందిపుచ్చుకున్నారు.

జగనూ తక్కువేం తినలేదు

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు మూడువేల కిలోమీటర్ల మేర పాదయాత్ర చేస్తున్న ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాను కూడా ఏమీ తక్కువ తినలేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఆయన సైతం తన ప్రసంగాలలో తాను ఏం చేస్తానన్న విషయాలు తక్కువగాను, చంద్రబాబు మీద విమర్శల డోసు ఎక్కువగాను చేస్తున్నారు. దాదాపు నాలుగేళ్ల కాలంలో ఆయన చేసిందేమీ లేదంటూ విమర్శలు, ఇంకా మాట్లాడితే తిట్లతోనే వీలైనంత ఎక్కువ కాలం గడిపేస్తున్నారు. అందులో భాగంగానే చంద్రబాబును చవట, దద్దమ్మ, అబద్ధాల తల్లికి పుట్టిన ముద్దుల కొడుకు.. ఇలాంటి తిట్లు, శాపనార్థాలు అందుకుంటున్నారు. నిజం మాట్లాడితే తల బద్దలైపోతుందన్న రుషి శాపం చంద్రబాబుకు ఉందని కూడా జగన్ పదేపదే వల్లిస్తుంటారు. ఇక వీళ్లందరూ మాట్లాడినప్పుడు తానెందుకు మాట్లాడకూడదని.. తాజాగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ సైతం రంగంలోకి దిగారు. ఇప్పటివరకు సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడు కాబట్టి రాష్ట్రానికి మంచి చేస్తాడని నమ్మకంతో తాను ఆయనకు మద్దతిచ్చాను గానీ నిజానికి చంద్రబాబు, ఆయన కొడుకు లోకేశ్ పచ్చి అవినీతిపరులంటూ ముద్రవేసేశారు. చంద్రబాబుకు తెలిసే ఆయన కొడుకు అవినీతికి పాల్పడుతున్నాడని సూత్రీకరించారు. పోలవరం కాంట్రాక్టు పనులను ప్రైవేటు వాళ్లకు ఎందుకు కట్టబెట్టారంటూ దాని వెనుక దురుద్దేశం ఆపాదించారు. ఉన్నవాళ్లలో కొంత సున్నితంగానే అయినా తనవంతు తిట్ల పురాణాన్ని పవన్ సైతం వినిపించారు. కానీ ఇప్పటివరకు మిగిలిన ప్రతిపక్ష నాయకులందరూ ఎక్కువగా చంద్రబాబును మాత్రమే టార్గెట్ చేస్తే వెరైటీగా పవన్ కల్యాణ్ మాత్రం కొత్తగా లోకేష్ మీద బురద చల్లడం మొదలుపెట్టారు. అందుకు తనవద్ద ఆధారాలు కూడా ఉన్నాయన్నారు. మరోవైపు బీజేపీ ఫైర్‌బ్రాండ్ నాయకుడిగా పేరొందిన సోము వీర్రాజు అందరి కంటే రెండాకులు ఎక్కువ చదివినట్లున్నారు. ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వడానికి కేంద్రం సుముఖంగానే ఉన్నా చంద్రబాబు మాత్రం ఇసుక నుంచి మట్టి వరకు, పోలవరం నుంచి పట్టిసీమ వరకు లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డారని, అందుకే ఇవ్వడం లేదని అన్నారు. చివరకు బడిపిల్లల టాయిలెట్ల డబ్బులను సైతం చంద్రబాబు నాకేశారంటూ తిట్ల డోసును పీక్ స్టేజికి తీసుకెళ్లిపోయారు. కొత్తగా పింఛన్లు ఇవ్వాలంటే మూడు నెలల డబ్బులు ముందే లంచంగా తీసుకుంటున్నారంటూ టీడీపీ ప్రభుత్వ హయాంలో పెరిగిపోయిన అవినీతిని ఆయన బట్టలు విప్పి చూపించేస్తున్నారు. బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా సైతం ఈ తిట్ల పురాణంలోకి ప్రవేశించారు. రాజకీయ దురుద్దేశంతోనే చంద్రబాబు ఎన్డీయ కూటమి నుంచి పక్కకు వెళ్లారని ఆయన అంటున్నారు. ఒకళ్లు మొదలుపెడితే దాన్ని కొనసాగించడానికి వందమంది సిద్ధంగా ఉంటారన్న విషయాన్ని నాయకులు తెలుసుకోవాలి.



ఇలా ఎంతమంది కృష్ణులో?!

ప్రజాస్వామ్యంలో ప్రజల సంక్షేమం కోసం కృషిచేయాల్సిన నాయకులు పరస్పర నిందారోపణలతోనే కాలం వెళ్లబుచ్చేస్తున్నారు. ప్రజలకు కావల్సినవి ఏంటి? వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలేంటి, వాటికి ఎలాంటి పరిష్కారాలు చూపించాలి? అన్న విషయాలను పూర్తిగా పక్కన పెట్టి ఎన్నికల కాలం వస్తోంది కాబట్టి అవతలి వాళ్లను ఎంత వెధవలను చేస్తే మనల్ని అంత మంచివాళ్లుగా చూస్తారన్నట్లుగా అనుకుంటున్నారు. నాటకాలలో ఒకటో కృష్ణుడు, రెండో కృష్ణుడు, మూడో కృష్ణుడు అని ఉంటారు. వేదిక మీద ఒకరి తర్వాత ఒకరుగా వచ్చి తమవంతు డైలాగులు చెప్పి వెళ్లిపోతుంటారు. అలాగే సరిగ్గా ఇప్పుడు రాజకీయ వేదిక మీద కూడా దాదాపు ఐదారుగురు కృష్ణులు కనిపిస్తున్నారు. వాళ్లంతా తర్వాత వాళ్లతోను, ముందువాళ్లతోను తమకు సంబంధం లేదన్నట్టుగా తమవంతు డైలాగులు చెప్పి వెళ్లిపోవడానికే పరిమితం అవుతున్నారు. వాళ్లలో ఒక కృష్ణుడు చంద్రబాబు అయితే.. ఆ తర్వాత వరుసపెట్టి రాజేంద్రప్రసాద్, పోసాని కృష్ణమురళి, వైఎస్ జగన్, పవన్ కల్యాణ్, సోము వీర్రాజు.. ఇలా ఈ జాబితా హనుమంతుడి తోకలా పెరిగిపోతూనే ఉంటోంది.

తెలంగాణలోనూ ఇదేతంతు!

తెలంగాణలోనూ ఇలాంటి తిట్ల పురాణానికి కొదవేమీ లేదు. ప్రతిపక్షాల వాళ్లను చవటలు, సన్నాసులు, ఎందుకూ పనికిరాని దద్దమ్మలు అనడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పీహెచ్‌డీ తీసుకున్నారు. ఆయన అధికారంలోకి వచ్చింది మొదలు ఇప్పుడు మళ్లీ ఎన్నికలకు సిద్ధం అవుతున్నంత వరకు దాదాపు ప్రతి సందర్భంలోనూ ప్రతిపక్షాల మీద దుమ్మెత్తి పోయడానికి అస్త్రశస్త్రాలను సిద్ధంగానే ఉంచుకుంటారు. కాంగ్రెస్, బీజేపీల మీద ఆయన చేసే విమర్శలు లక్ష్మణరేఖను ఎప్పుడో దాటిపోయాయి. సహజంగానే ఆయన అడుగుజాడల్లో నడిచే మంత్రివర్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు.. ఇతర నాయకులు సైతం అదే భాషను అందిపుచ్చుకున్నారు. సమయం, సందర్భం దొరికినా, దొరక్కపోయినా తమంతట తామే సృష్టించుకుని మరీ తిడుతుంటారు. కాంగ్రెస్ వైపు నుంచి జానారెడ్డి లాంటి పెద్దమనుషులు మాత్రమే ఇన్నాళ్లూ ఉండటంతో టీఆర్ఎస్‌ను దీటుగా తిట్టడం ఎలాగా అని ఇంతకాలం వెతుకుతుంటే, వాళ్లకు వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టుగా రేవంత్‌రెడ్డి వచ్చి ఆ పార్టీలో చేరారు. ఇక కాంగ్రెస్ పార్టీ వైపు నుంచి కూడా దూషణభూషణ తిరస్కారాలు దండిగానే మొదలైపోయాయి. తన సహజసిద్ధమైన శైలిలో రేవంత్‌రెడ్డి సైతం టీఆర్ఎస్ అగ్రనాయకత్వం మీద తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. మిషన్ కాకతీయను కమీషన్ కాకతీయ అని మొదలుపెట్టి ఇక ఫుల్‌స్టాప్ అన్నది లేకుండా తిట్లపురాణం లంకించుకుంటున్నారు.

నాయకులు అన్నవాళ్లు ఎప్పుడైనా ప్రజాభిమానం చూరగొనాలంటే ఆయా ప్రాంతాలు లేదా నియోజకవర్గాలలో ఉన్న ప్రధాన సమస్యలు ఏంటి.. వాటిని ఎంత కాలంలో ఎలా తీరుస్తామన్న విషయాలను ప్రస్తావించాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉండేవాటికంటే ఎవరికి వారికి తమ ఇంటిముందు రోడ్డు, మంచినీళ్లు.. ఇవే పెద్ద సమస్యలు అవుతాయి. కనీసం నియోజకవర్గ స్థాయి సమావేశాలకు హాజరైనప్పుడైనా అవతలివాళ్లను తిట్టడానికి ఉపయోగించే సమయంలో పావు వంతు అభివృద్ధి గురించి మాట్లాడితే జనం కాస్త సంతోషిస్తారు. ప్రతిరోజూ వాళ్ల నోళ్ల నుంచి వచ్చే తిట్ల పురాణాన్ని వినలేక చెవులు చిల్లులు పడుతున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్న విషయాన్ని ఇప్పటికైనా పాలకులు గుర్తించాలి.

క్షీణిస్తున్న కుటుంబ సంస్కృతి, విలువలు

మానవసంబంధాలకు మచ్చ తెచ్చే సంఘటనలు ఇటీవల విరివిగా వెలుగుచూస్తున్నాయి. బంధాలు, అనుబంధాలు మటుమాయమైపోయి తాత్కాలిక సుఖాల కోసం అడ్డదారులు తొక్కి తమ జీవితాలను అంధకారంలోకి నెట్టుకొనే స్వయంకృతాపరాధ సంఘటనలు మానవుల నీతిబాహ్యతనాన్ని వెల్లడిచేస్తున్నాయి. ప్రేమానురాగాలతో, సుఖసంతోషాలతో, ధర్మార్థకామంలోనూ సమంగా పంచుకొని జీవిస్తామని చేసిన బాసట మరిచిపోయి అనతికాలంలోనే ఆయుషును వదిలి తనువును చాలిస్తూ జరిగే చర్యలు మానవ సంబంధాలను మంటగలుపుతున్నాయి. మూడుముళ్ళ సాక్షిగా చేసిన బాసటను మరిచి పరాయిబంధాలను అరువు తెచ్చుకొని సత్సంబంధాలను అపహాస్యం చేస్తున్నారు. మూడుముళ్ళ బంధం మధ్యలోనే తెంచుకొని తన జీవితాలను అంధకారబంధురం చేసుకొని బందిఖానాలకు బానిసలవుతున్నారు. రంగుల లోకంలోని కల్పిత పాత్రలు, సన్నివేశాలను నిజంచేస్తూ తమజీవితాలను కకావికలం చేసుకొంటూ తిమిరంలోకి జారుతున్నారు. బంధాలు, అనుబంధాలు, ఆత్మీయతతో సకలమతాల మేళవింపుతో అన్యోన్యంగా జీవించే భారతావని సంస్కృతికి విదేశీయులు సైతం దాసోహ మంటూ బంధుత్వాలతో పెనవేసుకుంటున్నారు. కానీ ఇటీవలి కాలంలో మానవసంబంధాలు సిగ్గుపడేలా భార్యాభర్తల బంధుత్వాలు అపనమ్మకంతో పెనవేసుకొని అపహాస్యం పాలవుతున్నాయి. సంస్కృతీసంప్రదాయాలకు పుట్టినిల్లయిన భరతభూమి భావిపౌరుల చేష్టలతో మదనపడి తల్లడిల్లుతోంది.

ఆధునిక భారతావని రూపకల్పనలో అడుగులు వడివడిగా పడుతూ సమాజ శ్రేయస్సును కాంక్షించే విభిన్న రకాల అభివృద్ధి పనులతో మానవాళి జీవన ప్రమాణాలు మెరుగుపడుతూ, అత్యున్నత, ఆధునిక సౌకర్యాలను అనుభవిస్తూ భోగభాగ్యాలు అనుభవిస్తున్నా విలువలు మాత్రం కుచించుకుపోతున్నాయి. నిత్యనూతనత్వంతో కళకళలాడాల్సిన కుటుంబ సంప్రదాయాలు కనుమరుగై ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నుంచి విడివడిగా జీవించే కుటుంబాలు అధికమై అమానవీయ సంఘటనలకు ఆజ్యం పోస్తున్నాయన్న వాదనలు లేకపోలేదు. వాస్తవాస్తవాలను పక్కన పెడితే సమస్యతో సతమతమయ్యే సమయంలో దిశానిర్దేశకులు సహజత్వానికి, సాన్నిహిత్యానికి ఎడబాటు కావాల్సివస్తే సమాజపరంగా, చట్టపరంగా విడివడి జీవించే అనేక సంప్రదాయాలు వాడుకలో ఉన్నాయి. అలా జీవించే మార్గాలను అన్వేషించకుండా మట్టుబెట్టి మటుమాయం చేసే హింసా ప్రవృత్తి పెచ్చుమీరుతోంది. ఇదిలా ఉంటే సమాజంలో ఆధునికపోకడలు పెరిగి, విదేశీ సంస్కృతిని వంటబట్టించుకొని చేసే పలురకాల కార్యక్రమాలు మానవ సంబంధాలను క్షీణింపజేస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు విద్యాధికుల్లోనే అధికంగా ఉంటున్నాయన్న విమర్శలు కొట్టిపారేయలేనివి. స్వేచ్ఛ, సమానత్వం పేరుతో జరిగే పలు చర్యలు బంధాలను అంధకారం చేస్తున్నాయి. మనిషి జంతువులా వ్యవహరించే స్వేచ్ఛ, సమానత్వానికి అడ్డుకట్ట వేయకపోతే సమాజం తిరోగమనంలో పయనిస్తుంది. సమాజం ఎంతగా అభివృద్ధి చెందినా విద్య, ఆధునిక విజ్ఞానం పెరిగినా సమాజం శాంతికాముకంగా పయనించాలంటే స్వయం నియంత్రణాచర్యలు ఆవశ్యకం. సంస్కృతీసంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్లు పేరుతో సమాజం కట్టుదిట్టమైన చర్యలతో స్వయంనియంత్రణ పేరుతో ముందుకు సాగుతూ ఉండేది. అలా అనీ ఆచారాలు, కట్టుబాట్లు, సంప్రదాయాలు శాస్త్రీయత లోపించి గుడ్డిగా ఆచరించడం సరికాదు. కానీ ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవడం, విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వలసలు పెరిగి సుదూర ప్రాంతాలల్లో జీవించడం లాంటి చర్యలు అధికమై పాతకాలం నాటి జీవనసంస్కృతి చుక్కానిలేని నావలా తయారైంది. అయినా సమాజంలో విద్య, విజ్ఞానం పెరిగి పౌరులు సమాచార వ్యాప్తితో స్వంత నిర్ణయాలతో బేరీజు వేసుకునే ఆధునిక పరికరాలు ఉపయోగిస్తూ సమాచార సాగరంలో ఓలలాడుతున్నా జీవనసాగరంలో మాత్రం తప్పటడుగులు వేస్తూ క్షణికావేశంతో అష్టకష్టాలపాలవుతున్నారు. ఇలా అరచేతిలో అంతర్జాలం వాడుతున్నా అర చేతిలో వైకుంఠం చూపే చర్యలు మానవాళికి మాయని మచ్చను మిగుల్చుతున్నాయి.

సమాజంలో హింసాప్రవృత్తి పెచ్చుమీరి అశాంతి కాముక చర్యలను నియంత్రించకపోతే సమాజం కకావికలమవుతుంది. ఇప్పటికే పెచ్చుమీరుతున్న హింసాప్రవృత్తికి ఎదుగుదలకు పలురకాల ప్రత్యక్ష, పరోక్ష చర్యలు బీజం వేస్తూ



హింసాయుతానికి ఆజ్యం పోస్తున్నాయి. మొక్కయి వంగనిది మానై వంగునా అన్నట్లు ఇలానే చూస్తూ ఉండిపోతే క్యాన్సర్ సమాజాన్ని ఆవహించి సర్వనాశనం చేసే అవకాశం లేకపోలేదు. అనుకున్నదే తడవుగా అందలమెక్కాలని ఆశించి అవకాశం కోసం, అవసరం కోసం అడ్డదారులు తొక్కి అభాసుపాలవుతున్న వారి సంఖ్య అధికమవుతోంది. వినోదం పేరుతో జరిగే అనేక కార్యక్రమాల్లోనూ హాస్యం కంటే అపహాస్యం కలిగించేవే అధికంగా ఆకర్షిస్తున్నాయి. ఇటీవల ఓ ఇల్లాలు తన భర్త మరణానికి తానే పథక రచన చేసిన దుశ్చర్యకు వినోదం పేరుతో జరిగే కార్యక్రమాలే ప్రేరణగా నిలిచాయన్న చేదునిజం పెడపోకడలను తేటతెల్లం చేస్తున్నాయి. వ్యాపారీకరణ ధోరణి అధికమై ఆకర్షణే ప్రధానంగా కాసులే ధ్యేయంగా జరుగుతున్న విలువలు అధోగతి పాలువుతున్నాయన్న విమర్శను సద్విమర్శ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉన్నత విద్యాలయాల నుంచి ప్రాథమిక విద్యాలయాల వరకు వివిధ కార్యక్రమాల పేరుతో వినోదం, విజ్ఞానం పెంచే కార్యక్రమాలు ఎంతవరకు మానవసంబంధాలు పెంపొందిస్తున్నాయో ప్రశ్నించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. శాంతి కాముక సమాజానికి బాటలు వేస్తున్నామా? అశాంతి కాముక సమాజానికి బాటలు పరుస్తున్నామా? అని ప్రశ్నించుకోవాల్సిన తరుణమిది. సమాజంలో విద్య, కళ, ఇతర రంగాలకు చెందిన వారు కూడా తమ నిజజీవితంలో అసంబద్ధ విధానాలతో అడ్డదిడ్డంగా పయనిస్తున్నారు. ఇలా సమాజంలో జరుగుతున్న అనేక చర్యలు చిరుమెదళ్ళను తొలుస్తూ చిన్నాభిన్నం చేసే సమాజం వైపు పయనింపచేసి తమ జీవితాలను అంధకారంలోకి నెట్టే యత్నాలు మనకు నిత్యం కనిపిస్తున్నాయి. ఇలాంటి అమానవీయ, మానవత్వం మంటగలిపే చర్యలను తీవ్రంగా పరిగణించకపోతే రాబోయే రోజుల్లో మరింత హింసాప్రవృత్తి పెరిగి జీవితాలను సవాలు చేస్తాయి. ప్రభుత్వాలు, పౌరసమాజం, విద్యా, స్వచ్ఛంద, ఇతర మానవీయ విలువలను పెంపొందించే సంస్థలు ఆదర్శ సమాజం కోసం కృషిచేయడం తప్పనిసరి. లేకపోతే రోజు రోజుకు పెచ్చుమీరుతున్న హింసాప్రవృత్తితో, క్షణికావేశాలతో, తాత్కాలిక సుఖాల కోసం భారతీయ సమాజం తీరని ఆవేదనను భరిస్తూ భారతమాత తల్లడిల్లుతుంది. ఇకనైనా పౌరులారా మేల్కొనండి. విశ్వ మానవ విలువల కల్యాణం కోసం నడుంబిగించి, ముందుకు కదలండి. శాంతికాముక సమాజాన్ని నిర్మించండి.

◆ ఎ.శ్యామ్‌కుమార్



నక్షత్రాలు

విద్య మిసిమిచ్చున్ విద్య వివేకమిచ్చున్.!
విద్య సచ్చరితమిచ్చున్ విద్య సకలంబిచ్చున్.!!
విద్య లేనివాడు వింత జీవి గదా.!!!

ధనవంతుడైనన్ ధనహీనుడైనన్
పీల్చు శ్వాసయొక్కటే.!
సంపన్నుడైనన్ సంపన్నహీనుడైనన్
హృదయ..ధ్వనొక్కటే.!!
ఐశ్వర్యవంతుడైనన్ ఐశ్వర్యహీనుడైనన్
మృత్యువొక్కటే.!!!

కంటికి రెప్ప, ఒంటికి త్వచం.!
గుండెకి చప్పుడు విధంబు.!!
అదే విధంబు నను రక్షింపుమ్ ఓ ముక్కంటి.!!!

- అఖిలాశ, బెంగుళూరు

కవిసంగమం సిరీస్ – 37

మూడుతరాల కవిసంగమం

25 మార్చి 2018, ఆదివారం సాయంత్రం 6 గంటలకు 'కవి సంగమం సిరీస్ – 37, మూడు తరాల కవిసంగమం' కార్యక్రమం తెలంగాణ సారస్వత పరిషత్, తిలక్ రోడ్, బొగ్గులకుంట, హైదరాబాద్ నందు జరుగును. ఈ కార్యక్రమంలో కవులు అల్లం నారాయణ, దయాకర్ వడ్లకొండ, పల్లిపట్టు, రమాదేవి బాలబోయిన, కృష్ణ గుగులోత్ పాల్గొననున్నారు.

- కవి యాకూబ్



దర్శనం

ప్రాధాన్యతలు అవకాశ వాదం

ప్రతి మనిషికీ విధిగా కొన్ని ధ్యేయాలుంటాయి. లేకపోతే పెట్టుకోవాలి. ఆ ధ్యేయం నెరవేరాలంటే ముందుగా ఏమి చేయాలి. ఎవరు కలిసి వస్తారు, ఎవరు అడ్డం పడతారు అనేవి నిర్ణయించుకోవాలి. ఆ కార్యం నెరవేర్చుకోవడం ప్రధానమవుతుంది. వాటినే ప్రాధాన్యతలు అంటారు. ఈ ప్రాధాన్యతలు కాలక్రమంలో మారుతుంటాయి. నమ్మకద్రోహం, దగా, నయవంచన, ఓడ మల్లన్న బోడి మల్లన్న అయిపోవడం, నిన్నటివరకూ నిన్ను నెత్తిన పెట్టుకున్న వారు ఇవాళ నిన్ను అసలు ఖాతరు చేయకపోవడం ఇవన్నీ కూడా ఈ ప్రాధాన్యతల మార్పు వల్ల జరిగేవే.

తమ తమ నెలవులు తప్పిన
తమ మిత్రులె శత్రులగుట
తథ్యము సుమతీ

అనే పద్యానికి అర్థం ఇదే. ఎప్పటికప్పుడు ప్రాధాన్యతలు మార్చుకోవడం చేతకానివాడు వెనుకబడిపోతాడు. వర్షంలో అక్కరకు వచ్చిందనీ, ఎండాకాలంలో పనికొచ్చిందనీ ఎప్పుడూ అవసరం లేకపోయినా గొడుగు పట్టుకు తిరిగేవాడు గొడుగు రాముడుగా మిగిలిపోతాడు. కృతజ్ఞతకు మారుపేరైన కర్ణుడు, వైఫల్యానికి కూడా మారుపేరు. కృష్ణుడు పిలిచినప్పుడు కర్ణుడు ఫిరాయించివుంటే కురు సామ్రాజ్యానికి అతనే రాజైవుండేవాడు. (తరువాత ధర్మరాజు చేతిలో ఖర్చు అయిపోయి వుండేవాడు, అది వేరే సంగతి) లాంగ్ మార్చ్‌లో మావోకు కలిసివచ్చిన మార్షల్ ఛూటే, టిన్‌సియావో పింగ్ మొదలైన వాళ్ళందర్నీ తర్వాత మావో గాలికి వదిలేశాడు. చంపాల్సిన ప్రత్యర్థుల్ని చంపి, అడవుల పట్టించాల్సిన వాళ్ళని అడవులు పట్టించాడు. అలాగ అడవులు పట్టిపోయిన పొట్టివాడు టిన్‌సియాలో సింగ్ అపారమైన మేథాశక్తితో తర్వాత మావోను, అతడి భార్యనూ ఓడించి, చైనా కమ్యూనిస్టు పార్టీ మీద పెత్తనం సంపాదించి, చివరకు కమ్యూనిజాన్ని కూడా ఓడించాడు. ప్రాధాన్యతలను బట్టి అవసరానికి, కాలమానానికీ అనుగుణంగా మార్చుకోగలిగిన తెలివితేటలు పుష్కలంగా వున్నాయి కాబట్టి టిన్‌సియాలో పింగ్ గెలిచాడు.

డబ్బున్న భారతీయుల నుంచి లాక్కున్న కిరీటాన్ని ఇంగ్లీషువాడు మళ్ళీ డబ్బున్న భారతీయులకే అప్పజెప్పి వెళ్ళిపోయాడు. ఇంగ్లీషువాడు వెళ్ళిపోవడమే అంతవరకూ ప్రధానం కాబట్టి కాంగ్రెస్ నాయకులందరూ గాంధీ మహాత్ముడి కాళ్ళ దగ్గర పడివున్నారు. స్వాతంత్ర్య దినమైన 1947, ఆగస్టు 15 రోజున కాంగ్రెస్ వారందరూ నెహ్రూగారి కాళ్ళ దగ్గర, మౌంట్‌బాటిన్ కాళ్ళ దగ్గర పడి వున్నారు. ఆ రాత్రి గాంధీగారి దగ్గర చెరఖా మాత్రం వుంది. దేశానికి గాంధీగారి అవసరం తీరిపోయింది. గాంధీగారికి బలం తగ్గిపోయిందని తెలుసు కాబట్టే గాడ్సేగాడు అంత ధైర్యంగా గాంధీగార్ని చంపగలిగాడు. అవసరాలే ప్రాధాన్యతలను నిర్ణయిస్తాయి. ఏ ప్రాధాన్యతా శాశ్వతం కాదు. ఇది పాపపుణ్యాలకు, నీతి నిజాయితీలకు సంబంధించిన విషయం కాదు. ఈ లోకం పాటిస్తున్న మూలసూత్రాలకు సంబంధించిన విషయం. ఈ సంగతి గ్రహించి, మనమీద ఆధారపడినవారు ఎల్లప్పుడూ మన మీదే ఆధారపడాల్సిన దుస్థితి కల్పించాలి. మీ ఆశ్రితులు ఎన్నడు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పొందరాదు. ఆశ్రితులు లేనిదే మిమ్మల్ని ఎవరు మోస్తారు?

◆ కె.ఎన్.వై. పతంజలి

(గెలుపు సరే... బతకడం ఎలా? అన్న పుస్తకం నుంచి)



ఒక అక్షరం లక్ష మెదళ్లను కదిలిస్తుంది...అంత శక్తి మంతమైన అక్షరాన్ని రాయాలంటే.. రాసే వ్యక్తికి ఎంతటి ఆలోచనా శక్తి ఉండాలో కదా!. సమాజంలో జరుగుతున్న విషయాల నుండైనా.. మనిషి ఊహల్లో ఆలోచనల నుండైనా కథను తయారు చేసుకోవచ్చు. అయితే ఆ ఆలోచనలను ఒక అందమైన కథ రూపంలోకి తీసుకు రావడం చాలా కష్టం. అలాంటి కష్టాన్ని ఇష్టంతో చేస్తున్న అక్షర శ్రామికుడు విజయేంద్ర ప్రసాద్. సినిమా సక్సెస్‌లో హీరో ఇమేజ్ ముఖ్యమే.. అయితే ఆ ఇమేజ్‌కి ప్రాణం పోసేది బలమైన కథ, భావోద్వేగాలు. సినిమా చూసే ప్రేక్షకుడు సినిమాలో లీనమై ఆ సినిమాతో ప్రయాణించేలా చేయడం కథతోనే వీలవు తుంది. అలాంటి బలమైన, కట్టిపడేసే సన్నివేశాలతో కథను చెప్పడం కథకుడికే సాధ్యం. అలాంటి కథలతో ప్రేక్షకులకు మెస్మరైజ్ చేస్తున్న రచయిత వి.విజయేంద్ర ప్రసాద్. 'బాహుబలి', 'బజ్‌రంగీ భాయ్‌జాన్' చిత్రాలతో సక్సెస్ సాధించి ప్యాన్ ఇండియా రైటర్‌గా అవతరించారు. ఇప్పుడు తెలుగులోనే కాదు.. తమిళ, కన్నడ, హిందీ చిత్ర పరిశ్రమలకు చెందిన స్టార్స్ ఎందరో ఆయన కథ ఇస్తే చాలు అనుకుంటారు. ప్యాన్ ఇండియా రైటర్‌గా తెలుగువాడి సత్తాను చాటుతున్న వి.విజయేంద్ర ప్రసాద్‌తో మనం ఇంటర్వ్యూ....







మనం ఎక్స్‌క్లూజివ్

నేను గొప్ప తండ్రిని కాను!



వి. విజయేంద్ర ప్రసాద్

'బాహుబలి', 'భజరంగీ భాయ్‌జాన్' సినిమాల తర్వాత మీరు ప్యాన్ ఇండియా రైటర్ అయారు. ఆ సినిమాల సక్సెస్ పట్ల ఓ రచయితగా మీకెమనిపిస్తుంటుంది?

సినిమాలకు కథే ముఖ్యం. దీన్ని ఎవరూ కాదనలేరు. అటువంటి కథలకు ఎల్లలు లేవు అని నిరూపించిన చిత్రాలు 'బాహుబలి', 'భజరంగీ భాయ్‌జాన్'. ఇందులో 'భజరంగీ భాయ్‌జాన్' బాలీవుడ్ చిత్రం. బాలీవుడ్ స్టార్ సల్మాన్‌ఖాన్ నటిస్తే కబీర్‌ఖాన్ డైరెక్ట్ చేశారు. వీరి వల్ల సినిమా ప్రారంభం నుండే మంచి గుర్తింపు సంపాదించుకుంది. అయితే 'బాహుబలి' సినిమా విషయానికి వస్తే.. దక్షిణాది చిత్రం, రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా చేశారు. అయితే ఈ చిత్రం బాలీవుడ్‌లో కూడా చాలా పెద్ద హిట్ అయ్యింది. అందుకు కారణం మంచి కథ. అసలు 'బాహుబలి' కథేంటి? ఎలా తెరకెక్కించారు? అనే విషయాలను బాలీవుడ్ ప్రేక్షకులు ఆసక్తితో చూశారు. ఒక మంచి కథను అందంగా తెరకెక్కిస్తే.. భాషతో సంబంధం లేకుండా విజయం సాధిస్తుందని ఈ సినిమాతో మరోసారి ప్రూవ్ అయ్యింది. అలాంటి చిత్రంలో నేను కూడా ఓ భాగమైనందుకు హ్యాపీగా ఉన్నాను.

'బాహుబలి' వంటి లార్జర్ దేన్ లైఫ్ చిత్రాలకు కథలను అందించిన మీరు బడ్జెట్ పరిమితులు గురించి ఆలోచిస్తారా?

సాధారణంగా చిన్న సినిమాలు, పెద్ద సినిమాలని అంటుంటారు కానీ.. రచయితగా నాకు అలాంటి ఆలోచనలు రావు. సినిమా కథలు రాసే క్రమంలో బడ్జెట్ పరిమితులు గురించి ఆలోచించను. మంచి కథను తయారు చేయాలి, సదరు సినిమా డైరెక్టర్‌కి ఏం కావాలి? అనే దాన్ని దృష్టిలో పెట్టుకుంటానంతే.

క్రియేటివ్ వర్క్‌లో చాలా మానసిక ఒత్తిడి ఉంటుంది. అలాంటిది వివాదాలు వచ్చినప్పుడు మీ భావనెలా ఉంటుంది?

చాలా బాధగానే ఉంటుందండీ..! అయితే అలాంటి వాటిపై మనం రియాక్ట్ కావడం కూడా వ్యర్థమే. ఎక్కువగా ఆలోచిస్తే మన మనసే పాడవుతుంది. దాని వల్ల మన క్రియేటివ్ వర్క్ దెబ్బ తింటుంది. నిజం ఎప్పుడైనా బయటకు వస్తుందని గట్టిగా నమ్ముతాను. కాబట్టి వివాదాల గురించి పట్టించుకోను.

రాజమౌళిని కొడుకుగా ఎక్కువ ఇష్టపడతారా? లేదా టెక్నీషియన్‌గా ఎక్కువ ఇష్టపడతారా?

రెండూ ఇష్టమే... ఎందుకంటే.. రాజమౌళిది అరుదైన వ్యక్తిత్వం. జీవితం అంటే అవగాహన ఉన్న వ్యక్తి. జీవితంలో ఏదో సాధించేశామనే అతృతను కనపరచడు. పొరపాటున కూడా ఎదుటివారి గురించి చెడుగా మాట్లాడడు. ఎదుటి వారికి హాని చేయాలని ఎప్పుడూ ఆలోచించడు. ఆ విషయాన్ని నేను బాగా గమనించాను. ఇక టెక్నీషియన్‌గా (దర్శకుడిగా) అంటే వృత్తి పట్ల పరిపూర్ణమైన నిబద్ధత గల వ్యక్తి. ఒకే సినిమాను ఐదేళ్ల పాటు చేయడం అంటే ఎంతో కాన్‌సన్‌ట్రేషన్ ఉండాలి. ఆ శక్తి రాజమౌళికి చాలా ఉంది. అందుకనే తనని దర్శకుడిగా కూడా ఇష్టపడతాను.

రైటర్‌గా మీరు, డైరెక్టర్‌గా రాజమౌళి కాంబినేషన్‌లో అన్నీ బ్లాక్‌బస్టర్ హిట్సే.. మీ మధ్య ...?


ఓ రకంగా చెప్పాలంటే ఇద్దరం పెరిగిన వాతావరణమే మా మధ్య ఆలోచనలు సింక్ కావడానికి కారణంగా ఉండి ఉండొచ్చు. కథలంటే రాజమౌళికి చాలా ఇష్టం. తను అసిస్టెంట్ రైటర్‌గా కొన్ని రోజులు పనిచేశాడు కూడా. అప్పటి నుండి చేస్తూ వస్తున్న ప్రయాణంలో మా మధ్య వేవ్ లెంగ్త్ చక్కగా కుదిరింది. నాన్నగారి నుండి నాకేం కావాలి?. ఏం తీసుకోవాలి? అని తనకు బాగా తెలుసు. అలాగే తనకు ఏం కావాలి? అనేది ఓ రచయితగా నాకు తెలుసు. ఓ సినిమా చేసే సందర్భంలో తనకు ఎలాంటి కథ కావాలో రాజమౌళి ముందుగానే నాకు చెబుతాడు.

కథ రాసే సమయంలో రచయితగా మీ ఆలోచనెలా ఉంటుంది?

స్పీల్ బర్గ్ .. తన రైటింగ్ డిపార్ట్‌మెంట్‌లోని వారికి.. చెప్పాలనుకున్న కథను ఇరవై నాలుగు పదాల్లో చెప్పమని అంటారట. అలా ఓ కథను అంత చిన్నగా చెప్పినప్పుడు అందులో ఆసక్తికరంగా ఏదైనా ఉందనిపిస్తే అప్పుడు సినిమా కథ రెడీ చేయడానికి సిద్ధమవుతారట ఆయన. అలా నేను కథ చెప్పే క్రమంలో వీలైనంత తక్కువ భావాన్ని తీసుకుని అది ఇంట్రెస్టింగ్‌గా ఉందా? లేదా? అని ఆలోచిస్తాను. నాకు నేనుగా అది బావుందా? లేదా? అని ప్రశ్నించుకుంటాను. నాకు నచ్చితేనే నెక్స్‌ట్ లెవల్‌కు వెళతాను.

కథలు రాయడానికి ఎక్కువ సమయం తీసుకుంటారా?

అప్పటికప్పుడు నా ఆలోచనలతో కథలు చెప్పేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఉదాహరణకి 'సింహాద్రి' సినిమా విడుదలైన తర్వాత సక్సెస్‌టూర్‌కి వెళ్లాం. వైజాగ్ హోటల్‌లో ఉన్నప్పుడు రాజమౌళి నా దగ్గరకు వచ్చి.. నాన్నగారు 'సింహాద్రి అయిపోయింది..ఇంకేదైనా కొత్త కథ ఆలోచించండి' అన్నాడు. 'ఎలాంటి కథ కావాలి?' అని అడిగితే 'నాకు లవ్ స్టోరీ వద్దు.. హీరో హీరోయిన్స్‌లో ఎవరూ ఒకరు మరొకరి వెంట పడటం, ఐ లవ్ యూ చెప్పడం వంటి పాయింట్‌తో కథ వద్దు. నాకు స్పోర్ట్స్ అంటే చాలా ఇష్టం. కాబట్టి కాలేజ్ స్టోరీకి, స్పోర్ట్స్‌ను మిక్స్ చేసి కథను రెడీ చేయండి' అన్నాడు. వెంటనే నా ఆలోచనల నుండి వచ్చిన కథే 'సై'. ''ఓ కాలేజ్‌లో సైన్స్, ఆర్ట్స్ అనే రెండు గ్రూపులుంటాయి. వారికి ఒకరంటే ఒకరికి పడదు. అందుకని ఫుట్‌బాల్ ఆట ఆడుతూ ఒకరినొకరు కొట్టుకుంటూ ఉంటారు. అలాంటి నేపథ్యంలో ఓ ఆర్ట్స్ గ్రూప్ అబ్బాయిని సైన్స్ గ్రూప్ అమ్మాయి ప్రేమించింది. దీనికి సమాంతరంగా బిక్షు యాదవ్ అనే రౌడీ.. భూ కబ్జాలు చేస్తుంటాడు. వాడు వీళ్ల కాలేజీని కబ్జా చేసి ఈ కాలేజ్ నాది అంటాడు. తమ కాలేజ్‌ను ఆ రౌడీ బారి నుండి ఆ యువకులు ఎలా దక్కించుకున్నారనేదే కథ'' అని అన్నాను. తనకు బాగా నచ్చింది. వెంటనే సినిమా చేసేద్దామని అన్నాడు. సినిమా రూపొందే క్రమంలో ఫుట్‌బాల్ వద్దు.. రగ్బీ ఆటతో సినిమా చేద్దాం అని నిర్ణయించుకుని రగ్బీ ఆట ప్రధానంగా 'సై' సినిమాను రూపొందించాం.



రాజమౌళి సినిమా అంటే ఎమోషన్స్ ఆడియెన్స్‌ను కట్టి పడేస్తుంటాయి.. అలాంటి ఎమోషన్స్ కోసం రైటర్‌గా ఎలా ఆలోచిస్తారు?

కథను ఆడియెన్‌కు కనెక్ట్ చేయాలంటే అందులో బలమైన ఎమోషన్స్ ఉండాల్సిందే. అలాంటి ఎమోషన్స్‌ను ఆడియెన్స్‌కు కనెక్ట్ అయ్యేలా సన్నివేశాలను చక్కగా రాసుకోవాలి. కథ రాసే క్రమంలోనే బలమైన ఎమోషన్స్ ఉండేలా చూసుకుంటాను. ముందుగా సన్నివేశాలను ఆలోచించుకుని రాసుకున్నప్పుడే వాటిని తెరపై మరింత హైగా చూపించగలం.

రైటర్‌గా ఉండటాన్ని ఇష్టపడతారా? డైరెక్టర్‌గా ఉండటాన్ని ఇష్ట పడతారా?

రైటర్‌గా నాకు సక్సెస్ రేట్ బావున్నా.. రైటర్‌గా కంటే డైరెక్టర్‌గా ఉండటానికి ఇష్టపడతాను.

తెలుగు చిత్రసీమలో రచయితల కొరత ఉందని అంటున్నారు కదా! మీరేమంటారు?

రచయితల కొరత మనకే కాదు అన్ని సినీ పరిశ్రమల్లోనూ ఉంది. కొత్త ఆలోచనలతో కొత్త రచయితలు ముందుకు రావాలి. ఎవరూ రానంత కాలం ఈ సమస్య ఉంటూనే ఉంటుంది.

కొత్త రచయితలకు మీరేమైనా సలహాలిస్తారా?

ఇక్కడ ఎవరూ ఎవరికీ సలహాలిచ్చే స్థితిలో లేరు. ఇచ్చినా ఎవరూ తీసుకోరు.

ఇటీవల మీరు డైరెక్ట్ చేసిన 'శ్రీవల్లీ' సినిమాను సరిగ్గా డైరెక్ట్ చేయలేకపోయానని బహిరంగంగా ఒప్పుకుని అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు కదా?

'శ్రీవల్లీ' సినిమాను నేను సరిగ్గా డైరెక్ట్ చేయలేదు. నేను బాగా డైరెక్ట్ చేసుండి..సినిమా బావుండి ఉంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరించేవారు కదా. సినిమా హిట్ కాకపోయినా హిట్ అని చెబితే చూసేవారు.. వినేవారు.. 'వీడేంటి ఫాప్ సినిమాను హిట్ అంటున్నాడు' అని నవ్వుకుంటారు. నాకు డెబ్బై ఆరేళ్లు.. అదే నేను నాకు పదహారేళ్లు అని అంటే నమ్ముతారా? నిజం చెప్పాలి కదా!. అలాగే 'శ్రీవల్లీ' విషయంలో నేను సినిమాను సరిగా తీయలేకపోయానని నిజం ఒప్పుకున్నానంతే.

తండ్రిగా విజయేంద్ర ప్రసాద్ ఏంటి?

నేను గొప్ప తండ్రి కాను. నేను సినిమాల్లో రైటర్‌గా బిజీగా ఉన్నప్పుడు కుటుంబ వ్యవహారాలన్నీ నా భార్యనే చూసుకునేది. ఏదో సినిమాల్లో సంపాదించిన పది రూపాయలు ఇంట్లో ఇచ్చేవాడినంతే. తండ్రిగా పిల్లలతో ఇంటరాక్షన్ తక్కువగా ఉండేది. అలాగని నేను పిల్లల్ని భయపెట్టేవాడినా? అంటే అది లేదు. ఎందుకనో ముందు నుండి అలా గడిచిందంతే.

రాజమౌళి సక్సెస్‌ను తండ్రిగా ఎంజాయ్ చేస్తున్నారా? లేక రైటర్‌గా ఎంజాయ్ చేస్తున్నారా?

రైటర్‌గా.. తండ్రిగా ఎంజాయ్ చేస్తున్నాను. తను నా కథలను బాగా తీయకపోయుంటే ఇంత సక్సెస్ వచ్చుండేది కాదు. అంటే వేరే దర్శకులు నా సినిమాలు బాగా తీయలేదు.. సక్సెస్‌లు కొట్టలేదని కాదు. రాజమౌళి డైరెక్టర్ కాక ముందు నుండి రైటర్‌గా నాకు సక్సెస్‌లున్నాయి. అయితే రాజమౌళి దర్శకత్వంలో రైటర్‌గా మంచి సక్సెస్‌లు వచ్చాయని నా అభిప్రాయం.

ఇంట్లో మీకు, రాజమౌళికి మధ్య ఎలాంటి డిస్కషన్స్ ఉంటాయి?

ఇద్దరి మధ్య సినిమాలు తప్ప మరే డిస్కషన్ జరగవు. ప్రతి వారం పలు భాషల్లో సినిమాలు రిలీజ్ అవుతుంటాయి. వాటిలో లోటు పాట్లు ఏంటి? అని మాట్లాడుకుంటూ ఉంటాం. బావుంటే ఎందుకు బావుంది? బాగా లేదంటే కారణమేంటి? కొన్ని సినిమాలు బావున్నా ఆడకపోడానికి కారణాలేంటి? కొన్ని సినిమా పాయింట్స్ బాగా లేకున్నా.. ఆదరణ పొందుతుంటాయి. అందుకు కారణాలేంటి? అనే విషయాలను డిస్కస్ చేసుకుంటూ ఉంటాం.

టెక్నీషియన్స్‌గా ఇద్దరి మధ్య భావ సారూప్యత ఉంటుందా..?

ఎప్పుడూ లేదండీ..! ఎందుకంటే ఓ రచయితగా.. నాకు డైరెక్టర్ ఈజ్ సుప్రీమ్. ఆయనకు ఏం కావాలో అది అందించడమే రైటర్‌గా నా బాధ్యత. డైరెక్టర్ రాజమౌళి ఎక్కడైనా తప్పు చేస్తున్నట్లు అనిపిస్తే.. ఒకట్రెండు సార్లు చెబుతాను. తనకే కాదు. నేను పనిచేసిన సినిమాల్లో ఏ దర్శకుడికైనా సలహాలిస్తే బావుంటుందనిపిస్తే సలహాలిస్తాను. రైటర్‌గా చిన్న చిన్న సలహాలు ఇవ్వడం నా ధర్మం. దాన్ని వాళ్లు పాటిస్తారా? లేదా? అనేది వాళ్లిష్టం.

మీ నుండి రాజమౌళికి అబ్బిన గుణమేంటి?

రాజమౌళి ఇమాజినేషన్ నాలాగే ఉంటుంది. చక్కగా ఇమాజిన్ చేయడం వల్లనే.. కథను గ్రాండ్‌గా, ఆడియెన్స్‌కు నచ్చేలా తీస్తున్నాడు.

తదుపరి చిత్రాలు?

హిందీలో జాగర్లమూడి క్రిష్ దర్శకత్వంలో చేస్తోన్న 'మణికర్ణిక'కు కథ అందించాను. అలాగే తెలుగులో ఇప్పుడు రాజమౌళి చేయబోతున్న సినిమాకు కథను అందిస్తున్నాను. హిందీలో ఓ కథను రాస్తున్నాను. దాన్నే డైరెక్ట్ కూడా చేయబోతున్నాను. త్వరలోనే ఆ వివరాలను తెలియజేస్తాను.

- మోహన్ కుమార్ తుమ్మల

ఫొటోలు: కుమారస్వామి వంగాల

సారొస్తున్నారు..!

● వీఆర్ఎస్‌కు లక్ష్మీనారాయణ దరఖాస్తు

కర్నూలు, మార్చి 24 (మనం న్యూస్ బ్యూరో):



మహారాష్ట్ర కేడర్ ఐపీఎస్ అధికారిగా ఉండి.. సీబీఐ జాయింట్ డైరెక్టర్‌గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొన్నాళ్లపాటు వ్యవహరించిన లక్ష్మీనారాయణ త్వరలో ఏపీ రాజకీయాల్లోకి వస్తున్నారా? ఏపీలో ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తమకు బలమైన అండగా ఆయన ఉంటారని కొన్ని పార్టీలు ఇప్పటికే భావిస్తూ.. ఆయనకు అందలం వేసేందుకు సిద్ధంగా ఉన్నాయా? తాజా పరిణామాలు చూస్తే అవుననే తెలుస్తోంది. ఇప్పటికే తమ పార్టీ తరపున బరిలోకి దిగాలంటూ ఆయనను ఒకటి రెండు పార్టీలు సంప్రదించాయంటున్నారు. సీబీఐ జేడీగా లక్ష్మీనారాయణ ఉమ్మడి ఏపీలో ఉన్నప్పుడు మైనింగ్ కింగ్ గాలి జనార్దన్‌రెడ్డి, వైసీపీ అధినేత జగన్ కేసుల్లో కేసులో మెరుపు దాడులు నిర్వహించి సంచలనం సృష్టించారు. ఈ కేసులతో ఒక్కసారిగా ఆయన పతాక శీర్షికల్లోకి ఎక్కారు. కర్నూలు జిల్లాకు చెందిన ఈయన 1965 ఏప్రిల్ 3న శ్రీశైలంలో జన్మించారు. పదో తరగతి వరకు శ్రీశైలం ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో చదువుకున్నారు. ఆర్ఈసీ వరంగల్ (ప్రస్తుత నిట్ వరంగల్)లో బీటెక్, ఐఐటీలో ఎంటెక్ పూర్తి చేశారు. యూపీఎస్సీ పరీక్షలు రాసి మహారాష్ట్ర ఐపీఎస్ క్యాడర్‌కు ఎన్నికయ్యారు. నాందేడ్ ఎస్పీగా పనిచేసిన ఆయన తర్వాత మహారాష్ట్రలో యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్‌లోనూ పనిచేశారు. 2006 జూన్ 12న హైదరాబాద్ లో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసుగా బాధ్యతలు చేపట్టారు. ఈ సమయంలోనే ఓబుళాపురం మైనింగ్, జగన్ అక్రమాస్తుల కేసుల్లో గాలి జనార్దన్ రెడ్డి, జగన్‌లను అరెస్ట్ చేసి పతాక శీర్షికల్లోకి ఎక్కారు.

స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు

ప్రస్తుతం మహారాష్ట్రలో ఐపీఎస్ అధికారిగా కొనసాగుతున్న లక్ష్మీనారాయణ ఇటీవల స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకొని మరోసారి వార్తల్లోకి ఎక్కారు. నిజాయితీగల అధికారిగా ముద్రపడ్డ ఆయన హఠాత్తుగా వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేయడంపై పలు రకాల వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజలకు సేవ చేసుకునేందుకు ఏపీ రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఐపీఎస్ అధికారిగా ఉన్నప్పుడే ఆయన పలు సెమినార్లు, ఇతర కార్యక్రమాలతో తెలుగు రాష్ట్రాల్లోని యువతకు బాగా దగ్గరయ్యారు. భవిష్యత్తులో రాజకీయ రంగప్రవేశం చేయాలన్న ఉద్దేశంతోనే ఆయనిలా చేశారా అన్న వాదనలూ వినిపిస్తున్నాయి. మాజీ ఐపీఎస్ అధికారిణి కిరణ్ బేదీని ఢిల్లీలో రాజకీయాల్లోకి తీసుకొచ్చినట్లే.. ఇప్పుడు ఏపీ రాజకీయాల్లోకి ఆయనను తీసుకొస్తే సత్ఫలితాలు ఉంటాయని ఒకటి రెండు పార్టీలు భావిస్తున్నాయి. అందులో భాగంగా ఇప్పటికే కొందరు నాయకులు ఆయనను సంప్రదించి.. తమ పార్టీలోకి రావాల్సిందిగా ఆహ్వానించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన ఒకటి రెండు రోజుల్లో హైదరాబాద్ లేదా విజయవాడకు వచ్చి మీడియా సమావేశం ఏర్పాటుచేసి తన భవిష్యత్ కార్యాచరణను వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

వేగంగా మారుతున్న రాజకీయాలు..

సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో ఏపీలో రాజకీయాలు రోజురోజుకు మారుతున్నాయి. మొన్నటి వరకు టీడీపీ మిత్రపక్షంగా ఉన్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్.. పార్టీ ఆవిర్భావ సభ పేరుతో చంద్రబాబును, ఆయన కుమారుడు లోకేష్‌ను తూర్పారబట్టారు. తద్వారా వచ్చే ఎన్నికల్లో తన వైఖరి ఏంటో స్పష్టంగా చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, వైసీపీతో పాటు తాను కూడా రంగంలో ఉంటానని పరోక్షంగా స్పష్టం చేశారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ముక్కోణపు పోటీ తప్పదని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ తరుణంలో బీజేపీ కూడా ఏపీలో తమ ఉనికిని బలంగా చాటుకోవాలని ప్రయత్నిస్తోంది. సొంతంగా పోటీ చేసి.. ఫలితాలను బట్టి ఎన్నికల తర్వాత పరిస్థితిని బట్టి వేరే పార్టీలతో పొత్తు పెట్టుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలన్న ఆలోచన ఆ పార్టీ నేతలలో కనిపిస్తోంది.

ఆధార్.. డేంజరే!

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తిగత సమాచారం మొత్తం సులభంగా దొరికిపోతుందని భద్రతా వ్యవహారాల పరిశోధకుడు కరణ్ సైనీ చెప్పారు. ఆధార్ డేటా మొత్తం పూర్తిగా ఎన్‌క్రిప్ట్ అయి ఉంటుందని, దానివల్ల ఎంత శక్తిమంతమైన కంప్యూటర్ అయినా దాన్ని ఛేదించాలంటే విశ్వం వయసు ఎంత ఉందో అంత సమయం పడుతుందని యూఐడీఏఐ సంస్థ సీఈవో అజయ్‌భూషణ్ పాండే సుప్రీంకోర్టుకు వెల్లడించిన ఒక్కరోజు తర్వాతే కరణ్ సైనీ ఈ సంచలన విషయాన్ని వెల్లడించడం గమనార్హం. ఒక అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్ లేదా 'ఏపీఐ' ద్వారా ఆధార్ డేటాబేస్‌లోకి ప్రవేశించవచ్చని తెలిపారు. ఏపీఐ అనేది ఒక ప్రోగ్రాం. అది పలు రకాల యాప్‌లకు వేరే అప్లికేషన్లు లేదా సాఫ్ట్‌వేర్లు స్టోర్ చేసిన డేటా యాక్సెస్ తీసుకునే వీలు కల్పిస్తుంది. సాధారణంగా ఈ ఏపీఐని కూడా సురక్షితంగా పెట్టుకుంటారు. దానివల్ల కేవలం సొంత యూజర్లు తప్ప మిగిలినవారికి ఆ సమాచారం అందదు. కానీ, సదరు ప్రభుత్వరంగ సంస్థ తన ఏపీఐని సెక్యూర్ చేసుకోలేదు. దాంతో కేవలం సొంత కస్టమర్లే కాకుండా మొత్తం ఆధార్ కార్డు ఉన్నవాళ్లందరి సమాచారం సులభంగా అవతలివాళ్లకు దొరికిపోతుందని, ఇది చాలా ప్రమాదకరమని సైనీ వివరించారు. సదరు ఏపీఐ ఎండ్‌పాయింట్‌లో యాక్సెస్ సెక్యూరిటీ కంట్రోళ్లు ఏమీ లేవని, దానివల్ల హ్యాకర్లు కూడా చాలా సులభంగా ఆధార్ కార్డుల వివరాలన్నింటినీ పొందవచ్చని తెలిపారు. ఏదో ఒక 12 అంకెల సంఖ్య కొట్టి, అది ఎవరిదైనా ఆధార్ నంబరుతో సరిపోతే వెంటనే వివరాలన్నింటినీ చౌర్యం చేయవచ్చని అన్నారు. ఒకవేళ హ్యాకర్లకు నిజంగా కొన్ని ఆధార్ నంబర్లు దొరికితే, వాటిని పట్టుకుని అత్యంత సులభంగా మొత్తం అన్ని వివరాలు తీసుకోవచ్చని ఆయన వివరించారు. తాము ఈ విషయాలను కేంద్ర ప్రభుత్వానికి వివరించడానికి దాదాపు నెల రోజుల నుంచి ప్రయత్నించినా ఎవరూ తమ ఈ మెయిల్స్‌కు స్పందించలేదని, దాంతో న్యూయార్క్‌లోని ఇండియన్ కాన్సుల్ ఫర్ ట్రేడ్ అండ్ కస్టమ్స్ దేవీ ప్రసాద్ మిశ్రాను సంప్రదించి ఆయనకు ఈ లోపం గురించి చెప్పామని జీడీనెట్ ప్రతినిధులు తెలిపారు. కానీ ఇప్పటికి రెండు వారాలు గడిచినా ఇప్పటికీ ఆ లోపాలను సరిచేసుకోలేదని వివరించారు.

కొత్తగా 23 మున్సిపాలిటీలు

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గం గజ్వేల్‌తో పాటు ఉత్తర తెలంగాణలోని ప్రముఖ పర్యాటక క్షేత్రం వేములవాడకూ స్థానం దక్కింది. ఈమేరకు శనివారం 23 నగర పంచాయతీలను పురపాలికలుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వు ప్రకారం.. బడంగ్‌పేట్, పెద్ద అంబర్‌పేట్, నర్సంపేట్, సత్తుపల్లి, మధిర, గజ్వేల్, వేములవాడ, కొల్లాపూర్, అయిజ, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం, హుజూర్‌నగర్, జమ్మికుంట, పరకాల, హుస్నాబాద్, బాదేపల్లి, దేవరకొండ, అందోల్, జోగిపేట, హుజురాబాద్ పట్టణాలు మున్సిపాలిటీలుగా మారనున్నాయి.

కూర్చోకండి!

లేచి నడవాలంటున్న వైద్యులు ..ఎక్కువ సేపు కూర్చుంటే కొవ్వు



(మనం సెంట్రల్ డెస్క్)

ఒక్కసారి డ్యూటీ మొదలైందంటే ఇక కుర్చీలోంచి కదలను తెలుసా?.. ఈ మాట చాలామంది చెబుతుంటారు. కానీ, అదేమీ పెద్ద గొప్ప పని కాదట. పైగా అలా కదలకుండా కూర్చోవడం వల్ల సిగరెట్లు కాల్చినదాని కంటే ఎక్కువ నష్టం జరుగుతుందట. కాబట్టి లేవండి.. లేచి నాలుగు అడుగులు వేయండి.

సాధారణంగా ఈ రోజుల్లో కంప్యూటర్ల ముందు కూర్చుని ఉద్యోగాలు చేసేవాళ్లంతా అస్సలు కుర్చీల లోంచి కదలడం లేదు. మీటింగ్ అయినా, పని అయినా అన్నీ కూర్చునే చేస్తున్నారు. అందులోనూ చక్రాల కుర్చీలు కావడంతో ఒకవేళ పక్క క్యూబికల్‌లో ఉన్నవాళ్లతో మాట్లాడాలన్నా.. చక్రాల సాయంతో కుర్చీని అవతలకు జరుపుకొని మాట్లాడేసి మళ్లీ యథాస్థానానికి వస్తున్నారు. దానికి కూడా లేవడం లేదు. ఇలా అసలు కుర్చీలోంచి లేవకుండా పనిచేయడం వల్ల చాలా నష్టాలు ఉంటాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. రోజులో ఆరు గంటల పాటు కదలకుండా కూర్చుంటే.. రోజుకు ఒక ప్యాకెట్ కంటే ఎక్కువ సిగరెట్లు కాలుస్తున్న దాంతో సమానమేనట. ఈ విషయాన్ని డాక్టర్లే చెబుతున్నారు. అలా కదలకుండా కూర్చుండిపోతే గుండెమీద ప్రభావం పడటంతో పాటు కొలెస్టరాల్ స్థాయి కూడా పెరుగుతుందని, దానివల్ల టైప్2 మధుమేహం వస్తుందని హెచ్చరిస్తున్నారు. చిన్న చిన్న శారీరక కార్యక్రమాలు చేసినా దానివల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు. దానివల్ల గుండెకు వాటిల్లే ముప్పు గణనీయంగా తగ్గుతుందట. అంతవరకు ఎందుకు.. అసలు అరగంట పాటు కదలకుండా కూర్చుంటే చాలు, ఎక్కడలేని అనారోగ్యాలు చుట్టుముడతాయని కూడా అంటున్నారు. మనిషి అవతరించినప్పటి నుంచి అసలు మన శరీరానికి ఒకచోట కూర్చోవడం పడదని, అలా కదలకుండా కూర్చుంటే కొవ్వు పెరిగిపోయి పొట్ట, ఇతర భాగాలలో నిల్వ ఉండిపోతుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. అందుకే ఎక్కువ సేపు కూర్చుని ఉండే పనిలో ఉండేవారికే ఎక్కువగా పొట్ట వస్తుందని చెబుతున్నారు. చాలాసేపు కదలకుండా కూర్చోవడం వల్ల కండరాలు క్రమంగా బిగుసుకుపోతాయి. వెన్నెముక, భుజాలు, తుంటి సమస్యలు కూడా వస్తాయి. ఒకవేళ కదలకుండా కూర్చోవాల్సిన ఉద్యోగం అయితే.. అప్పుడు కూడా రోజు మొత్తం ఒకేచోట మూడు గంటలకు మించి కూర్చోకూడదని.. అరగంటకోసారి లేచి అటూ ఇటూ తిరగాలని చెబుతున్నారు. ఇలా కూర్చుని ఉండిపోతే వచ్చే నష్టాలపై దాదాపు లక్షా ఇరవై వేల మందిని అమెరికన్ పరిశోధకులు పరిశీలించారు. వారి జీవనశైలి, ఎంతసేపు కూర్చుంటున్నారనే విషయాలు పరిశీలించారు. 3 గంటలకు పైగా అలా కదలకుండా ఒకేచోట కూర్చున్నవారికి గుండెజబ్బులు వచ్చే ముప్పు ఎక్కువగా ఉండటం గమనించారు. కంప్యూటర్ దగ్గర ఎక్కువ సేపు ఉండేవారికి ముఖం ముడతలు పడటం, కళ్లు జీవాన్ని కోల్పోవడం లాంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. అందుకే మధ్యమధ్యలో చిన్నపాటి విరామాలు తీసుకుంటూ, ముఖం కడుక్కోవడం కూడా మంచిదని సూచిస్తున్నారు.

ఇక ఆడవారికి సహజంగానే పిల్లలు పుట్టిన తర్వాత నడుము, పొట్టభాగంలో కొంత కొవ్వు పేరుకుంటుంది. అదేపనిగా కూర్చుని ఉద్యోగాలు చేసే ఆడవా ళ్లకు ఇది మరింత ఇబ్బందికరం అవుతుంది. పొట్టభాగంలో పేరుకునే కొవ్వు చాలా ప్రమాదకరమని, ఇది రక్తంలో కొవ్వుశాతాన్ని పెంచే హార్మోన్లను సైతం ఉత్పత్తి చేసి.. రక్తనాళాలు పూడుకుపోవడానికి, అధిక రక్తపోటుకు, మధుమేహానికి కారణం అవుతుందని అమెరికన్ శాస్త్రవేత్తలు తెలిపారు.

ఇంటికి వచ్చిన తర్వాత కూడా...

చాలామంది ఆఫీసులో పనిచేయడంతో పాటు ఇంటికి వచ్చిన తర్వాత కూడా ఏవో ఒక ఈమెయిళ్లు పంపాలనో, ఆఫీసు పని ఉందనో అలా సోఫాలో కూలబడిపోతారు. ఇది మరింత ప్రమాదకరం. అలాగే కాస్త రిలీఫ్ కోసమని సెల్‌ఫోన్లు, ఐప్యాడ్‌లలో సినిమాలు, వీడియోలు చూసుకుంటూ మరికాసేపు కూర్చుంటే మరింత నష్టం వాటిల్లక తప్పదట. దానివల్ల నిద్రాభంగం కావడంతో పాటు.. కూర్చోవడం వల్ల కలిగే నష్టాలు కూడా వస్తాయని, అలాగే రాత్రి నిద్ర సరిగా లేకపోవడం వల్ల మర్నాడు ఆఫీసులో త్వరగా అలిసిపోతామని, అందువల్ల రాత్రి 10 గంటల తర్వాత వీలైనంత త్వరగా.. అది కూడా వెలుతురు పడనిచోట పడుకోవాలని సూచిస్తున్నారు.

సూచనలు ఇవీ...

- **ప్రతి 20 నిమిషాలకు ఒకసారి లేచి నిలబడండి. కనీసం ఒకటి లేదా రెండు నిమిషాలైనా పర్వాలేదు**
- **చిన్న పాటి సమావేశం ఉంటే అప్పుడు కూర్చోకుండా వీలైనంత వరకు నిలబడి మాట్లాడే ప్రయత్నం చేయండి. దానివల్ల పై అధికారులకు మంచి అభిప్రాయం కలగడంతో పాటు మీకు శారీరక వ్యాయామం కూడా అవుతుంది.**
- **పెద్ద పెద్ద ఈ మెయిల్స్ పెట్టడం కంటే, చిన్న చిన్నవి ఎక్కువ పెట్టడానికి ప్రయత్నించండి.**
- **డెస్కు దగ్గరే చిన్న చిన్న స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయొచ్చు. వాటిని ప్రయత్నించి చూడండి**
- **మీ ఆఫీసులో రిక్రియేషన్ సెంటర్ ఉంటే.. సాయంత్రం పని ముగించడానికి ముందు కాసేపు అక్కడకు వెళ్లి ఏవో ఒక ఆటలు ఆడండి. కూర్చుని ఆడేవి మాత్రం వద్దు.**

లాలుకు 14 ఏళ్ల జైలు

● **రూ.60 లక్షల జరిమానా కూడా**



రాంచీ, మార్చి 24: ఆర్జేడీ అధినేత లాలుప్రసాద్‌కు దాణాస్కాంలో సీబీఐ ప్రత్యేక కోర్టు 14 ఏళ్ల జైలుశిక్ష, రూ. 60 లక్షల జరిమానా విధించింది. 1990ల తొలినాళ్లలో దుమ్కా ఖజానా నుంచి రూ. 3.13 కోట్లు అక్రమంగా డ్రా చేసుకున్నందుకు సీబీఐ జడ్జి శివపాల్ సింగ్ ఈ శిక్ష విధించారు. రెండు వేర్వేరు శిక్షలుగా ఏడేళ్ల చొప్పున విధించి, ఒకదాని తర్వాత ఒకటి అనుభవించాలని ఆయన తన ఉత్తర్వులలో తెలిపారని సీబీఐ న్యాయవాది రాకేశ్ ప్రసాద్ తెలిపారు. ఐపీసీ సెక్షన్లు 420, 409, 467, 468, 477, 120బిల కింద ఏడేళ్ల జైలుశిక్ష, రూ. 30 లక్షల జరిమానా విధించిన జడ్జి.. అవినీతి నిరోధక చట్టం కింద మరో ఏడేళ్ల జైలుశిక్ష, రూ. 30 లక్షల జరిమానా విధించారు. ఒకవేళ జరిమానా కట్టలేకపోతే ఒక్కొక్కటి ఏడాది చొప్పున మరో రెండేళ్ల జైల్లో గడపాల్సి ఉంటుంది. బిహార్ పశు సంవర్ధక శాఖ మాజీ ప్రాంతీయ డైరెక్టర్ ఓపీ దివార్కర్‌కు కూడా లాలుకు విధించిన శిక్షే విధించారు. అదే శాఖకు చెందిన మరో తొమ్మిది మంది అధికారులు, మాజీ ఐఏఎస్ అధికారి ఫూల్‌చంద్ సింగ్‌లకు ఏడేళ్ల జైలుశిక్ష, రూ. 30 లక్షల చొప్పున జరిమానా విధించారు. వీళ్లు జరిమానా కట్టకపోతే 18 నెలల చొప్పున జైల్లో అదనంగా ఉండాల్సి వస్తుందన్నారు. ఏడుగురు దాణా సరఫరాదారులకు మూడున్నరేళ్ల చొప్పున జైలుశిక్ష, రూ. 15 లక్షల జరిమానా విధించారు. ఈ తీర్పును పైకోర్టులో సవాలుచేస్తామని లాలు ప్రసాద్ తరపు న్యాయవాది ప్రభాత్‌కుమార్ తెలిపారు. దుమ్కా ఖజానా కేసులో లాలుతో పాటు మరో 18 మందిని సీబీఐ ప్రత్యేక కోర్టు ఈనెల 19న దోషులుగా గుర్తించింది. ఇదే కేసులో బిహార్ మాజీ సీఎం జగన్నాథ మిశ్రా, మరో 12 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది.

దేవ్‌గఢ్ ఖజానా నుంచి అక్రమంగా డబ్బులు విత్ డ్రా చేసిన కేసులో ఇప్పటికే జైలుశిక్ష అనుభవిస్తున్న లాలు.. గత సంవత్సరం డిసెంబర్ 23 నుంచి రాంచీలోని బిర్సా ముండా జైల్లోనే ఉన్నారు. దాణా స్కాంకు సంబంధించి తొలి కేసులో 2013లోనే లాలును దోషిగా నిర్ధారించి ఐదేళ్ల జై లుశిక్ష విధించారు. దాంతో ఆయన లోక్‌సభ సభ్యత్వం కూడా రద్దయింది. మూడు నెలల తర్వాత లాలుకు సుప్రీంలో బెయిల్ దొరికింది. ఆ తర్వాత మరో కేసులో ఈ సంవత్సరం జనవరి 24న ఐదేళ్ల జైలుశిక్ష పడింది. ఇప్పటివరకు నాలుగు కేసుల విచారణ పూర్తయింది. ఐదో కేసు దొరాండా ఖజానా నుంచి రూ. 139 కోట్లు విత్‌డ్రా చేసుకున్న ఘటనకు సంబంధించినది ఇంకా కోర్టులో పెండింగులో ఉంది. కాగా.. లాలు ప్రసాద్ ప్రస్తుతం రాంచీలోని రాజేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో చికిత్స పొందుతున్నారు. గత వారం జైల్లో ఉండగా గుండెనొప్పి, ఇబ్బందిగా ఉందని ఆయన చెప్పడంతో లాలును ఆస్పత్రిలో చేర్చారు.

నాన్న ఏమైపోతారో: తేజస్వి

తనకు తండ్రి ప్రాణాల గురించి భయంగా ఉందని.. ఆయన ఏమైపోతారోనని ఆందోళన చెందుతున్నామని లాలు కుమారుడు తేజస్వి యాదవ్ విలేకరులతో వ్యాఖ్యానించారు. తన తండ్రికి వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

తెలుగు బిల్లుకు సై

(మొదటిపేజీ తరువాయి)

ఇతర అన్ని రకాల భాషల పాఠశాలల్లోనూ తప్పనిసరిగా తెలుగును కూడా బోధించాలన్న ఉద్దేశంతోనే ఈ బిల్లును ప్రవేశపెట్టినట్లు ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. తెలుగు భాష గొప్పదనాన్ని నిలబెట్టేందుకు, తెలుగు భాషకు పూర్వ వైభవం తెచ్చేందుకు, తెలుగుకు పట్టం కట్టేందుకు ఈ బిల్లును తీసుకొచ్చామని చెప్పారు. గత ప్రభుత్వాలు తెలుగు భాష పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించాయని, తెలంగాణ ప్రభుత్వం తెలుగు భాష అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. ఈ బిల్లుపై సభ్యులు జాఫర్ హుస్సేన్, కిషన్ రెడ్డి, ఆర్. కృష్ణయ్య, సున్నం రాజయ్య మాట్లాడారు. తెలుగు బిల్లు తీసుకురావడాన్ని పూర్తిగా స్వాగతిస్తున్నామని చెప్పారు. ఈ బిల్లు అమలును శాసనసభ నుంచే అమలు చేయాలని, తెలుగు భాషలోనే శాసనసభ వ్యవహారాలు నడపాలని, ఉత్తర్వులు ఇవ్వాలని, ప్రభుత్వ ఉత్తర, ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరపాలని సూచించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో మాతృభాష అమలు కోసం ఉద్యమాలు చేశారని, చివరకు బస్సులపై పేర్లు కూడా తమ తమ మాతృ భాషలోనే రాశారని, ఇక్కడ కూడా అలాగే అమలు చేయాలన్నారు. ఇతర భాషల పాఠశాలల్లో తెలుగు ఉత్తీర్ణత మార్కులను 20గా నిర్ణయించాలని, ఒకరిద్దరు విద్యార్థులున్న చోట కూడా కచ్చితంగా ఉపాధ్యాయులను నియమించాలనే నిబంధనకు మాత్రం మినహాయింపు ఇవ్వాలని కోరారు.

కేసీఆర్ సదుద్దేశం

తెలంగాణలో చదివే ప్రతి విద్యార్థి తెలుగు భాషను తప్పనిసరిగా నేర్చుకోవాలన్న సదుద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నారని, తెలుగుభాష గొప్పదనాన్ని చాటేందుకే ఇటీవల ప్రపంచ తెలుగు మహాసభలు బ్రహ్మాండంగా నిర్వహించారని మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. తెలంగాణలో తెలుగు అమలు కోసం తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిదారెడ్డి ఆధ్వర్యంలో కమిటీ తమిళనాడు, పంజాబ్‌లలో పర్యటించి, అక్కడ మాతృభాషను అమలు చేస్తున్న తీరును అధ్యయనం చేశారన్నారు.

దశల వారీగా అమలు

తొలిదశలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, రాష్ట్ర, కేంద్ర, ఇతర భాషా ప్రాథమిక పాఠశాలల్లో మొదటి తరగతిలో తెలుగు భాషను ప్రవేశపెడుతున్నామని కడియం శ్రీహరి తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి తెలుగు భాషను ప్రవేశపెడుతున్నామన్నారు. ఆరో తరగతిలో ప్రవేశపెట్టే భాష చాలా సులభతరంగా ఉంటుందని చెప్పారు. తెలుగు భాషను తప్పనిసరి చేయడం కోసం రూపొందించే సిలబస్ బాధ్యతలను తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయాలకు అప్పగించామన్నారు. అమ్మ ఒడి పలుకులు - బడి పలుకులు కావాలనే లక్ష్యంతోనే తెలుగు తప్పనిసరి అమలు బిల్లును తీసుకొచ్చామంటూ.. దీనిని అందరూ స్వాగతించి ఆమోదించినందుకు మంత్రి కడియం శ్రీహరి ధన్యవాదాలు తెలిపారు.

మీలో మీకే శృతి లేదు..మాపై విమర్శలా?

(మొదటిపేజీ తరువాయి)

వారు రూ. లక్షల కోట్లు ఎగ్గొడుతుంటే.. కేంద్ర ప్రభుత్వం, బ్యాంకులు అండగా నిలుస్తున్నాయి. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు నిర్వహిస్తున్న వారు ఒకటి రెండు నెలలు అప్పులు చెల్లించకుంటే ముక్కుపిండి వసూలు చేస్తున్నారు'' అని మండిపడ్డారు. బీజేపీ సభ్యులు కిషన్‌రెడ్డి అదే స్థాయిలో మంత్రి కేటీఆర్‌పై విరుచుకుపడ్డారు. దాంతో.. ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు, ఆరోపణలు చేసుకున్నారు. శనివారం అసెంబ్లీలో పలు పద్దులపై చర్చ సందర్భంగా ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. ఐటీఐఆర్ విషయంలో, బయ్యారం ఉక్కు పరిశ్రమ విషయంతో ఇరు పక్షాల మధ్య ప్రారంభమైన విమర్శలు ప్రతివిమర్శలతో సభ కొంత సమయం వేడెక్కింది. తొలుత చర్చను ప్రారంభిస్తూ ప్రభుత్వ పథకాలను కేటీఆర్ వివరించారు ఈ సమయంలో కిషన్‌రెడ్డి జోక్యం చేసుకోవడంతో మంత్రి కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ''విభజన చట్టంలోని కేంద్రం అమలు చేయదు. ఒక్క పైసా ఇయ్యదు. ఐటీఐఆర్ కోసం కేంద్రం చుట్టూ తిరిగాం. బయ్యారం ఉక్కు పరిశ్రమ కోసం ఎన్నిసార్లు కలిసినా కేంద్రంలోని పెద్దలు నిమ్మకునీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇటువంటి విషయాల్లో మీరు (బీజేపీ ఎమ్మెల్యేలు) మాట్లాడరు. ఫార్మాసిటీ ఏర్పాటును మాత్రం అడ్డుకోవటంలో మీ ఆంతర్యమేమిటో అర్థమవుతోంది. మీరు అధికారంలో లేరు'' అని కేటీఆర్ అన్నారు. దాంతో కిషన్‌రెడ్డి ఆగ్రహంతో ఊగిపోయారు. వచ్చే ఎన్నికల్లో మేమే అధికారంలోకి వస్తామని, మేం ఇప్పుడు కూర్చున్నచోట అప్పుడు మీరు కూర్చుంటారని అన్నారు. దాంతో ఇరుపక్షాల సభ్యుల వాదనలతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెల కొంది. రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తామని, కావాలంటే సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని విమానంలోకి ఢిల్లీకి వస్తామన్నారు. దాంతో మీరు అధికారంలోకి రావడం కల్ల అని టీఆర్ఎస్ సభ్యులు ఎద్దేవా చేశారు. ఈ సమయంలో స్పీకర్ జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది.

సిర్పూర్ మిల్లును తెరిపిస్తాం: కేటీఆర్

అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. మూతపడ్డ పరిశ్రమలను పునరుద్ధరించేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు. సిర్పూర్ కాగజ్‌నగర్ మిల్లును త్వరలో తెరవబోతున్నట్టు ప్రకటించారు.రాష్ట్రంలో 1730 పరిశ్రమలు మూతపడే స్థితిలో ఉన్నాయని





తెలిపారు. సర్ఫేస్ చట్టాన్ని బ్యాంకులు దుర్వినియోగం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్రం సాయం చేయకున్న మూత పడిన పరిశ్రమలకు అండగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడ్తుందన్నారు.

ఇందులో భాగంగానే పారిశ్రామిక హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా ఉందన్నారు. దళిత, గిరిజన, మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక రాయితీలను ఇవ్వనున్నట్టు తెలిపారు. టీఎస్ ఐపాస్ ద్వారా 6,200 కొత్త పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామని పేర్కొన్నారు. స్టాండప్, స్టార్టప్ అంటూ కేంద్రం ఊదరగొట్టే మాటలు చెప్పుందే తప్ప చేతల్లో లేదని విమర్శించారు. ఏపీ రేయాన్స్ కంపెనీని పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. బిల్ట్ కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రపంచంలోనే అత్యంత ఆధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్దదైన ఫార్మాసిటీని టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యేలు ఫార్మాసిటీని అడ్డుకోనేందుకు యత్నిస్తామని అనటం అన్యాయమన్నారు. కాలుష్యం లేకుండా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా మెరుగైన ప్రమాణాలతో జీరో లిక్విడ్ డిస్చార్జ్ పద్ధతిలో చేపట్టనున్నట్టు తెలిపారు. లక్షలాది మందికి ఉపాధి లభించనుందని చెప్పారు. ఫార్మాసిటీలో భాగంగా భూములు కోల్పోయిన వారి కుటుంబాలకు చెందిన ఒకరికి అదే కంపెనీలో ఉద్యోగావకాశం కల్పించను న్నామని వివరించారు. కాలుష్యాన్ని వెదజల్లుతున్న 13 పరిశ్రమలను మూసివేయించామని తెలిపారు. ఇండస్ట్రియల్ పొల్యూషన్ లేని హైదరాబాద్‌ను రూపొందించేలా ప్రణాళికలను తయారు చేస్తున్నామన్నారు.

మైనింగ్ ద్వారా రూ.3,700 కోట్లు

గతంలో ఎన్నడూ లేని విధంగా మూడేండ్ల కాలంలో రూ. 3700కోట్ల ఆదాయాన్ని మైనింగ్ ద్వారా ప్రభుత్వానికి లభించిందని, ఇది రికార్డు అని మంత్రి స్పష్టం చేశారు. పర్యావరణ హితంగా మైనింగ్ ఉండేలా చర్యలు చేపడ్తున్నామని తెలిపారు. 2014 విభజన చట్టం ప్రకారంగా బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఉన్నా కేంద్రంలో ఉలుకూ పలుకు లేదన్నారు. కేంద్రాన్ని పలుమార్లు కలిసి విన్నావించామని పేర్కొన్నారు. అభివృద్ధి నిరోధకులుగా బీజేపీ ఎమ్మెల్యేలు మారవద్దని సూచించారు. ఐటీఐఆర్ విషయంలో కేంద్రం నుంచి సరైన స్పందన లేదన్నారు. కేంద్రం స్పందించకున్నా 53 ఇండస్ట్రియల్ పార్కులకు గానూ ఇప్పటి వరకు 23పార్కులకు అనుమతి ఇచ్చామని తెలిపారు. వరంగల్‌లో మెగా టెక్స్‌టైల్స్ పార్కును ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 22 సంస్థలతో ప్రతిపాధనలు చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో మెడికల్ డివైస్ పార్కు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. నాలుగు మెగా ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. అన్ని నియోజక వర్గాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టనుందని తెలిపారు. నిజామాబాద్‌లో పతాంజలి సంస్థ తమ శాఖను ఏర్పాటు చేయనుందన్నారు. సీఎం కేసీఆర్ ఆలోచనతో రాష్ట్రంలో హరిత విప్లవం రానుందని తెలిపారు. ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్‌లలో ఐటీ హబ్‌ల ఏర్పాటు పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. దళిత, గిరిజనులకు చెల్లించాల్సిన బకాయిలను ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా చెల్లించనున్నట్టు తెలిపారు.

గ్యాంగ్‌రేప్ చేసి.. తగులబెట్టారు

- 5వ తరగతి విద్యార్థినిపై మైనర్ల దారుణం



నౌగామ్, మార్చి 24: అసోం లోని నౌగామ్ జిల్లాలో దారుణం జరిగింది. ఐదో తరగతి విద్యార్థినిపై ముగ్గురు బాలురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం ఆ అమ్మాయిపై కిరోసిన్ పోసి నిప్పుపెట్టారు. తీవ్రగాయాలపాలైన బాధితురాలు శుక్రవారం రాత్రి చికిత్స పొందుతూ మరణించింది. తనకు పరిచయమున్న అబ్బాయిలే దారుణానికి పాల్పడినట్టు బాధితురాలు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చింది. నిందితుల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. ముగ్గురు నిందితులూ మైనర్లు కావడంతో జువెనైల్ జస్టిస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. బాధితురాలి మరణవాంగ్మూలం ఆధారంగా నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. గాయాల తీవ్రత కారణంగా బాధితురాలికి అత్యాచార నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం కుదరలేదని చెప్పారు. ఈ ప్రాంతంలో గ్రామీణ మహిళలపై తరచుగా అత్యాచార ఘటనలు చోటుచేసుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు.



నోట్ల రద్దు మతిలేని చర్యే

- ఆర్థిక వ్యవస్థకు పెను శాపం
- యువతను నిరుద్యోగులుగా మార్చింది
- వారికి ఆర్థిక సహకారం అందించాలి
- ఉద్యోగ కల్పనలో వెనుకబడి ఉన్నాం
- కోర్టుల్లో కేసులు పేరుకుపోతున్నాయ్
- ముందు జడ్జిలను నియమించండి
- తప్పుడు వార్తల ప్రచారం తర్వాత..
- న్యాయ శాఖ మంత్రికి రాహుల్ హితవు

న్యూఢిల్లీ, మార్చి 24: నోట్లరద్దు, జీఎస్టీలు దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసాయని, యువతను నిరుద్యోగులుగా మార్చాయని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈమేరకు మైసూర్‌లోని మహారాణి మహిళా ఆరట్స్ కాలేజీలో శనివారం ఆయన విద్యార్థులతో భేటీ అయ్యారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ రెండు నిర్ణయాలు భారత ఆర్థిక అభివృద్ధికి పెను శాపంగా మారాయని దుయ్యబట్టారు. నోట్లరద్దు ఓ తప్పుడు నిర్ణయమని ఆరోపించారు. నోట్లరద్దు అమలుచేసిన తీరునూ రాహుల్ తప్పుబట్టారు. ఆర్బీఐ గవర్నర్, ఆర్థిక సలహాదారు మొదలు కనీసం ఆర్థిక మంత్రికి కూడా నోట్ల రద్దు విషయం తెలియదని చెప్పారు. నోట్ల రద్దు నిర్ణయానికి సంబంధించి కేంద్ర మాజీ ఆర్థికమంత్రి చిదంబరంతో మాట్లాడగా.. ఇదో మతిలేని చర్యగా ఆయన అభివర్ణించారని చెప్పారు. వేలాది కోట్ల రూపాయల పీఎన్‌బీ కుంభకోణంపైనా రాహుల్ విరుచుకుపడ్డారు. నీరవ్ మోదీ మొత్తం రూ.22 వేల కోట్ల బ్యాంకు సొమ్ము పట్టుకుపోయాడని, అదే సొమ్ము మీలాంటి ఔత్సాహిక యువతకు ఇచ్చి ఉంటే ఎన్ని వ్యాపారాలు నిర్మించి ఉండేవాళ్లో ఊహించుకోండని ఆయన పేర్కొన్నారు. ఆర్థికంగా బలంగా ఎదుగుతున్నప్పటికీ.. ఉద్యోగాల కల్పనలో మాత్రం దేశం దారుణంగా వెనుకబడిందని రాహుల్ అన్నారు. నైపుణ్యం ఉన్న వారికి ఆర్థిక సహకారం, తోడ్పాటు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురయ్యిందని తెలిపారు.

పెండింగ్ కేసుల సంగతి చూడండి

న్యాయమూర్తుల నియామకాలు చేపట్టి పెండింగ్ కేసుల పరిష్కరించేందుకు కృషి చేయాల్సిన న్యాయశాఖ మంత్రి తప్పుడు వార్తల ప్రచారంతో పొద్దుపుచ్చుతున్నాడని రాహుల్ గాంధీ ఆరోపించారు. వివాదాస్పద కేంబ్రిడ్జ్ అనాలిటికా సంస్థ సేవలను కాంగ్రెస్ పార్టీ ఉపయోగించుకుందంటూ న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆరోపించిన విషయం తెలిసిందే! దీనిపై స్పందిస్తూ రాహుల్ పై వ్యాఖ్యలు చేశారు. మంత్రి ఆరోపణలను రాహుల్ ఖండించారు. నిజానికి గత ఎన్నికలలో కేంబ్రిడ్జ్ అనాలిటికా సంస్థ సేవలను ఉపయోగించుకుంది బీజేపీనేనని ప్రత్యారోపణ చేశారు. ఇలాంటి తప్పుడు వార్తలు ప్రచారం చేసే సమయాన్ని కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం వెచ్చించాలని హితవు పలికారు. దేశంలోని అత్యున్నత న్యాయస్థానంలో 55 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని రాహుల్ పేర్కొన్నారు. అదేసమయంలో హైకోర్టులలో 37 లక్షలకు పైగా, కింది కోర్టులలో 2.6 కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని రాహుల్ గాంధీ వివరించారు. అయినా ఇప్పటికీ 400 హైకోర్టులలో, 6 వేల కింది కోర్టులలో న్యాయమూర్తుల నియామకం చేపట్టలేదని ప్రభుత్వాన్ని విమర్శించారు. తన శాఖలో ఇన్ని పెండింగ్ పనులు పెట్టుకుని రవిశంకర్ ప్రసాద్ నిరాధారమైన ఆరోపణలు చేస్తూ కాలాన్ని వృథా చేస్తున్నారని రాహుల్ ఎద్దేవా చేశారు. ఈమేరకు జుడిషియరీ డిమానిటైజ్‌డ్ హాష్ ట్యాగ్‌తో రాహుల్ ట్వీట్ చేశారు.

బెంగళూరు.. చౌక

- ఆసియా నగరాల్లో జీవన వ్యయం రీత్యా
- ప్రపంచంలో సింగపూర్.. చాలా ఖరీదు
- ‘ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్’ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 24: మన దేశంలో గార్డెన్ సిటీగా పేరుగాంచిన బెంగళూరు సహా చెన్నై, ముంబై, ఢిల్లీల్లో జీవన వ్యయం చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రపంచ దేశాల్లోని నగరాలతో పోలిస్తే మాత్రం చాలా చౌక. ఆసియాలో జీవన వ్యయంలో చౌకైన నగరంగా బెంగళూరు నిలిచింది. ఎకనామిస్ట్ ఇంటలిజెన్స్ యూనిట్ ప్రపంచ వ్యాప్తంగా 133 దేశాల్లోని నగరాల్లో ప్రజల జీవన వ్యయంపై నిర్వహించిన సర్వేలో ఈ విషయం తేలింది. ఇటీవల విడుదల చేసిన ర్యాంకింగ్స్ జాబితాలో బెంగళూరు 129వ స్థానంలో నిలిచింది. బెంగళూరు కంటే దిగువన కేవలం.. అంతర్యుద్ధం జరుగుతున్న సిరియాలోని డమాస్కస్, వెనుజులా రాజధాని కరాకస్, కజకిస్థాన్ మాజీ రాజధాని అల్మటి, నైజీరియాలోని లాగోస్ నగరాలు ఉన్నాయి. ఇక ఈ జాబితాలో చెన్నై 126, న్యూఢిల్లీ 124, ముంబై 121 స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచంలోనే జీవన వ్యయంలో ఖరీదైన నగరంగా సింగపూర్ నిలిచింది. 400కుపైగా వస్తువుల ధరలు, 150 ఉత్పత్తులు, సేవల ఆధారంగా ఈ సర్వే నిర్వహించారు. ఆసియాలో చౌకైన నగరాలతో పాటు చాలా ఖరీదైనవి ఉన్నాయి. భారత్ ఆర్థికంగా వృద్ధి చెందుతున్నా.. నగరాల్లో సగటు ప్రజల వేతనాలు, జీవన వ్యయం తక్కువగా ఉన్నట్టు సర్వే పేర్కొంది.

‘టార్గెట్ 21’ అంతకుమించి..



- ఈశాన్యంలో 2019 నాటికి బీజేపీ లక్ష్యం
- లోక్‌సభ ఎన్నికలకు అమిత్ షా వ్యూహం
- పార్టీ బూత్ స్థాయి నేతలకు దిశా నిర్దేశం
- ‘పేజ్ ప్రముఖ్’ల నియామకానికి ఆదేశం

గువహటి, మార్చి 24: రాజ్యసభ ఎన్నికలలో బీజేపీ విజయోత్సాహం నేపథ్యంలో 2019 లోక్‌సభ ఎన్నికలకు పార్టీ అధ్యక్షుడు అమిత్ షా వ్యూహరచన చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈశాన్య భారతంలోని 25 లోక్‌సభ స్థానాల్లో కనీసం 21 కమలవశం కావాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. శనివారం ఇక్కడ నిర్వహించిన పోలింగ్ బూత్ స్థాయి నాయకుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ‘‘మీకందరికీ 2019 ఎన్నికల లక్ష్యం నిర్దేశిస్తున్నాను. ఈశాన్య భారత రాష్ట్రాల్లోని 25 లోక్‌సభ సీట్లకుగాను 21కి మించి మనం గెలిచి తీరాలి’’ అని స్పష్టం చేశారు. ‘‘ఒక్క మిజోరం తప్ప మిగిలిన రాష్ట్రాలన్నీ ‘నెడా’ (నార్త్-ఈస్ట్ డెమొక్రటిక్ అల యెన్స్) భాగస్వామ్య పార్టీల పాలనలోనే ఉన్నాయి. అందువల్ల మీరు చేయాల్సిందల్లా ఈ సానుకూలతను సద్వినియోగం చేసు కుని ముందడుగు వేయడమే’’నని వివరించారు. ఈశాన్య రాష్ట్రాల ప్రగతిపై ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటే ఆ ప్రాంతంలోని అత్యధిక స్థానాల్లో బీజేపీ విజయం సాధించాల్సి ఉంటుందని చెప్పారు. ఓటరు జాబితాలోని ప్రతి పుటకూ ఒక ఇన్‌చార్జి (పేజ్ ప్రముఖ్)ని నియమించాల్సిందిగా పార్టీ అసోం శాఖను ఆదేశించారు.

అతి పురాతన పార్టీ అస్తవ్యస్త విధానాలు

స్వాతంత్ర్యానంతరం అత్యధిక కాలం పాలించిన ‘అతి పురాతన’ (కాంగ్రెస్) పార్టీ అస్తవ్యస్త విధానాలు అనుసరించిందని ఈ సందర్భంగా దుయ్యబట్టారు. ఈ కారణంగానే దేశంలోని మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే ఈశాన్యం బాగా వెనుకబడిందని అమిత్ షా పేర్కొన్నారు. పరాయి పాలన అంతమయ్యేనాటికి భారత్‌లోని అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో అసోం నాలుగో స్థానంలో ఉండేదని గుర్తుచేశారు. అయితే, 2016లో బీజేపీ అధికారంలోకి వచ్చి, సర్బానంద సోనోవాల్ ముఖ్యమంత్రి అయ్యేనాటికి అట్టడుగునుంచి నాలుగో స్థానానికి దిగజారిందని పేర్కొన్నారు. ‘విభజించి పాలించు’ అన్నది కాంగ్రెస్ సిద్ధాంతమైతే.. ‘అందరి తోడ్పాటుతో అందరి ప్రగతి’ అన్నది బీజేపీ ఆదర్శమని చెప్పారు. దేశ పశ్చిమ ప్రాంతంతో సమానంగా ఈశాన్యాన్ని అభివృద్ధి చేస్తామని 2014 ఎన్నికల సందర్భంగా మోదీ వాగ్దానం చేశారని గుర్తుచేశారు. ఆ మేరకు నాలుగేళ్లుగా తన హామీలను నెరవేరుస్తుండటంతో ఈ ప్రాంతం ఎంతగా పురోగమించిందో కళ్లెదుట కనిపిస్తున్నదని పేర్కొన్నారు. యూపీఏ హయాంలో 13వ ఆర్థిక సంఘంద్వారా అసోం పొందిన నిధులు రూ.79,741 కోట్లు కాగా– మోదీ పాలనలో 14వ ఆర్థిక సంఘం నుంచి లబ్ధి రూ.1.55 లక్షల కోట్లకుపైగా పెరిగిందని చెప్పారు. అసోం నుంచి రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికైన నాయకుడొకరు ఈశాన్యానికి ఒరగబెట్టిందేమీ లేదంటూ మాజీ ప్రధాని మన్మోహన్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఎన్డీఏ పాలనలో అసోంసహా ఇతర రాష్ట్రాల కోసం ప్రవేశపెట్టిన వివిధ పథకాలు, కల్పించిన ఆర్థిక లబ్ధి గురించి అమిత్ వివరించారు.

చైనాతో వివాదంలో మోదీ వైఖరి ప్రశంసనీయం

చైనాతో ధోక్లామ్ సరిహద్దు వివాదంపై మోదీ వైఖరి అంతర్జాతీయ ప్రశంసలు అందుకోవడమేగాక ప్రపంచ దేశాలకు బలమైన సందేశం పంపిందన్నారు. అలాగే ఈశాన్యంలో బంగ్లాదేశ్‌తో చిరకాలం నుంచీ నలుగుతున్న భూ వివాదాన్ని మోదీ పరిష్కరించారని తెలిపారు. ఇక తీవ్రవాద సంస్థలు ఒక్కొక్కటిగా లొంగుబాట పడుతున్నందున ఈశాన్యాన్ని పీడిస్తున్న తిరుగుబాటుదారుల సమస్య ఓ కొలిక్కి వస్తున్నదని పేర్కొన్నారు. అలాగే జాతీయ పౌర నమోదు (ఎన్ఆర్‌సీ) నవీకరణతో విదేశీయుల పౌరసత్వ సమస్య కూడా త్వరలో పరిష్కారం కాగలదని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇక పార్లమెంటులో విపక్షాలు అనవసర రభసతో సభా కార్యకలాపాలను విచ్ఛిన్నం చేస్తున్నాయని అమిత్ షా ఆరోపించారు. శాసనసభ ఎన్నికలలో ఒకదాని వెంట ఒకటిగా రాష్ట్రాలను బీజేపీ కైవసం చేసుకోవడాన్ని ప్రధాన ప్రతిపక్షం జీర్ణించుకోలేని స్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా ప్రతిపక్షాలు లేనిపోని ఆందోళనకు దిగి ఉభయసభలనూ అడ్డుకుంటున్నాయని విమర్శించారు. ‘‘పార్లమెంటులో ప్రతి అంశంపైనా చర్చించడానికి ప్రధాని మోదీతోపాటు బీజేపీ కూడా సదా సిద్ధం. కానీ, బడ్జెట్‌లో ప్రకటించిన రెండు కీలక పథకాలపై చర్చను అడ్డుకునేందుకే కాంగ్రెస్ పార్టీ పనిగట్టుకుని సభా కార్యకలాపాలను విచ్ఛిన్నం చేస్తోంది’’ అని మండిపడ్డారు.

రాజ్యసభలో బీజేపీ 69... కాంగ్రెస్ 50

పార్లమెంటు ఎగువ సభకు నిర్వహించిన తాజా ద్వైవార్షిక ఎన్నికల అనంతరం బీజేపీ బలం 69కి పెరిగింది. ప్రస్తుతం ఆ పార్టీకి 58 మంది సభ్యులుండగా వారిలో 17 మంది వచ్చేనెల రిటైరవుతారు. అయితే, వీటన్నిటికీ నిలబెట్టుకోవడమేగాక అదనంగా 11 సీట్ల (మొత్తం 28)ను బీజేపీ సాధించగలిగింది. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ మరింత వెనుకబడింది. ఆ పార్టీకి ప్రస్తుతం 54 మంది సభ్యుల బలం ఉండగా వారిలో 14 మంది రిటైరవుతారు. అయితే, ఈ ఎన్నికలలో కాంగ్రెస్ 10 స్థానాలు మాత్రమే సాధించడంతో నాలుగు సీట్లు తగ్గిపోగా ప్రస్తుత బలం 50కి తగ్గనుంది. అయితే, రాష్ట్రాల మండలి అయిన ఎగువసభలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకి ఆధిక్యం ఇంకా దూరమే. అలాగే ఆరుగురు సభ్యులున్న మిత్రపక్షం టీడీపీ తెగదెంపులు చేసుకుంటున్న ప్రకటించడం గమనార్హం. కానీ, అన్నా డీఎంకేతోపాటు టీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీ, బీజేడీలు వెలుపలి నుంచి మద్దతిస్తున్నందున సభలో తమ పరిస్థితి మెరుగ్గానే ఉందని బీజేపీ నేతలు అంటున్నారు.



కర్ణాటకలో బీజేపీ ఓటమికి మాయ పంతం!

రాజ్యసభ ఎన్నికల సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ 9 స్థానం సాధించేందుకు బీఎస్పీ ఎమ్మెల్యేను అమిత్ షా ఆకట్టుకోగలిగారు. దీంతో ఆ పార్టీ అభ్యర్థి పరాజయం పాలయ్యారు. ఈ పరిణామంతో రగిలిపోతున్న బీఎస్పీ అధినేత్రి మాయావతి సదరు ఎమ్మెల్యేపై సస్పెన్షన్ వేటు వేశారు. మరోవైపు రెండు నెలల్లో జరగనున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పరాజయానికి కంకణం కట్టుకున్నారని సమాచారం. రాష్ట్ర జనాభాలో దళితులు 20 శాతం కావడంతో దేవెగౌడ నేతృత్వంలోని జేడీఎస్ ఇప్పుడు బీఎస్పీతో జట్టుకట్టేందుకు ఆసక్తి చూపుతోంది. పాతికేళ్లుగా తన కంచుకోట, సాక్షాత్తూ సీఎం ఆదిత్యనాథ్ ప్రాతినిధ్యం వహించిన గోరఖ్‌పూర్ లోక్‌సభ స్థానం ఉప ఎన్నికలో రెండు వారాల కిందట బీజేపీ పరాయజం పాలైంది. ఎస్పీతో చేయి కలిపి ఆ పార్టీ అభ్యర్థిని గెలిపించడంద్వారా బీఎస్పీ అధినేత్రి అక్కడ బీజేపీని మట్టి కరిపించారు. ఈ నేపథ్యంలో కర్ణాటక జనాభాలో ఐదోవంతుగా ఉన్న చలువాది, మాదిగ వంటి కులాలవారిని మాయావతి ఆకట్టుకోగలరని జేడీఎస్ భావిస్తోంది.

బీఎస్పీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ సస్పెన్షన్

లఖ్‌నవ్: రాజ్యసభ ఎన్నికల సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన బీఎస్పీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సింగ్‌పై సస్పెన్షన్ వేటుపడింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షురాలు మాయావతి శనివారం ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఎన్నికల పోలింగ్ అనంతరం తాను బీజేపీకి ఓటు వేసినట్లు ఆయన బహిరంగంగానే ప్రకటించడం గమ నార్హం. ఈ పరిణామంతో బీఎస్పీ అధికారిక అభ్యర్థి ఓటమి పాల య్యారు. దీనిపై ఆగ్రహించిన పార్టీ అధినేత్రి ఆయనపై చర్య తీసుకున్నారు.

కేంబ్రిడ్జ్ అనలిటికాకు కేంద్రం నోటీసులు

- ఫేస్‌బుక్‌లో భారతీయుల డేటాపై ప్రశ్నలు
- 31లోగా సమాధానమివ్వాలని ఆదేశం



న్యూఢిల్లీ, మార్చి 24: అమెరికాలో ఫేస్ బుక్ వినియోగదారుల డేటా చౌర్యానికి పాల్ప డిన కేంబ్రిడ్జ్ అనలిటికాకు భారత ప్రభుత్వం నోటీసులు జారీచేసింది. భారతీయుల వ్యక్తిగత సమాచారంపై ఏవైనా సంస్థలు, వ్యక్తులు వాడుకున్నారా అనే కోణంలో ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. డేటా దుర్వినియోగం జరిగే అవకాశాలపై ఆరు ప్రశ్నలను సంధిస్తూ కేంబ్రిడ్జ్ అనలిటికాకు నోటీసులు పంపింది. ‘మీ కంపెనీ భారతీయుల డేటాను సేకరించిందా? సమాచారాన్ని ఎలా పొందారు? డేటా సేకరించేటప్పుడు ఆ యా వ్యక్తుల అనుమతి తీసుకున్నారా? అది ఎవరి కోసం చేశారు? ఆ సమాచా రాన్ని ఎలా వాడారు? ఆ డేటా ఆధారంగా ఏదైనా ప్రొఫైలింగ్ చేశారా?’ అన్న ప్రశ్నలకు మార్చి 31 లోపు సమాధానం ఇవ్వాలని కేంద్రం ఆదేశించింది. ఒకవేళ వీటిపై స్పందించపోతే, కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ నుంచి కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. కాగా అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్ కోసం పనిచేసిన కేంబ్రిడ్జి అనలిటికాకు 5 కోట్ల మంది ఫేస్‌బుక్ ఖాతాదారుల వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేంబ్రిడ్జి అనలిటికాతో సంబంధాలపై బీజేపీ-కాంగ్రెస్ పరస్పర ఆరోపణలకు దిగిన నేపథ్యంలో కేంద్రం ఆ సంస్థకు నోటీసులను జారీ చేయడం విశేషం. ఇదిలా ఉండ గా, ఎన్నికల్లో ఓటర్లను అక్రమ పద్ధతుల్లో ప్రభావితం చేసేందుకు జరిగే చట్ట వ్యతిరేక చర్యలను అడ్డుకోవటానికి సంబంధించి దర్యాప్తు సంస్థలతో సమన్వ యం ఏర్పరచుకోనున్నట్లు ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ ఓపీ రావత్ తెలిపారు. దీనికి సంబంధించిన సూచనలు, సలహాలను దర్యాప్తు సంస్థల నుంచి స్వీకరిస్తామని వెల్లడించారు.

ఫేస్‌బుక్‌ను వీడుతున్న టాప్ కంపెనీలు

- ఖాతాలను తొలగించిన టెస్లా, స్పేస్‌ఎక్స్



న్యూయార్క్, మార్చి 24: ఫేస్‌బుక్ ఖాతాదారుల వ్యక్తిగత సమాచారాన్ని కేంబ్రిడ్జి అనలిటికా చోరీ వ్యవహారంతో సోషల్ మీడియా దిగ్గజం చిక్కుల్లో పడింది. ‘ఫేస్‌బుక్ నుంచి వైదొలగాల్సిన సమయం ఆసన్నమైంది’ అంటూ వాట్సప్ సహ వ్యవస్థాపకుడు బ్రెయిన్ ఆక్టన్ ట్విటర్ ఇచ్చిన పిలుపు ఇప్పుడు ఫేస్‌బుక్ కొంపముంచుతోంది. ఆ ట్వీట్‌కు స్పందించి పలు ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు ఫేస్‌బుక్ నుంచి వైదొలుగుతున్నాయి. తమ కంపెనీల ఫేస్‌బుక్ పేజీలను తొలగిస్తున్నాయి. వెబ్‌బ్రౌజర్ మొజిల్లా, ప్రముఖ విద్యుత్ కార్ల కం పెనీ టెస్లా, అమెరికాకు చెందిన ప్రైవేటు అంతరిక్ష పరిశోధన సంస్థ స్పేస్‌ఎక్స్ వంటి కంపెనీలు ఈ కోవలో ముందున్నాయి. ఫేస్‌బుక్‌లో టెస్లా, స్పేస్‌ఎక్స్ కంపెనీల ఖాతాలను తొలగించాలని ట్విటర్‌లో తన ఫాలోయర్లు కోరడంతో వాటిని డిలీట్ చేసినట్లు ఆ కంపెనీల సీఈవో ఎలన్ మస్క్ తెలిపారు.

30 లక్షల కోట్ల సంపద ఆవిరి

- మూడు నెలల్లో 500 కంపెనీల నష్టమిది
- యూఎస్ స్టాక్‌మార్కెట్లో ఆటుపోట్ల వల్లే!

వాషింగ్టన్, మార్చి 24: కోటీ.. రెండు కోట్లు కాదు.. అక్షరాలా ముప్పై లక్షల కోట్లు! కేవలం మూడు నెలల్లోపే ప్రపంచంలోని 500 సంపన్న కంపెనీలు కోల్పోయిన సంపద విలువ ఇది!! అమెరికా స్టాక్‌మార్కెట్ వాల్‌స్ట్రీట్‌లో ఆటుపోట్లే ఆ భారీ నష్టాలకు కారణం. ఈ ఏడాది జనవరి 26న ఆయా కంపెనీల గరిష్ఠ విలువను పరిగణనలోకి తీసుకుని పరిశీలిస్తే మార్చి 24 నాటికి సుమారు రూ.30 లక్షల కోట్లకు పైగా సంపద ఆవిరైపోయిందని స్టాక్ నిపుణులు పేర్కొన్నారు. ఇందులో దాదాపు సగం మొత్తం గడిచిన వారంలోనే ఆవిరైంది. గడిచిన వారంలోనే 500 కంపెనీలకు సంబంధించి.. 11.76 లక్షల కోట్ల సంపద కనుమరుగైంది. ఫేస్‌బుక్ యూజర్ల డేటా లీక్ వ్యవహారంతో గత వారంలో ఆ సంస్థకు సంబంధించిన షేర్లు భారీగా పతనమడంతో రూ.69 వేల కోట్ల నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. అలాగే లారీ ఎలిసన్, ఆరకిల్, బెర్క్‌షిర్ హాత్‌వే, అమెజాన్, ఆల్ఫాబెట్ సహా పలు కంపెనీలు ఇలా నష్టపోయిన వాటి జాబితాలో ఉన్నాయి.

అందుకోసం ఎందాకైనా...

- బీజేపీని ఢీకొట్టగలిగే చోట కాంగ్రెస్‌కు అండ
- సీపీఎం వైఖరిలో మార్పువైపు కరత్ వ్యాఖ్య!
- ‘పీపుల్స్ డెమోక్రసీ’ పత్రికలో సంపాదకీయం
- పొత్తు ఉండదన్న రాజకీయ తీర్మానానికి భిన్నం



న్యూఢిల్లీ, మార్చి 24: కాంగ్రెస్ పార్టీతో సంబంధాలపై సీపీఎం వైఖరి సడలుతోందా? భవిష్యత్తులో ఆ పార్టీతో అవగాహనగానీ, ఎన్నికల పొత్తుగానీ ఉండరాదన్న రాజకీయ తీర్మానం ముసాయిదాకు భిన్నంగా వ్యవహరించనుందా? సీపీఎం అధికార వాణి ‘పీపుల్స్ డెమొక్రసీ’లో పార్టీ అగ్రనేత, మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ కరత్ సంపాదకీయం చదివితే ఈ ప్రశ్నలకు అవునన్న సమాధానమే వస్తుంది. ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ ఉప ఎన్నికల అనంతరం ‘ఉత్తరప్రదేశ్‌లో ఉత్పాత శకునాలు’ శీర్షికన ఆయన సంపాదకీయ వ్యాఖ్య రాశారు. ‘‘బీజేపీని ఓడించే భవిష్యత్ ఎన్నికల ఎత్తుగడలకు సంబంధించి యూపీ ఉప ఎన్నికలు కీలక పాఠాలు నేర్పాయి. బీజేపీయేతర ప్రధాన పార్టీలు ఏకమైతే చిన్న పార్టీలు, ఇతర శక్తులు వాటికి మద్దతిస్తాయని ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి’’ అని అందులో కరత్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీకి అడ్డుకట్ట వేయడం కోసం ఎందాకానైనా వెళతామని, చివరకు ఆ పార్టీని ఓడించగల చోట కాంగ్రెస్‌కు మద్దతివ్వడానికీ సిద్ధమేనని ప్రకటించారు. కాగా, బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్‌తో చేయి కలపాలన్న సీపీఎం ప్రస్తుత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆలోచనను కరత్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ మేరకు పార్టీలో ప్రభావం చూపగల కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ వంటివారి తోడ్పాటుతో ఏచూరి ప్రతిపాదనను భూస్థాపితం చేశారు. తదనుగుణంగా ‘‘కాంగ్రెస్ పార్టీతో ఎన్నికల అవగాహనగానీ, పొత్తుగానీ ఉండరాదు’’ అని ఈ ఏడాది ఆరంభంలో సీపీఎం రాజకీయ తీర్మానం ముసాయిదా స్పష్టం చేసింది.

నాడు భిన్నస్వరం... నేడు మద్దతు రాగం

ఈ సంపాదకీయ వ్యాఖ్యల నేపథ్యంలో సీపీఎం తన వైఖరిని సడలిస్తున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రతిపక్షాల ఓట్లు ఏమాత్రం చీలినా అది బీజేపీకే లాభిస్తుందని సీపీఎం నాయకత్వం చెబుతుండటం ఇందుకు నిదర్శనం. అంతేకాకుండా రాష్ట్రాలవారీగా బీజేపీ వ్యతిరేక ఓటుబ్యాంకును సమీకరించాలని నొక్కి చెప్పడం విశేషం. బీజేపీ చేతిలో వామపక్షాలు పరాభవం ఎదుర్కొన్న పశ్చిమబెంగాల్, త్రిపుర వంటి రాష్ట్రాల్లో ఆ పార్టీ వ్యతిరేక శక్తులను ఏకం చేయడానికి తలుపులు తెరిచిన సూచనలు కరత్ సంపాదకీయ వ్యాఖ్యలో ప్రస్ఫుటమవుతున్నాయి. మరోవైపు బీజేపీయేతర, కాంగ్రెసేతర కూటమి దిశగా తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రతిపాదిస్తున్న ‘ఫెడరల్ ఫ్రంట్’ ఏర్పాటు యత్నాలు విజయవంతం కావడం కష్టమేనని కరత్ పేర్కొన్నారు. ‘‘డీఎంకే, ఆర్జేడీ వంటి కొన్ని ప్రాంతీయ పార్టీలు ప్రస్తుతం కాంగ్రెస్‌తో కలిసి నడుస్తున్నాయి. పైగా విధానపరంగా, ప్రాంతీయ ప్రయోజనాల పరంగా ఆయా పార్టీల మధ్య వాదవివాదాలున్నాయి. ప్రాంతీయ పార్టీలన్నీ కలసిరావడంలో ఇలాంటివి ప్రతిబంధకం కాగలవు’’ అని కరత్ వివరిస్తున్నారు. తద్వారా మూడో కూటమి విషయంలో తమకు పెద్దగా ఉత్సాహం లేదని తేల్చారు.

కొడియేరి మాటల్లో వ్యూహం మార్పు సూచన

సీపీఎంలో తాజా రాజకీయ వ్యూహం పునరేకీకరణ యోచన పార్టీ కేరళ రాష్ట్రశాఖ కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ మాటల నుంచి పుట్టిందేనన్న మాట వినిపిస్తోంది. ఇటీవల ఓ బహిరంగ సభలో మాట్లాడిన సందర్భంగా– రాష్ట్రంలో కాంగ్రెస్ తమ ప్రధాన శత్రుపక్షమైనప్పటికీ అది గెలవగల అవకాశాలున్న చోట్ల సమర్థించాలని భావిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, కాంగ్రెస్‌తో భాగస్వామ్యం దిశగా సీతారాం ఏచూరి వైఖరిని పక్కకు తప్పించడంలో సీపీఎం కేరళ శాఖ తన పలుకుబడిని కరత్‌వైపు మళ్లించడం ఈ సందర్భంగా గమనార్హం. త్రిపుర శాసనసభ ఎన్నికల ఘోర పరాజయం నేపథ్యంలోనే సీపీఎం రాజకీయ ధోరణిలో గణనీయ మార్పు ద్యోతకమవుతోంది. ఆ మేరకు బీజేపీని ఓడించే వ్యూహంలో భాగంగా విస్తృత అవగాహన అవసరమన్న భావనకు వచ్చినట్లు కనిపిస్తోంది.



మహేశ్

'భరత్ అనే నేను' ఫస్ట్ సింగిల్

మహేశ్, కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'భరత్ అనే నేను'. డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై దానయ్య డి.వి.వి. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కైరా అద్వాని హీరోయిన్. ఇప్పటికే ఫస్ట్ ఓథ్, టీజర్‌తో ఆకట్టుకున్న ఈ సినిమా ఏప్రిల్ 20న విడుదల కానుంది. ఇదిలా ఉంటే.. దేవిశ్రీ ప్రసాద్ స్వరసారథ్యంలో రూపొందిన పాటలను ఏప్రిల్ మొదటి వారంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆలోపు సింగిల్స్ విడుదల చేసే ప్లాన్‌లో ఉంది చిత్ర బృందం. అందులో భాగంగా.. ఆదివారం ఉదయం 10 గంటలకు ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేస్తున్నారు. 'శ్రీమంతుడు' తరువాత మహేశ్, కొరటాల, దేవిశ్రీ ప్రసాద్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకుల్లో, అభిమానుల్లో ఆడియోపై, సినిమాపై మంచి అంచనాలే ఉన్నాయి.


మే 11న 'మెహబూబా'



ఆకాశ్

పూరి ఆకాశ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'మెహబూబా'. పూరి కనెక్ట్స్ సంస్థ నిర్మిస్తోంది. నేహాశెట్టి కథానాయిక. ఈ చిత్రాన్ని మే 11న విడుదల చేయనున్నారు. ఈ చిత్రాన్ని వెంకటేశ్వర ఫిలింస్ ద్వారా దిల్‌రాజు విడుదల చేస్తున్నారు. తమకు ఎంతో ప్రత్యేకమైన ఈ సినిమా కోసం దిల్‌రాజుతో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపింది పూరి కనెక్ట్స్ సహ వ్యవస్థాపకురాలు ఛార్మి. పూరి జగన్నాథ్, దిల్‌రాజు కాంబినేషన్‌లో 'ఇడియట్', 'పోకిరి' వంటి బ్లాక్‌బస్టర్స్ విడుదలయ్యాయి. 'పోకిరి' సినిమా బాక్సాఫీసు వద్ద రికార్డు సృష్టించింది. దీంతో 'మెహబూబా'పై అంచనాలు మరింత పెరిగాయి.

రెండోసారి తాత అయిన బాలకృష్ణ





మొదటి కుమార్తె బ్రహ్మిణి కుమారుడు దేవాంశ్ పుట్టుకతో తాతయ్య హోదా సంపాదించుకున్న నందమూరి బాలకృష్ణ ఇప్పుడు తన రెండవ కుమార్తె తేజస్వినికి కుమారుడు జన్మించడంతో మరోమారు తాతయ్య అయ్యారు. మార్చి 22 తెల్లవారు ఝామున తేజస్విని, శ్రీభరత్‌లకు పండంటి మగబిడ్డ పుట్టాడు. మనవడి ఆగమనంతో నందమూరి కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.

2 స్టేట్స్ ప్రారంభం



లక్ష్య ప్రొడక్షన్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా రూపొందిస్తున్న చిత్రం '2 స్టేట్స్'. చేతన్ భగత్ రాసిన నవల '2 స్టేట్స్' ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో అడివి శేష్, శివానీ రాజశేఖర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి రెబల్‌స్టార్ కృష్ణంరాజు కెమెరా స్విచ్చాన్ చేయగా ఎస్.ఎస్.రాజమౌళి క్లాప్ కొట్టారు. కె.రాఘవేంద్ర రావు తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో ఇంకా టి. సుబ్బరామిరెడ్డి, కోడి రామకృష్ణ, వి.వి. వినాయక్ తదితరులు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా నిర్మాత ఎం.ఎల్.వి. సత్యనారాయణ మాట్లాడుతూ ''తెలుగులో చేస్తున్న '2 స్టేట్స్' చిత్రం వన్ ఆఫ్ ది బెస్ట్ మూవీస్‌లో ఒకటిగా నిలుస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. అనూప్ రూబెన్స్ మాట్లాడుతూ ''నేను హిందీలో వచ్చిన '2 స్టేట్స్' సినిమా చూశాను. సంగీతానికి చాలా స్కోప్ ఉన్న చిత్రమిది'' అన్నారు. డైరెక్టర్ వెంకట్ కుంచం మాట్లాడుతూ ''అడాప్ట్ చేసుకుని సినిమా చేయడం అంత సులువు కాదు. '2 స్టేట్స్' సినిమా స్క్రిప్ట్‌పై చాలా రోజులు వర్క్ చేశాం. మధు శ్రీనివాస్, మిథున్ చక్రవర్తి వంటి టీం సభ్యులు దొరికారు. అనూప్ ఆల్ రెడీ మూడు బ్యూటీఫుల్ ట్యూన్స్ అందించారు. సినిమాను మూడు షెడ్యూల్స్‌లో పూర్తి చేస్తాం. మొదటి షెడ్యూల్‌ను ఏప్రిల్ 5 నుండి 19 వరకు హైదరాబాద్, మే లో రెండవ షెడ్యూల్‌ను కోల్‌కతాలో, మూడో షెడ్యూల్‌ను యు.ఎస్‌లో ప్లాన్ చేశాం'' అన్నారు. శివానీ రాజశేఖర్ మాట్లాడుతూ ''నేను నటించడానికి అంగీకరించిన నా తల్లిదండ్రులకు థాంక్స్. '2 స్టేట్స్' సినిమాలో నటించడం ఆనందంగా ఉంది'' అన్నారు. అడివి శేష్ మాట్లాడుతూ ''దర్శకుడు వెంకట్ నాకు చాలా మంచి మిత్రుడు. ఎప్పటి నుండో మంచి లవ్‌స్టోరీలో నటించాలని అనుకునేవాడిని. ఈ సినిమాతో నా కోరిక తీరనుంది'' అన్నారు.

మీరు కూడా ప్రయత్నించండి



దీపికా పదుకొనే

ప్రస్తుతం మన జీవితం యాంత్రికంగా మారి పోయింది. శారీరక శ్రమ కంటే మానసిక ఒత్తిడులు పెరిగిపోయాయి. కోపం, అసహనం, నిరాశలకు లోనవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. మానసిక ఆరోగ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం కోసం బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొనే 'ది లవ్, లీవ్, లాఫ్' ఫౌండేషన్‌ను స్థాపించిన సంగతి తెలిసిందే. ఈ ఫౌండేషన్ మానసిక ఆరోగ్యంపట్ల దేశ ప్రజలకు ఏ మేరకు అవగాహన ఉందనే అంశం గురించి ఒక నివేదికను విడుదల చేసింది. ఈ సందర్భంగా దీపికా మాట్లాడుతూ ''నేను ఒకప్పుడు డిప్రెషన్‌తో బాధపడ్డాను. కారణం లేకుండా ఏడ్చేదాన్ని. ఒంటరిదాన్నని భావించేదాన్ని. ఆ విషయాన్ని నేను నా సన్నిహితులతో పంచుకున్నాను. వారి ప్రేమ, వైద్యుల సహకారంతో ఆ సమస్య నుంచి బయటపడ్డాను. ఆ సమయంలోనే ఇలాంటి ఓ ఫౌండేషన్‌ను స్థాపించి ప్రజలకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని అనుకున్నాను. ఈ ఫౌండేషన్ తరుపున పనిచేయడం నాకు చాలా ఆనందంగా ఉంది. నేను ఇలాంటి మానసిక సమస్యల నుంచి బయట పడ్డాను. మీరు కూడా ప్రయత్నించండి. స్టీఫేన్ ఫ్రై చెప్పినట్లు ఏదో ఒకరోజు ఆహ్లాదంగా ఉంటుంది'' అంటోంది దీపిక.

'టాక్సీవాలా' ఫస్ట్ గేర్



విజయ్ దేవరకొండ

'అర్జున్ రెడ్డి'తో స్టార్‌డమ్ పొందిన యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ.. అతి త్వరలో 'టాక్సీవాలా'గా సందడి చేయనున్నారు. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రియాంక జవాల్కర్, మాళవికా నాయర్ కథానాయికలుగా నటిస్తున్నారు. మే 18న ఈ సినిమా తెరపైకి రానుంది. ఇదిలా ఉంటే.. ఈ సినిమా ఫస్ట్‌గేర్‌ను శనివారం విడుదల చేశారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు జిఎ2 పిక్చర్స్, యు.వి. క్రియేషన్స్ సంస్థలు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

నలుగురి మధ్య జరిగే కథ

హర హర చలన చిత్ర సమర్పణలో ఎస్.శ్రీకాంత్ రెడ్డి, రామ మోహనరావు ఇప్పిలి నిర్మిస్తున్న చిత్రం 'ఇంతలో ఎన్నెన్ని వింతలో'. ఈ చిత్రానికి హీరో హీరోయిన్స్ నందు, సౌమ్య వేంగోపాల్, పూజ రామచంద్రన్ కాగా దర్శకుడు వరప్రసాద్ వరికూటి. ఈ చిత్రం అన్నీ కార్యక్రమాలను పూర్తి చేసుకొని ఏప్రిల్ 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత రామమోహనరావు మాట్లాడుతూ ''ఇటీవలే ఈ చిత్ర పాటలు ఎఫ్ ఎమ్ ద్వారా విడుదలయ్యాయి. నలుగురి మధ్య ఉత్కంఠభరితంగా సాగే కథ... సినిమా చాలా బాగా వచ్చింది'' అన్నారు. దర్శకుడు వరప్రసాద్ వరి కూటి మాట్లాడుతూ ''ఈ సినిమాలో కథ, స్క్రీన్‌ప్లే హైలైట్స్‌గా నిలుస్తాయి. ఆరోగ్యకరమైన గార్డెన్ నుంచి ఒక ఫ్రూట్ బయటకు వస్తే ఎలా ఫీల్ అవుతారో ఆ ఫ్రెష్ ఫీల్‌ను సినిమా చూస్తున్న ప్రేక్షకులు అనుభ విస్తారు'' అన్నారు.



వరప్రసాద్, రామమోహనరావ్




మేఘా ఆకాశ్

అందుకే అతనితో రెండోసారి

నితిన్, కృష్ణచైతన్య కాంబినేషన్‌లో తెరకెక్కిన సినిమా 'ఛల్ మోహన్ రంగ'. పవన్ కల్యాణ్ ఓ నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రానికి త్రివిక్రమ్ కథను అందించారు. తమన్ స్వరాలను సమకూర్చారు. ఏప్రిల్ 5న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉంటే.. 'లై' తర్వాత ఈ చిత్రంలో నితిన్ సరసన రెండోసారి జంటగా నటించిన మేఘా ఆకాశ్ అతని గురించి కొన్ని తెలియజేసింది. ''నితిన్ హీరో మాత్రమే కాదు ఈ సినిమాకి నిర్మాత కూడా. అయినా అలాంటి ఫీలింగ్ ఏమీ లేకుండా అందరితో కలిసిపోయే వ్యక్తి నితిన్. అందరితో సరదాగా ఉంటారు. అతని విషయంలో ఇది నాకు బాగా నచ్చింది. 'లై' సినిమాలో నితిన్‌తో కలిసి నటిస్తున్నపుడే దీన్ని గమనించాను. అందుకే రెండోసారి ఎంతో హ్యాపీగా నటించగలుగుతున్నాను'' అంటూ నితిన్‌ని తెగ పొగిడేస్తోంది మేఘా.

'ఎం.ఎల్.ఎ'లో ఆ జాగ్రత్తలు తీసుకున్నాం



ఉపేంద్ర మాదవ్

నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'ఎం.ఎల్.ఎ'. శుక్రవారం ఈ సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా దర్శకుడు ఉపేంద్ర మాధవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ ''కల్యాణ్‌రామ్‌గారు పటాస్ టైమ్‌లో పరిచయమయ్యారు. ఏదైనా మంచి కథ ఉంటే చెప్పమని అప్పుడే ఆయన అన్నారు. సంవత్సరంన్నర తర్వాత ఓ కథ రెడీ చేసుకొని కల్యాణ్‌గారికి బాగా క్లోజ్ అయిన కారుమంచి రఘుని అడిగాను. ఆయన వెళ్ళి కల్యాణ్‌గారికి చెప్పడం, ఆయన నన్ను రమ్మనడం, నేను కథ చెప్పడం జరిగింది. కథ వినగానే ఆయన వెంటనే ఓకే చెప్పడం జరిగింది. మంచి లక్షణాలున్న అబ్బాయి అనేది నేను రాసుకున్న కథలో ఉంది కాబట్టి ఎంఎల్ఏ అనే టైటిల్ చాలా బాగుంటుందని దాన్నే ఫిక్స్ చెయ్యడం జరిగింది. అయితే మొదట సెకండాఫ్ వేరే అనుకున్నాను. అమ్మాయి ప్రేమ పొందడానికి సాధించ లేని టాస్క్ ఒకటి ఉంటే బాగుంటుం దని సెకం డాఫ్ని మార్చ డం జరిగింది. దానికి నువ్వొస్తానంటే నేనొద్దంటానా సినిమాని రిఫరెన్స్‌గా తీసుకున్నాను. అమ్మాయి ప్రేమకోసం ఎమ్మెల్యే అవడం కొత్తగా ఉంటుందనిపించింది. ఈ సబ్జెక్ట్‌కి తగ్గట్టు టైటిల్ కూడా ఎమ్మెల్యే అని పెడదాం అని కల్యాణ్‌గారికి చెప్తే పర్ఫెక్ట్‌గా ఉంది అన్నారు. కథలో హీరో ఎమ్మెల్యే అవ్వడమే లక్ష్యంగా ఉంటుంది తప్ప ఎక్కడా పొలిటికల్ టచ్ కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరిగింది. సినిమా రిలీజ్ అయిన ఏరియాల్లో చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది'' అన్నారు.

కమర్షియల్ ఎలిమెంట్స్‌తో వున్న సినిమాతోనే డైరెక్టర్‌గా ఇంట్రడ్యూస్ అవ్వాలని ఈ కథను ఎంచుకోవడం జరిగింది. శ్రీను వైట్లగారు ఈ స్క్రిప్ట్ విని చాలా బాగుంది అని చెప్పారు.



మారుతి

డోంట్ వర్రీ

'మహానుభావుడు' విజయం తర్వాత మారుతి.. చైతన్యతో ఓ సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి 'శైలజా రెడ్డి' అల్లుడు అనే టైటిల్ పరిశీలనలో ఉంది. అనూ ఇమాన్యుయేల్ ఇందులో హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ పూర్తయింది. అయితే రెండో షెడ్యూల్ కోసం తాను వెయిట్ చేస్తున్నానని తన ట్విట్టర్ అకౌంట్ ద్వారా తెలిపారు మారుతి. చైతన్య 'సవ్యసాచి' చిత్రీకరణలో బిజీగా ఉన్నారని.. అది పూర్తయిన తర్వాత తన సినిమా షెడ్యూల్ ప్రారంభమవుతుందని అన్నారు మారుతి. 'డోంట్ వర్రీ సినిమా అభిమానులను అలరించేలా.. మంచి కామెడీతో మాస్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంద'ని కూడా మారుతి తెలిపారు.




రాష్ట్రంలో టీఎస్టీ

తెలుగు తమ్ముళ్ల సర్వీస్ టాక్స్

- నరసారావుపేటలో కోడెల టాక్స్
- ప్రభుత్వం మొత్తం అవినీతిమయం
- ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్ జగన్

నరసారావుపేట, మార్చి 24: దేశవ్యాప్తంగా జీఎస్టీ (వస్తు సేవల పన్ను) అమలవుతుంటే.. రాష్ట్రంలో టీఎస్టీ (తెలుగు తమ్ముళ్ల సర్వీస్ టాక్స్) అమలవుతోందని వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత జగన్‌మోహన్ రెడ్డి ఆరోపించారు. నరసరావుపేటలో అయితే మరీ దారుణంగా (కేఎస్టీ) కోడెల సర్వీస్ టాక్స్ అమలవుతోందని విమర్శించారు. కిచిడీ బండి నుంచి తోపుడు బండ్లవరకు, రైతుల భూముల నుంచి రైల్వే కాంట్రాక్టుల వరకు ప్రతి దానికీ టాక్స్ కట్టకతప్పని పరిస్థితి ఉందని అన్నారు. శనివారం ప్రజాసంకల్ప యాత్రలో గుంటూరు జిల్లా నరసారావు పేట పల్నాడు సెంటర్ బహిరంగ సభలో జగన్ ప్రసంగించారు. మరో ఏడాదిలో ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో మీరందరూ నాలుగు సంవత్సరాల చంద్రబాబు నాయుడి పాలన చూశారని, రాబోయే రోజుల్లో మీకు ఎలాంటి నాయకుడు కావాలో ఆలోచించాలని కోరారు. ప్రభుత్వం మొత్తం అవినీతిమయం అయిందని దుయ్యబట్టారు. 'అనగనగనగా ఒక దొంగ దొంగతనం చేస్తూ పట్టుబడి.. తనను అరెస్ట్ చేస్తే ఊరిని, ఊరి ప్రజలను అవమాన పరిచినట్టే' అని అన్నట్లుంది చంద్రబాబు వ్యవహారం అన్నారు. ఎవరు చెప్పారని చంద్రబాబు ప్రత్యేక హోదా తాకట్టు పెట్టారని ప్రశ్నించారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టాలని, అవినీతి సొమ్ముతో ఎమ్మెల్యేలను కొనాలని ఏ ప్రజలు చెప్పారని నిలదీశారు. ''కేంద్రం కట్టవలసిన పోలవరం ప్రాజెక్టును కమీషన్ల కోసం తీసుకోవాలని ఎవరు చెప్పారు? ఇసుక, మట్టి, కరెంట్, మద్యం, గుడి భూముల వరకూ దోచుకొమ్మని ఎవరు చెప్పారు? మేనిఫెస్టోలో పెట్టిన ఒక్క హామీనైనా అమలు చేశారా? పెట్రోలు, డీజిల్‌పై ఏ రాష్ట్రంలో లేనివిధంగా లీటరుకు 7 రూపాయలు అదనంగా విధించడాన్ని ఎవ్వరూ అడగకూడదని, తనను బలహీనపరిస్తే రాష్ట్రం బలహీన పడుతుందని దొంగ ఏడుపులు ఏడుస్తున్నారు. ఇలాంటి పాలనను త్వరలోనే బంగాళాఖాతంలో కలిపే రోజు వస్తుంది. రాష్ట్రాన్ని అమ్మేసిన చంద్రబాబు నాయుడు ప్రతి ఇంటికి కేజీ బంగారం, బెంజికారు ఇస్తానని కూడా చెప్పి మోసం చేస్తాడు. మీ వద్దకు వచ్చి ఓటుకు మూడువేలు డబ్బులు పంపిణీ కూడా చేస్తాడు. మూడు వేలిస్తే ఐదువేలు గుంజండి. ఆ డబ్బంతా మన జేబుల్లోనుంచి దోచిందే. ప్రజలందరూ మనస్సాక్షికి అనుగుణంగా ఓటు వేయండి'' అని జగన్ అన్నారు.



అమిత్ షా లేఖకు సమాధానివ్వండి

- రాజకీయ కారణాలేంటో చెప్పండి
- నాలుగేళ్లు హోదాపై మాట్లాడలేదేం?
- చంద్రబాబుపై వైవీ సుబ్బారెడ్డి ధ్వజం

హైదరాబాద్, మార్చి 24: రాజకీయ కారణాలతోనే ఎన్డీయే నుంచి టీడీపీ వైదొలిగిందంటూ అమిత్ షా రాసిన లేఖపై సీఎం చంద్రబాబు స్పందించాలని వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఆ రాజకీయ కారణలేంటో ప్రజలకు వివరించాలన్నారు. హైదరాబాద్‌లోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నాలుగేళ్లు ఎన్డీయేలో భాగస్వామిగా ఉండి రాష్ట్రాన్ని చంద్రబాబు తాకట్టు పెట్టారని, ఆ సమయంలో ఎప్పుడూ ప్రత్యేక హోదా డిమాండ్ చేయని బాబు ఇప్పుడు డ్రామాలాడుతున్నారని ఆరోపించారు. హోదాపై మొదటి నుంచి చిత్తశుద్ధితో పోరాడుతున్న పార్టీ వైసీపీ ఒక్కటేనని వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. నాలుగేళ్ల తర్వాత ఇప్పుడైనా చంద్రబాబు హోదా కావాలని డిమాండ్ చేయడం సంతోషకరమని అన్నారు. అయితే మళ్లీ అంతలోనే సుజనా చౌదరిని అరుణ్ జైట్లీ వద్దకు పంపి కేంద్రంతో లాలూచీకి దిగడమేంటని ప్రశ్నించారు. చంద్రబాబు చెప్పకుండానే సుజనా కేంద్రమంత్రితో భేటీ అయ్యారా అని నిలదీశారు. ప్రత్యేక హోదాపై కోర్టుకెళతామన్న చంద్రబాబు లీకులిస్తున్నారని.. 'హోదా వద్దన్నది మీరే కదా' అని కోర్టు ప్రశ్నిస్తే ఏం సమాధానం చెబుతారని అడిగారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే నాలుగేళ్ల క్రితమే హోదా డిమాండ్ చేయాల్సిందని చెప్పారు. ఇప్పటికైనా హోదా పోరులో కలిసి రావాలని, ఈ అంశంపై ఎవరు అవిశ్వాస తీర్మానం పెట్టినా సహకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఎంపీ తెలిపారు. కేంద్ర చివరి వరకూ దిగిరాకపోతే పార్లమెంటు సమావేశాలు ముగిసే రోజున తమ పార్టీ ఎంపీలంతా రాజీనామా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో టీడీపీ కూడా కలిసి రావాలని, రాష్ట్రానికి చెందిన ఎంపీలంతా మూకుమ్మడిగా రాజీనామా చేస్తే కేంద్రం దిగి వస్తుందని ఆయన అన్నారు.

బీజేపీ 'హోదా' ఇవ్వదు

- సాధించే స్థితిలో టీడీపీ లేదు
- ఈ రెండు పార్టీలతో అనిశ్చితి
- త్వరలో వామపక్షాలతో భేటీ..
- కార్యాచరణపై నిర్ణయం: పవన్



అమరావతి, మార్చి 24 (అమరావతి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాను బీజేపీ ఎప్పటికీ ఇవ్వదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. హోదా సాధించే స్థితిలో టీడీపీ ఏమాత్రం లేదన్న విషయాన్ని ప్రజలు మరింతగా అర్థం చేసుకున్నారని అన్నారు. బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాయడం, దానికి ప్రతిగా చంద్రబాబు అసెంబ్లీలో అంతే సుదీర్ఘంగా జవాబు ఇవ్వడం వంట అంశాలు దీనికి అద్దం పడుతున్నాయని వ్యాఖ్యానించారు. శనివారం ఆయన ఓ బహిరంగ లేఖ రాశారు. ఏపీకి వేల కోట్ల రూపాయలు ఇచ్చామంటూ అమిత్ షా ఎప్పటిలానే పాత పాట పాడారని.. చంద్రబాబు కూడా బీజేపీ అన్యాయం చేసిందని మరోసారి ఘోషించారని పేర్కొన్నారు. ఈ ముసుగులాట ఎంతకాలమని, విసిగి వేసారిన ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరవధిక ఆందోళనలకు దిగే పరిస్థితులను కల్పించవద్దని పవన్ విజ్ఞప్తి చేశారు. బీజేపీ, టీడీపీల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన అనిశ్చితి పరిస్థితులపై చర్చించేందుకు త్వరలో వామపక్షాలతో చర్చలు జరపనున్నామని ప్రకటించారు. ప్రజల అభీష్టాన్ని నెరవేర్చటానికి ఏవిధంగా ముందుకు వెళ్లాలో ఈ సమావేశంలో నిర్ణయిస్తామని వెల్లడించారు. తదనంతరం జయప్రకాష్ నారాయణ, ఇతర సీనియర్ నాయకులతో చర్చలు జరుపుతామని పవన్ తెలిపారు.

ఫేస్‌బుక్‌లో తేల్చుకుందాం!

- టీడీపీ-బీజేపీ మధ్య సోషల్ వార్
- ఇప్పటికే సోషల్ మీడియాలో టీడీపీ
- తాజాగా బీజేపీ బృందాల రంగప్రవేశం
- టీడీపీకి కౌంటర్ ప్రచారం చేసే వ్యూహం

అమరావతి, మార్చి 24 (మనం ప్రతినిధి): ఇప్పుడు రాజకీయాలు ఆఫ్‌లైన్‌లో కన్నా ఆన్‌లైన్‌లోనే హైలైట్ అవుతున్నాయి. తాజాగా బీజేపీ- టీడీపీ మధ్య వార్.. సోషల్ మీడియాకు పాకింది. ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటి మాధ్యమాలను తమ అభిప్రాయాలు వెల్లడించడానికి అన్ని పార్టీల వాళ్లు విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. రాజకీయ నాయకుల మీద రక రకాల కామెంట్లకు ఫేస్ బుక్ అతిపెద్ద వేదికగా మారిపోయింది. దీన్ని పార్టీ ప్రచార సాధనంగా టీడీపీ ఉపయోగించుకున్నంతగా మరే పార్టీ ఉపయోగించుకోలేదని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తుంటారు. రాష్ట్రంలో జరుగుతున్న టీడీపీ-బీజేపీ వార్ ఇపుడు ఫేస్‌బుక్‌కూ పాకుతోంది. టీడీపీ చేస్తున్న పోస్టులను సమర్థంగా తిప్పికొట్టేందుకు బీజేపీ 150 మంది నిపుణులతో ఫేస్‌బుక్ వార్‌కు రంగంలోకి దిగుతోంది.

120 ఖాతాలు సిద్ధం

దేశవ్యాప్తంగా ఇప్పటికే ఫేస్‌బుక్‌లో టీడీపీపై కౌంటర్‌కు 120 ఖాతాలను బీజేపీ వర్గాలు తెరిచినట్లు విశ్వసనీయ సమాచారం. టీడీపీ నేతలు తమపై చేస్తున్న విమర్శలు, ఆరోపణలను తిప్పికొట్టేందుకు ఆరు బృందాలను సిద్ధం చేయాలని బీజేపీ నేతలు ప్రణాళిక రూపొందించారు. ఢిల్లీ, ముంబై, పుణె, హైదరాబాద్, అమరావతి నుంచి కూడా నిపుణులను ఇప్పటికీ రిక్రూట్ చేసుకున్నట్లు సమాచారం. ఒక్కో బృందంలో 25 మంది చొప్పున ఆరు బృందాల్లో మొత్తం 150 మంది టీడీపీపై నిర్విరామంగా పోరుకు సిద్ధమైనట్లు తెలిసింది. బృందంలో నిష్ణాతులైన టెకీలతో పాటు, పోస్టులను వ్యంగంగా రూపొందించే కార్టూనిస్టులు, రాజకీయ అనుభవం కలిగిన జర్నలిస్టులు, పోస్టులను ఎక్కువ మందికి చేరవేసే యూత్.. ఇలా అందరూ ఉంటారని సమాచారం. వీరందరికీ జాతీయ నేతలతో హైదరాబాద్ ఆదివారం శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిసింది. ఈ వార్‌కు.. సహకారం అందించేందుకు ఇప్పటికే సంఘ్ అభిమానులైన కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కూడా సిద్ధమయ్యారని బీజేపీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ప్రధాని నరేంద్రమోదీ వివిధ అంశాల్లో మాట మార్చిన వైనంపై టీడీపీ ఐటీ విభాగం ఓ ట్వీట్‌ను వైరల్ చేసింది. ఇది నెటిజన్ల వద్దకు విస్తృతంగా చేరింది. ఇన్నాళ్లు తెలుగుకే పరిమితం కాగా.. ఇప్పుడు హిందీ, ఇంగ్లీషులలోనూ బీజేపీని డ్యామేజి చేయడానికి కొత్త రిక్రూట్‌మెంట్లు చేసుకున్నట్లు తెలిసింది. తమ హయాంలో స్కాములేవీ లేవని చెప్పుకొంటున్న బీజేపీ నేతలకు షాక్ ఇస్తూ.. ఏ టూ జడ్ స్కామ్స్ పేరుతో ఓ గ్రాఫిక్ ప్లేట్.. సోషల్ మీడియాలో హైలైట్ చేశారు. ఇన్నాళ్లు బహిరంగ వేదికలపై టీడీపీని దులిపేస్తున్న బీజేపీ నేతలు.. ఆన్‌లైన్‌లోనూ తమ సత్తా చూపించి చంద్రబాబుకు తమ సత్తా చూపించాలన్న లక్ష్యంతో ఉన్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో పరాకాష్ఠకు అవినీతి

తవ్వడానికి బుల్డోజర్లు కావాలి

అసెంబ్లీలో చంద్రబాబు అబద్ధాలు

- పట్టిసీమ ప్రాజెక్టులో భారీ అక్రమాలు
- ఎత్తిపోతల పథకాలంటే ఎత్తివేయటమే
- పనులు చేయకుండా కేంద్రం నిధులు స్వాహా
- ప్రతి టీడీపీ ఎమ్మెల్యే.. ఓ ముఖ్యమంత్రి
- మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతి బయటపెడతాం
- టీడీపీపై విరుచుకుపడిన సోము వీర్రాజు



అమరావతి, మార్చి 24 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో అవినీతి పరాకాష్ఠకు చేరిందని, ఆ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో రోజుకు నాలుగైదు గంటలపాటు అబద్ధాలు వల్లెవేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆరోపించారు. శనివారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెరిగిపోయిన అవినీతిని తవ్వటానికి గునపాలు సరిపోవని, బుల్డోజర్లు కావాలని అన్నారు. ఈ అవినీతి, అక్రమాలకు పట్టిసీమ ప్రాజెక్టు ఒక ఉదాహరణ మాత్రమేనని ఆయన ఆరోపించారు. ఈ ప్రాజెక్టులో భారీ ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. రూ. 1120కోట్లతో మొదలైన పట్టిసీమ పనులు రూ. 1667కోట్లకు ఎందుకు చేరుకున్నాయని ప్రశ్నించారు. మట్టి తీసినందుకు ఒక్కో లారీకి రూ. లక్షలు చెల్లించారని, ఒక కిలోమీటరు దూరంలో మట్టిని తీసి, పడేసేందుకు 1000 రూపాయలు వెచ్చించడం ఆశ్చర్యం కలిగించదన్నారు. కేవలం మట్టి తీయడానికే రూ. 67 కోట్లు వ్యయం చేయటం చాలా దారుణమన్నారు. అలాగే ఈ ప్రాజెక్టుకు 30 పంపుసెట్లు వేయాల్సి ఉండగా.. 24 పంపుసెట్లనే వేశారని, ఒక్కో పంపుసెట్‌కు రూ. 324 కోట్లుగా లెక్కలు చూపించారని వెల్లడించారు. రాష్ట్రంలో ఎత్తిపోతల పథకమంటే ఎత్తివేయటమేనన్నారు. పోలవరం కెనాల్ అండర్ టన్నెల్ నిర్మాణానికి కోట్లాది రూపాయాల నిధులు దుర్వినియోగం చేశారన్నారు. వేలకోట్ల అవినీతికి పాల్పడుతూ.. సోమవారం పోలవరం అంటున్నారని ఆరోపించారు. రాయలసీమలో ప్రాజెక్టుల నిర్మాణంలో మంత్రులు, ఎమ్మెల్యేలు దోచుకుంటున్నారని సోమువీర్రాజు ఆరోపించారు.

టీడీపీ.. తెలుగు డ్రామా పార్టీ

టీడీపీ అంటే తెలుగు డ్రామా పార్టీ అని, రాష్ట్రంలో రకరకాల డ్రామాలు వేస్తూ ప్రజల్ని మభ్యపెడుతున్నారని సోము వీర్రాజు విమర్శించారు. కింది స్థాయి కార్యకర్తల వరకు అవినీతిని తీసుకెళ్లిన పార్టీ దేశంలో ఏదైనా ఉందంటే అది కేవలం టీడీపీనేనని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 27వేల కోట్ల ఎన్ఆర్‌జీఎస్ నిధులు ఇచ్చిందని.. ఏ పనులూ చేపట్టకుండానే ఈ నిధులను దోచుకున్నారని ఆరోపించారు. సీఎం సొంత జిల్లాలో మరుగుదొడ్ల నిర్మాణంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందన్నారు. ఇక్కడ 27 మండలాల్లో మరుగుదొడ్లు నిర్మించకుండా ప్రతి మండలానికి రూ. 6 కోట్ల నిధులను దోచేశారని చెప్పారు. నీరు-చెట్టులోనూ అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని, దీనికి రూ. 4వేల కోట్ల లోపు ఖర్చు అయితే.. రూ. 10వేల కోట్ల మట్టిని, భూమాతను అమ్మేశారని ఆరోపించారు. నరేగా పనులకు పొక్లెయిన్లు, యంత్రాలు ఉపయోగించకూడదని, కాని వాటిని ఉపయోగించి ప్రతిచోటా రూ. నాలుగుకోట్లను దోచేశారని సోము వీర్రాజు ఆరోపించారు. టీడీపీకి చెందిన ప్రతి ఎమ్మెల్యే ఆ నియోజకవర్గానికి ఒక ముఖ్యమంత్రి లాంటివారని.. ముఖ్యమంత్రి కంటే ఎక్కువ అధికారాలు ఉన్న ముఖ్యమంత్రి అని ఆయన విమర్శించారు. వారిని చంద్రబాబు అదుపులో పెట్టలేకపోయారన్నారు. సర్వశిక్షా అభియాన్‌లోనూ విపరీతమైన అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. టీడీపీకి చెందిన వ్యక్తికి చైర్మన్ పదవి ఇచ్చారని, పిల్లలకు పంపిణీ చేసే దుస్తుల్లో నాణ్యత కొరవడిందని సోము వీర్రాజు పేర్కొన్నారు. సర్వశిక్ష అభియాన్‌లో రాష్ట్రానికి రూ. 4వేల కోట్లు వచ్చాయని, అయితే శిక్షణ ఇవ్వకుండానే.. శిక్షణ ఇచ్చినట్లు రూ. 400 కోట్లు ఖర్చు పెట్టారని ఆయన వ్యాఖ్యానించారు. హుద్‌హుద్ తుఫానుకు కేంద్రం రూ. 1000 కోట్లు ఇస్తే.. రూ. 700లకోట్లకే యూసీలు ఇచ్చారన్నారు. సచివాలయంలో తాత్కాలిక భవనాలకు రూ. 900 కోట్లు ఖర్చు పెట్టారని, దానికీ లెక్కపత్రం లేదని, యూసీలు లేవని చెప్పారు. రాష్ట్రంలో ప్రజల సొమ్మును పప్పు, బెల్లాల్లా పంచేశారని, పట్టిసీమ, సర్వశిక్షా అభియాన్, ఎన్ఆర్‌జీఎస్ నిధులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని సోమువీర్రాజు డిమాండ్ చేశారు.

'ఆపరేషన్ ద్రవిడ'పై విచారణ

- డీజీపీకి మాణిక్యాలరావు లేఖ


సినీ నటుడు శివాజీ చెప్పిన సినిమా తరహా స్టోరీ 'ఆపరేషన్ ద్రవిడ'పై తక్షణం విచారణ చేపట్టాలని మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు పైడికొండల మాణిక్యాలరావు డీజీపీ మాలకొండయ్యకు లేఖ రాశారు. 4,800 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి, రాష్ట్రంలో విధ్వంసం సృష్టించి, అధికారంలోకి రావటానికి ఎవరో ప్రయత్నిస్తున్నారని శివాజీ చెబుతున్నారనీ, దీనిపై వాస్తవాలు బయటకు రావాలంటే విచారణ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కుట్ర, హింసకు పాల్పడుతున్న ఆ తెరవెనుక వ్యక్తులెవరో పోలీసులు విచారణ చేసి బయటపెట్టాలని మాణిక్యాలరావు కోరారు.

రాష్ట్రంలో సంపూర్ణ విప్లవం రావాలి

రాష్ట్రంలో అవినీతి పాలనను అంతమొందించేందుకు సంపూర్ణ విప్లవం రావాలని సోము వీర్రాజు అన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఈ అవినీతి కనపడటం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇలాంటి పరిపాలన జరుగుతుంటే వీరు ఎందుకు ప్రశ్నించరన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని.. ఇవ్వాల్సిన నిధులు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో టన్నుల కొద్దీ అవినీతి ఉందని, ఏ మంత్రి, ఏ ఎమ్మెల్యే ఎంత అవినీతి చేశాడో నిరూపిస్తామని సోము వీర్రాజు హెచ్చరించారు.

మీది రహస్య ఎజెండా

- రాజకీయ స్వార్థంతోనే వెళ్లారు
- అబద్ధాలతో సానుభూతికి యత్నం
- మేం ఇచ్చిన నిధులూ వాడుకోలేదు
- పోలవరం ప్రాజెక్టు వ్యయం మాదే
- ఖర్చులకు లెక్క చూపించారా?
- చంద్రబాబుకు అమిత్ షా లేఖాస్త్రం



అమరావతి, మార్చి 24 (మనం ప్రతినిధి): ముఖ్యమంత్రి చంద్రబాబు తాము ఎన్డీయే నుంచి బయటకు వెళ్తున్నట్లు ఢిల్లీకి అలా ఒక లేఖ రాశారో లేదో.. వెంటనే బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా ఘాటుగా స్పందించారు. చంద్రబాబుకు దీటైన సమాధానం ఇస్తూ కౌంటర్ లేఖ పంపారు. రాజకీయ స్వార్థంతోనే, రహస్య ఎజెండాతోనే ఎన్డీయే నుంచి వైదొలిగారని, దీనికి ప్రత్యేక హోదా ముసుగు తగిలించుకున్నారన్నది అమిత్ షా లేఖ సారాంశం. అబద్ధాలు చెప్పి సానుభూతి పొందాలని ప్రయత్నిస్తున్నారని, ఏపీ ప్రజల పట్ల బీజేపీకి చిన్నచూపు ఉందని ప్రజలను భ్రమింపజేయడానికి సీఎం ప్రయత్నించడం దురదృష్టకరమని ఆయన తన లేఖలో వ్యాఖ్యానించారు. కేంద్రం ఇచ్చిన నిధులను వాడుకోవటంలో రాష్ట్రప్రభుత్వం ఘోరంగా విఫలమైందని.. రాజధాని అమరావతి అభివృద్ధి కోసం ఉద్దేశించిన నిధులలో కేవలం ఎనిమిది శాతమే వాడుకున్నారని అమిత్ షా గుర్తు చేశారు. ఇప్పటివరకు రాజధాని కోసం కేంద్ర ప్రభుత్వం 2500 కోట్ల రూపాయలు ఇచ్చిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రతిష్ఠాత్మకమైన జాతీయ ప్రాజెక్టు పోలవరం విషయంలో రాష్ట్రప్రభుత్వం ఘోరమైన తప్పిదాలకు పాల్పడిందని కూడా అమిత్ షా బదులిచ్చారు. 2010-11 అంచనాల ప్రకారం పోలవరానికి రూ. 16,010 కోట్ల ఖర్చవుతుందని, ఈ వ్యయాన్నంతా కేంద్రమే భరిస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రప్రభుత్వం అందులో ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదన్నారు. అయితే, కేంద్రం నుంచి ఆ ప్రాజెక్టు కోసం అందిన నిధులకు సంబంధించిన వ్యయంపై ఇంతవరకు లెక్కలు చెప్పలేదని కూడా లేఖలో ప్రస్తావించారు. అమరావతి నుంచి అనంతపురం వరకు నిర్మించతలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవేకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ సిద్ధంగా ఉందని, అయితే దానికి సంబంధించిన భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదని గుర్తు చేశారు. ఏపీకి గడిచిన నాలుగేళ్లలో ఎనిమిది మౌలిక వసతుల కల్పన (ఇన్ ఫ్రా) ప్రాజెక్టులు కేటాయించామని, వీటిలో అయిదు ప్రాజెక్టులు పని కూడా ప్రారంభించాయని తెలిపారు. కేంద్రీయ విశ్వ విద్యాలయం, గిరిజన విశ్వవిద్యాలయాలకు ఈ బడ్జెట్ లోనే నిధులు కేటాయించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 2022 నాటికి రాష్ట్రంలో 11 జాతీయ విద్యా సంస్థల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఐఐటీ, ఐఐఎం, ఐఐపీఈ, నిట్, ట్రిపుల్ ఐటీ, అగ్రి యూనివర్సిటీ, ఎయిమ్స్ తరహా ఆసుపత్రులు కూడా దీనిలో ఉన్నాయని అమిత్ షా లేఖలో గుర్తు చేశారు.

విభజన చట్టానికి కట్టుబడి ఉన్నాం

విభజన చట్టానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, చట్టంలోని అన్ని అంశాలను ఆచరణయోగ్యం చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదని అమిత్ షా తన లేఖలో తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన నాలుగేళ్లలో ఏపీకి భారీగానే నిధులిచ్చామని షా అన్నారు. విజయవాడ మెట్రో రైలు కోసం రూ.6,769 కోట్లు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్ర ప్రాయంగా అంగీకరించిన విషయాన్ని అమిత్ షా తన లేఖలో గుర్తు చేశారు. విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టు ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని అన్నారు. రూ. 19,700 కోట్ల వ్యయంతో 180 కిలోమీటర్ల మేర రింగ్ రోడ్ నిర్మించేందుకు కూడా కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని అమిత్ షా లేఖలో ప్రస్తావించారు. దుగరాజుపట్నం, కడప స్టీల్ ప్లాంట్ల ఏర్పాటుకు సాంకేతిక నివేదికలు అనుకూలంగా లేవన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి ఎప్పుడో చెప్పామన్నారు. ప్రత్యేక హోదా అంశాన్ని ఏపీలోని కొన్ని పార్టీలు రాజకీయ స్వార్థానికి వాడుకుంటున్నాయని, కేంద్ర ప్రభుత్వం మాత్రం నిజాయితీగా రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉందని అమిత్ షా తన లేఖలో పేర్కొన్నారు.

అన్నీ తప్పులే!

- ఈ లేఖను ప్రజలంతా చదవాలి
- కేంద్రం కుయుక్తులు తెలుసుకోవాలి
- రాష్ట్రాన్ని కించపరుస్తూ రాశారు
- జాతీయ అధ్యక్షుడు రాసే లేఖా ఇది?
- నన్ను దోషిగా చూపించే ప్రయత్నం
- సాయం చేయకపోగా.. ఎదురు దాడా?
- రాజకీయంగా బీజేపీ లబ్ధిపొందడానికే
- వాస్తవాలు చెప్పే ధైర్యం కేంద్రానికి లేదు
- కేంద్రంపై నిప్పులు చెరిగిన చంద్రబాబు


అమరావతి, మార్చి 24 (మనం ప్రతినిధి): బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా రాసిన లేఖ అంతా తప్పుల తడకగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మండిపడ్డారు. శనివారం అమిత్‌షా రాసిన లేఖపై చంద్రబాబు అసెంబ్లీలో ప్రసంగించారు. అమిత్‌షా రాసిన లేఖలో అన్నీ వక్రీకరణలే ఉన్నాయని విమర్శించారు. ఏపీకి ఒక రూల్... ఈశాన్య రాష్ట్రాలకు మరో రూలా అని ప్రశ్నించారు. విభజన చట్టం హామీలు అమలుచేసి ఉంటే ఏపీకి ఎన్నో పెట్టుబడులు వచ్చేవని, తమను అసమర్థులుగా చూస్తున్నారని అన్నారు. తామేమీ కేంద్రాన్ని కొత్తగా అడగడం లేదని, విభజన చట్టంలో ఉన్నవే అడుగుతున్నామని, ఏపీకి రావాల్సిన వాటిని అడిగితే ఎదురుదాడి చేస్తారా అని చంద్రబాబు కేంద్రాన్ని నిలదీశారు.

నన్ను కాదు.. రాష్ట్రాన్ని కించపరిచారు

''అమిత్‌షా రాసిన లేఖ నాకు కాదు. రాష్ట్రాన్ని కించపరుస్తూ రాశారు. కేంద్రానికి ఏపీ ప్రజలు నీచంగా కనిపిస్తున్నారా? విభజన చట్టంలో పెట్టినవే ఇవ్వమన్నాం. ఇవ్వాల్సినవి ఇవ్వకుండా వక్రీకరిస్తూ లేఖలు రాస్తారా?'' అని చంద్రబాబు కేంద్రాన్ని ప్రశ్నించారు. రాష్ట్రానికి మంచి చేయాలని కేంద్రం ఒక్క రోజు కూడా ఆలోచించలేదని, కనీస బాధ్యత లేకుండా, ఇలా రాష్ట్రాలపై ఎదురుదాడి చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతస్థాయిలో ఉన్న వ్యక్తులు అబద్ధాలు చెబుతారా అంటూ నిలదీశారు. ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇచ్చినప్పుడు ఏపీకి ఎందుకివ్వరని మరోసారి కేంద్రాన్ని ప్రశ్నించారు. ఏపీ పట్ల కేంద్రానికి ఎందుకింత వివక్ష..? టీడీపీ నిర్ణయాన్ని తప్పుబట్టడం సరికాదని హెచ్చరించారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగానే ఎన్డీయే నుంచి వైదొలిగామని చంద్రబాబు వివరించారు.


ప్రజలే నాకు హైకమాండ్

''ఇప్పటి వరకు రాష్ట్రానికి మీరు ఇచ్చింది ఏమిటి? ఫైనాన్స్ కమిషన్ ఇచ్చిన అవార్డు కూడా మీ ఖాతాలో వేసుకుంటారా? దాంతో మీకు ఏం సంబంధం? ప్రజాస్వామ్యంలో ఒక పద్ధతి ప్రకారం ముందుకు పోతున్నాం. ఒక్క పైసా ఇచ్చారా మీరు? మీ ఇష్టం వచ్చినట్లు ఏదంటే అది లెటర్‌లో రాసేయడమేనా.. ఇదెక్కడి దౌర్భాగ్యం. మమ్మల్ని బద్నాం చేయటానికి అమిత్‌షా లేఖ రాశారు. ప్రజలను రెచ్చగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారు. ప్రత్యేక హోదా విషయంలో రాజీపడి తెలుగు వారి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టాలా? అప్పుడు నేను మంచి వాడిని అవుతానా? అలాంటి రాజకీయ ప్రయోజనాలు నాకు వద్దు. ఐదు కోట్ల ప్రజానీకమే నాకు హైకమాండ్'' అని చంద్రబాబు పేర్కొన్నారు.



తెలుగువాళ్లే త్యాగాలు చేశారు

''దేశంలో అందరికన్నా ఎక్కువ త్యాగాలు చేయడానికి తెలుగువాళ్లు వెనకాడరు. పార్లమెంట్‌లో ప్రధాని కూడా చెప్పారు. ఎన్టీఆర్ ఆత్మగౌరవం గురించి పెట్టిన పార్టీ తెలుగుదేశం అని. మిత్రపక్షంగా మీరు చేస్తున్నది ఏమిటి? నేను కేంద్రానికి రాసిన లేఖ చూడండి. ఎంత హుందాగా ఉందో? మీరు నాకు రాసిన లేఖ చూడండి.. జాతీయ స్థాయి నాయకులు రాష్ట్రానికి రాసేటప్పుడు హుందాతనం పెరగాలి. ఏదంటే అది రాస్తే... హుందాతనం పెరగదు. మా దగ్గర డబ్బులుంటే మిమ్మల్ని ఎందుకు అడుగుతాం? లేఖరాసి రాజకీయంగా లబ్ధిపొందాలని బీజేపీ చూస్తోంది. బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్‌రాజు కూడా తెలుసుకోవాలి. రాష్ట్ర ప్రజల మనోభావాలను మీరు గౌరవించాలి. స్వార్థ రాజకీయాల కోసం ఢిల్లీలో ఉన్న ప్రభుత్వానికి మీరు మద్దతు ఇచ్చి చరిత్ర హీనులుగా మిగిలిపోతారా.. ఆలోచించుకోండి'' అని చంద్రబాబు పేర్కొన్నారు.





పదను తగ్గుతున్న పోటీ సామర్థ్యం

దేశీయ మొబైల్ పరిశ్రమను కుంగదీస్తున్న ఎల్‌వోయూల నిషేధం



ముంబయి: నీరవ్ మోదీ చేసిన 200 కోట్ల డాలర్ల మోసం వ్యవహారం భారతీయ మొబైల్ తయారీ సంస్థలకు లేనిపోని కష్టాలు తెచ్చిపెట్టింది. లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌వోయూ)లపై రిజర్వ్ బ్యాంక్ పూర్తిగా నిషేధం విధించడంతో తలెత్తిన ఫలితమది. అలా జారీ అయిన భరోసా పత్రాలను అడ్డు పెట్టుకునే నీరవ్ మోదీ భారీ కుంభకోణానికి బరి తెగించారు. భారతీయ బ్యాంకుల దేశీయ శాఖలు జారీ చేసే ఎల్‌వోయూలను కస్టమర్లు ఇదర బ్యాంకులకు చెందిన విదేశీ శాఖల నుంచి వర్తక రుణాన్ని పొందేందుకు వినియోగించుకుంటూ ఉంటారు. ముఖ్యంగా భారతీయ మొబైల్ ఫోన్ బ్రాండ్లు చైనాలోని సరఫరాదార్ల నుంచి విడి భాగాలను దిగుమతి చేసుకునేందుకు వాటిని విస్తృతంగా ఉపయోగించుకుంటూ వచ్చాయి.

పెరుగుతున్న నిధుల వ్యయం

ఈ నిషేధం వల్ల ఈ కంపెనీలు తమ నిధుల అవసరాలకు 4-5 రెట్లు ఎక్కువ మొత్తాన్ని చెల్లించవలసి వస్తోంది. ''ఎల్‌వోయూ కింద ఫైనాన్స్ వ్యయం తక్కువ. లండన్ ఇంటర్ బ్యాంక్ ఆఫర్డ్ రేట్ (లైబోర్) ప్లస్ 50 నుంచి 100 బేసిస్ పాయింట్లుగా ఉంటుంది. వాటి జారీని నిషేధించడం వల్ల నిధుల వ్యయం పెరిగిపోతుంది'' అని ఇండియన్ సెల్యులార్ అసోసియేషన్ అధ్యక్షుడు పంకజ్ మొహీంద్రూ చెప్పారు. మైక్రోమ్యాక్స్, ఇంటెక్స్ వంటి దేశీయ ఫోన్ బ్రాండ్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న మొబైల్ పరిశ్రమ సంఘం అది. ఫైనాన్స్ వ్యయం ఎక్కువ కావడం వల్ల జియోమి, వీవో, ఒప్పో వంటి చైనా సహచర బ్రాండ్లతో పోలిస్తే భారతీయ బ్రాండ్లు అననుకూల స్థితిలో పడుతున్నాయి. ''చైనా ఇప్పటికీ దాని కంపెనీలకు మద్దతు ఇస్తూనే ఉంది. చైనా కంపెనీల ఎల్‌వోయూల వినియోగం ఏమంత హెచ్చుగా ఉండదు. దాంతో పోటీలో వాటిది పైచేయి అవుతోంది. మన పోటీ సామర్థ్యం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఈలోగా మనం దెబ్బ తింటూ అచ్చే దిన్ కోసం ఇప్పటికీ ఎదురు చూస్తున్నాం'' అని లావా ఇంటర్నేషనల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎన్. రాయ్ అన్నారు. ''ఎల్‌వోయూపై నిషేధం మా కొనుగోళ్ళను కష్టతరం చేస్తోంది. మా నగదు ప్రవాహంపై ప్రభావం చూపుతోంది.'' అని ఆయన అన్నారు.






మొబైల్ ఫోన్ పరిశ్రమ స్వరూప స్వభావాలే తీవ్ర పోటీతో కూడుకుని ఉన్నాయి. ''హైపర్ పోటీ ప్రతివారిపైన ప్రభావం చూపుతోంది. కానీ, ఈ రంగంలోని అంతర్జాతీయ సంస్థలు వాటికున్న ఫైనాన్షియల్ సామర్థ్యాల దృష్ట్యా ఎలాగో నెట్టుకు రాగలుగుతున్నాయి. వాటికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫైనాన్షియల్ వనరులు అందుబాటులో ఉన్నాయి'' అని మొహీంద్రూ తెలిపారు. మొబైల్ హ్యాండ్‌సెట్, కంపొనెంట్ కంపెనీలు ఎల్‌వోయూ సదుపాయాన్ని ఉపయోగించుకుని ఇంతవరకు ఒక నెల నుంచి ఆరు నెలల వరకు రుణాన్ని అనుభవించగలిగాయి. ఎల్‌వోయూలతో పరిశ్రమ 2 శాతం లైబోర్ రేటుపై నిధులు పొందుతూ వచ్చింది. అది 50 నుంచి 100 బేసిస్ పాయింట్ల మధ్య ఉండేది. సూటిగా చెప్పాలంటే, 2.50 శాతం నుంచి 3 శాతం మధ్యలో రేటుకు ఫైనాన్స్ అందుబాటులో ఉండేది. ఇప్పుడు చాలా భాగం దేశీయ కంపెనీలు వాటి రుణ పరిమితులను ఉపయోగించుకోవాల్సి వస్తోంది. అవి 10 నుంచి 12 శాతం రేటులో లభిస్తాయి. ''ఆర్.బి.ఐ తీసుకున్న హఠాత్ నిర్ణయం వర్తకానికి తీవ్ర విఘాతం కలిగిస్తోంది. బ్యాంకులు వర్తక ఫైనాన్స్ ప్రక్రియను కట్టుదిట్టం చేసి బ్యాంకు గ్యారంటీలు, లెటర్స్ ఆఫ్ క్రెడిట్‌కి మరిన్ని అనుషంగిక హామీలు, ఇతర డాక్యుమెంట్ల కోసం పట్టుబడుతున్నాయి. దిగుమతిదార్లకు అందుబాటులో ఉన్న ఫైనాన్స్ మార్గాలు ఆ రెండే'' అని పరిశ్రమకు చెందిన నిపుణుడు ఒకరు చెప్పారు.

ఉద్యోగాలకూ ఎసరు

ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రోత్సహించడంతో, దేశంలో గత 30 నెలల్లో 120కి పైగా మొబైల్ తయారీ ప్లాంట్లు ఏర్పడి 4.5 లక్షలకు పైగా ఉద్యోగాలను సృష్టించాయి. ఎగుమతుల ద్వారా సాధించే వృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి, 2019-20 నాటికి 50 కోట్ల యూనిట్లు ఉత్పత్తి చేయాలని, 56 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలని పరిశ్రమ భావిస్తోంది. నూతన ఆంక్షలు ఈ ప్రణాళికలను ప్రమాదంలో పడేశాయి. లెటర్ ఆఫ్ క్రెడిట్ చెల్లింపును ఆమోదించేందుకు, వాటిని ఆమోదిస్తూ స్వల్పకాలిక



రుణాలు మంజూరు చేసేందుకు, బయర్స్ క్రెడిట్ పేమెంట్‌కు నాన్-ఫండ్ ఆధారిత పరిమితిని ఫండ్-ఆధారిత పరిమితిగా మార్చుకునేటట్లుగా బ్యాంకులు వెంటనే 'ఇంటర్‌చేంజబిలిటీ'ని మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియన్ సెల్యులార్ అసోసియేషన్ ఆర్థిక మంత్రిత్వ శాఖకు వినతి పత్రం సమర్పించనుంది. ఫైనాన్సింగ్ వ్యయం అధికంగా ఉంటే, హ్యాండ్‌సెట్ల ధరలు పెరుగుతాయి. కానీ, ప్రస్తుతానికి మార్కెట్‌లో పోటీ ఇవ్వగలిగిన స్థితిలో నిలిచేందుకు, ఆ భారాన్ని కొనుగోలుదార్లకు బదలీ చేయకూడదని పరిశ్రమ నిర్ణయించుకుంది.



ఏప్రిల్ 1 నుంచి ఈ-వే బిల్లు



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ వే లేదా ఈ-వే బిల్లు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. రూ. 50,000లకు పైగా విలువైన వస్తువులను రాష్ట్రాల మధ్య రవాణా చేయడానికి ఈ బిల్లు అవసరమవుతుంది. అలాగే, జి.ఎస్.టి.ఆర్-3బి సారాంశ రిటర్నును దాఖలు చేయడం జూన్ వరకు కొనసాగించవచ్చని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సి.బి.ఇ.సి) నోటిఫై చేసింది. ఒక నెలకి చెందిన జి.ఎస్.టి.ఆర్-3బి ఆ తదుపరి నెలలో 20వ తేదీకల్లా దాఖలు చేయవలసి ఉంటుంది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలో, రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సభ్యులుగా ఉన్న జి.ఎస్.టి. కౌన్సిల్ మార్చి 10న జరిపిన సమావేశంలో ఈ-వే బిల్లును అమలులోకి తేవాలని, 3బి దాఖలు సదుపాయాన్ని కొనసాగించాలని నిర్ణయించింది. ఈ-వే బిల్లును ఫిబ్రవరి 1న మొదటిసారి ప్రవేశపెట్టినప్పుడు విఫలమైనట్లుగానే సిస్టం విఫలం కావచ్చనే భయంతో, రాష్ట్రాల మధ్య సరుకుల రవాణాకు పర్మిట్‌ను దగ్గరుంచుకోవాలనే నిబంధనను దశలవారీగా అమలు జరపాలని కౌన్సిల్ నిర్ణయించింది. ఇంటర్-స్టేట్-ఈ-వే బిల్లును ఏప్రిల్ 1 నుంచి అమలు జరుపుతారు. ఇంట్రా-స్టేట్ సరుకుల రవాణా పద్ధతిని ఏప్రిల్ 15 నుంచి దశల వారీగా అమలులోకి తేనున్నారు. జి.ఎస్.టి. ఇన్‌స్పెక్టర్ అడిగితే ఈ-వే బిల్లు సమర్పించవలసి ఉంటుంది. పన్నుల ఎగవేత నిరోధక చర్యగా దీనిని అభివర్ణిస్తున్నారు. ప్రస్తుతం నగదు ప్రాతిపదికపై సాగుతునన వర్తకంపై విరుచుకుపడి, పన్ను వసూళ్ళు పెంపొందించేందుకు అది సహాయపడుతుందని భావిస్తున్నారు. ఏప్రిల్ 1 నుంచి ఈ-వే బిల్లు అమలులోకి వస్తుంది కనుక, రూ. 50,000లకు పైగా విలువ చేసే వస్తువుల ట్రాన్స్‌పోర్టర్లు ఈ-వే బిల్లును సమకూర్చుకోవలసి ఉంటుంది.

ఇక జి.ఎస్.టి.ఆర్-3బి రిటర్నుల విషయానికి వస్తే, దాన్ని సులభతరం చేసే మార్గాల గురించి కౌన్సిల్ చర్చించింది. దీనిపై రాష్ట్రాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయి. ప్రస్తుత దాఖలు వ్యవస్థను మరో మూడు నెలలపాటు పొడిగించాలని నిర్ణయించారు. వ్యాపార సంస్థలు అమ్మకాల సారాంశ రిటర్నులు జి.ఎస్.టి.ఆర్-3బిని, తుది అమ్మకాల రిటర్ను జి.ఎస్.టి.ఆర్-1ని జూన్ వరకు దాఖలు చేయవలసి ఉంటుంది.

నీరవ్ నివాసంలో మరో రూ. 26 కోట్ల సొత్తు స్వాధీనం



ముంబయి/న్యూఢిల్లీ: ఘరానా మోసగాడు నీరవ్ మోదీకి చెందిన ముంబయి అపార్ట్‌మెంట్ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి) తాజాగా ప్రాచీన నగలు, ఖరీదైన వాచీలు, అమృతా షెర్‌గిల్, ఎం.ఎఫ్. హుసేన్‌ల పెయింటింగులను స్వాధీనం చేసుకుంది. వాటి విలువ రూ. 26 కోట్ల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు నీరవ్ మోదీ రూ. 12,000 కోట్ల మేరకు కుచ్చు టోపీ పెట్టిన సంగతి తెలిసిందే. ముంబయిలోని వొర్లి ప్రాంతంలో, నీరవ్‌కు చెందిన సముద్ర మహల్ లగ్జరీ రెసిడెన్షియల్ ఫ్లాట్స్‌లో ఇ.డి. అధికారులు, కేంద్ర నేర పరిశోధక సంస్థ (సి.బి.ఐ) సిబ్బంది మార్చి 22న తాజాగా సోదాలు ప్రారంభించారు. ఫలితంగా, ఆ సాగర అభిముఖ నివాసం నుంచి వారు విలువైన వస్తువులను తాజాగా స్వాధీనం చేసుకోగలిగారు. ప్రాచీన ఆభరణాలు రూ. 15 కోట్లు, వాచీలు రూ. 1.4 కోట్లు, ప్రఖ్యాత చిత్రకారులు అమృతా షెర్ గిల్, ఎం.ఎఫ్. హుసేన్, కె.కె. హెబ్బార్‌ల పెయింటింగులు రూ. 10 కోట్లు విలువ చేస్తాయని లెక్కగట్టారు. వీటిని గత మూడు రోజులుగా జరిపిన సోదాలలో స్వాధీనం చేసుకున్నారు. గుప్తధన చెలామణీ నిరోధక చట్టం (పి.ఎం.ఎల్.ఎ) కింద వాటిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నగలలలోని ఒక వజ్రపుటుంగరం ఒక్కటే రూ. 10 కోట్లు విలువ చేస్తుందని వారు తెలిపారు. నీరవ్ మోదీ, ఆయన సమీప బంధువు, గీతాంజలి జెమ్స్ ప్రమోటర్ అయిన మెహుల్ చోక్సీలపై గుప్త ధన చెలామణీ నివారణకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ రెండు ఎఫ్.ఐ.ఆర్‌లు దాఖలు చేసింది. పి.ఎన్.బి.లో చోటుచేసుకున్న రూ. 1200 కోట్లకు పైగా మోసం కేసులో దర్యాప్తులో భాగంగా వాటిని దాఖలు చేసింది. ఆ ఇద్దరూ ఈ ఏడాది ప్రారంభంలో దేశం విడిచి పారిపోయారు. సమన్లు జారీ చేసినా వారు ఏజన్సీ ఎదుట హాజరు కాలేదు. దాంతో వారి గ్లోబల్ అరెస్టు వారంటుకు ఇంటర్‌పోల్‌కి నోటిఫై చేసింది. ఇ.డి. అభ్యర్థన మేరకు ముంబయి ప్రత్యేక కోర్టు ఒకటి వారికి నాన్-బెయిలబుల్ వారంట్లు జారీ చేసింది. నిందితులకు వ్యతిరేకంగా ఫిబ్రవరిలో దర్యాప్తు ప్రారంభించిన తర్వాత, అది దేశవ్యాప్తంగా మొత్తం 251 సోదాలు నిర్వహించింది. ఈ కేసులో స్వాధీనం చేసుకున్న మొత్తం వజ్రాలు, బంగారం, విలువైన, పాక్షిక-విలువైన రత్నాలు, ఇతర స్థిర, చరాస్తులు అన్నీ కలసి రూ. 7,664 కోట్ల విలువ చేస్తాయి.

పేట్కర్ నియామకం ఖరారు


న్యూఢిల్లీ: ఛీఫ్ టెక్నాలజీ అధికారిగా, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా రాజేంద్ర పేట్కర్‌ను నియమించినట్లు టాటా మోటార్స్ నేడు వెల్లడించింది. ఆయన 2018 ఏప్రిల్ 1 నుంచి బాధ్యతలు చేపడతారని టాటా మోటార్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇంతకుముందు ఆ పదవిలో టిమ్ లివెర్టన్ ఉన్నారు. ఆయన కంపెనీ నుంచి వైదొలగాలని గత ఏడాది నిర్ణయించుకున్న తర్వాత 2017 నవంబరు నుంచి పేట్కర్ ఆ బాధ్యతలను తాత్కాలికంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రెసిడెంట్, ఛీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా ఉన్న లివెర్టన్ గత ఏడాది సెప్టెంబర్‌లో తన పదవికి రాజీనామా చేశారు.



ఉత్తమ్ గాల్వా ప్రమోటర్‌గా ఆర్సిలార్ డీక్లాసిఫై

- ఎస్సార్ స్టీల్ రీబిడ్డింగ్‌కు అర్హత పొందుతున్న ఆర్సిలార్‌మిత్తల్

ముంబయి: కంపెనీ ప్రమోటర్‌గా ఆర్సిలార్‌మిత్తల్ నెదర్లాండ్స్ బి.వి.ని డీక్లాసిఫై చేసేందుకు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి, బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి అనుమతులు లభించినట్లు ఉత్తమ్ గాల్వా స్టీల్స్ లిమిటెడ్ శనివారంనాడు వెల్లడించింది. ఉత్తమ్ గాల్వాలో ప్రమోటర్‌గా ఉన్న కారణంగానే ఎస్సార్ స్టీల్‌కి బిడ్ చేసే విషయంలో ఆర్సిలార్‌మిత్తల్ అనర్హతకు గురైంది. ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టీ కోడ్ లోని సెక్షన్ 29 ఎ కింద రిజల్యూషన్ ప్రొఫెషనల్ దాని బిడ్‌ను తిరస్కరించారు. నిరర్థక ఆస్తిగా ముద్ర పడిన ఉత్తమ్ గాల్వాలో ఆర్సిలార్ మిత్తల్‌కు వాటా ఉంది. ఉత్తమ్ గాల్వా ఎన్.పి.ఎ.గా పరిణమించిన అంశాన్ని బ్యాంకులు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ దృష్టికి తీసుకెళ్ళాయి. మొత్తానికి, ఎస్సార్ స్టీల్ స్వాధీనానికి రీబిడ్ చేయడానికి ఆర్సిలార్‌మిత్తల్‌కు ఇప్పుడు అర్హత లభించింది. భారతీయ సెక్యూరిటీలు, ఎక్స్ఛేంజి బోర్డు (సెబి) (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) నిబంధనలు 2015 ప్రకారం 31 ఎ నిబంధన కింద అనుమతులు అందుకున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజికి పంపిన నోటిఫికేషన్‌లో ఉత్తమ్ గాల్వా తెలిపింది. ఉత్తమ్ గాల్వా స్టీల్‌లో ఉన్న మొత్తం షేర్‌హోల్డింగ్ (4,13,27,931 ఈక్విటీ షేర్లు)ను ఆర్సిలార్ మిత్తల్ నెదర్లాండ్స్ బి.వి. గత నెలలో ఇంటర్-సే-ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో సాయినాథ్ ట్రేడింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్‌కు బదలీ చేసింది. ఉత్తమ్ గాల్వా స్టీల్ ఈ లావాదేవీ గురించి ఫిబ్రవరి 7న ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. ఒక వ్యక్తి విముక్తి పొందని ఇన్‌సాల్వెంట్ అయితే, ఆ వ్యక్తి విడిగాగానీ, మరో వ్యక్తితో కలసి సమష్టిగాగానీ పరిష్కార ప్రణాళిక సమర్పించే అర్హత ఉండదని ఐ.బి.సి.లోని సెక్షన్ 29 ఎ నిర్దేశిస్తోంది. 1949 నాటి బ్యాంకింగ్ నియంత్రణ చట్టం కింద భారతీయ రిజర్వ్ బ్యాంక్ జారీ చేసిన మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా తేలిగా అతను కూడా విడిగాగానీ, వేరే వాళ్ళతో కలసిగానీ స్ట్రెస్డ్ ఎసెట్ల కొనుగోలుకు బిడ్ చేయడాని కి ఉండదు. ఆర్సిలార్ మిత్తల్ నెదర్లాండ్స్ బి.వి. ప్రపంచంలో ఉక్కు ఉత్పత్తిలో అగ్రగామి సంస్థ. అది 18 దేశాలలో పరిశ్రమలు కలిగి, 60 దేశాలలో కార్యకలాపాలు సాగిస్తోంది.



చమురు అన్వేషణకు ఉవ్విళ్ళూరుతున్న సంస్థలు




హైదరాబాద్: ఓపెన్ యాకరేజ్ లైసెన్సింగ్ విధానం (ఓఎఎల్‌పీ) కింద 55 చమురు, సహజ వాయు బ్లాకుల అంతర్జాతీయ పోటీదాయక బిడ్లకు స్పందన అద్భుతంగా ఉందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ అటను చక్రబర్తి చెప్పారు. ''ఇంతవరకు బిడ్లలో ఎవరెవరు పాల్గొన్నారో, వారిలో ఎంత మంది బిడ్లు నెగ్గుతాయో మాకు కూడా ప్రత్యక్షంగా ఏమీ తెలియదు. నోయిడలోని నేషనల్ డాటా భాండాగార డాటాబేస్‌ని మాత్రం 120కి పైగా కంపెనీలు యాక్సెస్ చేశాయి'' అని ఆయన తెలిపారు. ఓఎఎల్‌పీ కింద బిడ్లకు వెసులుబాటు కల్పించేందుకు పెట్రోలియం, సహజ వాయు మంత్రిత్వ శాఖ ఇక్కడ ఏర్పాటు చేసిన ఒక సమావేశం సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో విడిగా మాట్లాడారు. ''55 బ్లాకుల పరిమాణం, ప్రాముఖ్యం ఏమిటో ఎవరికి వారే తెలుసుకోవచ్చు. ప్రస్తుతం సుమారు 1.02 లక్షల చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో అన్వేషణ సాగుతోంది. ఇప్పుడు మేం దాదాపు 60,000 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని ఆఫరు చేస్తున్నాం. చమురు, ఇంధన వాయు అన్వేషణ సాగే ప్రాంతం సుమారు 60 శాతం పెరుగుతున్న వాస్తవాన్ని బట్టి ఎవరైనా గ్రహించవచ్చు'' అని చక్రబర్తి అన్నారు.

హైడ్రోకార్బన్ అన్వేషణ, లైసెన్సింగ్ విధానం (హెచ్.ఇ.ఎల్.పి) కింద ఆఫరు చేసిన ఓఎఎల్‌పీ బిడ్ రౌండ్ వన్ జనవరిలో ప్రారంభమైంది. 11 రాష్ట్రాలలో సుమారు 59,282 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో విస్తరించిన చమురు లభ్యమయ్యేందుకు అవకాశమున్న ప్రాంతాల్లో ఎంపిక చేసిన 55 బ్లాకులను ఆఫరు చేశారు. వాటిలో ఐదు కృష్ణా-గోదావరి బేసిన్‌లో ఉన్నాయి. వాటిలో 9.5 ఎంఎంటోల మేరకు వనరులున్నాయని చెబుతున్నారు. పది లక్షల టన్నుల చమురుకు సమానమైనదానిని ఎంఎంటో అంటారు. హైడ్రోకార్బన్ అన్వేషణ, లైసెన్సింగ్ విధానం ఆమోదం పొందిందనడానికి ఓఎఎల్‌పీ బిడ్ రౌండ్ వన్‌కి సంబంధించి అందిన ఆసక్తి వ్యక్తీకరణ దశ లేఖలే ప్రబల నిదర్శనమని చక్రబర్తి అన్నారు.

ఈ విధానం కింద ప్రభుత్వం రాబడిని పంచుకునే పద్ధతిని ఆఫరు చేయదలచుకుంది. ధరలు, మార్కెటింగ్‌కు సంబంధించి డెవలపర్లకు పూర్తి స్వేచ్ఛ నిస్తోంది. బ్లాకులను రూపొందించుకునే స్వేచ్ఛను కూడా కల్పిస్తోంది. అన్ని రూపాలలో ఉన్న హైడ్రోకార్బన్లకు ఇది ఒకటే లైసెన్సు అవుతుంది. ఇంతవరకు సాధించిన ప్రగతి గురించి కూడా ఆయన ప్రస్తావించారు. ''డి.ఎస్.ఎఫ్-1 రౌండ్ బిడ్డర్లు 2020-21 నాటికి మొదటిసారి చమురును వెలికి తీయవచ్చు. క్షేత్రస్థాయిలో సాగుతున్న కృషిని, ఈ రంగంలో ఉన్న సామర్థ్యాన్ని పరిశీలనలోకి కనుక తీసుకుంటే, డి.ఎస్.ఎఫ్-2 పట్ల మరింత ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని మనం చూడగల అవకాశం ఉంది. త్వరలో 60 బ్లాకులు ఆఫరు చేయనున్నాం'' అని చక్రబర్తి చెప్పారు. డి.ఎస్.ఎఫ్-1లో ఆఫరు చేసిన బ్లాకులు వాటి జీవిత కాలంలో రూ. 46,440 కోట్లు గడించగల అవకాశం ఉందని ఆయన చెప్పారు. దానిలో ప్రభుత్వానికి పన్నుల ద్వారా వచ్చే రూ. 9,300 కోట్లు, రాయల్టీ ద్వారా లభించే మరో రూ. 5,000 కోట్లు కూడా ఇమిడి ఉన్నాయి.

చిన్న, మధ్యతరహా సంస్థలకూ అవకాశం

డి.ఎస్.ఎఫ్ మొదటి రౌండ్‌లో చిన్న, మధ్యతరహా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి కూడా గణనీయమైన ఆసక్తి వ్యక్తమైంది. చమురు ఉండవచ్చని ఇంతకుముందు కనుగొన్నవాటిలో 31 క్షేత్రాల కాంట్రాక్టులను ఇచ్చారు. ఈ రంగంలో వేళ్ళూనుకున్న కొన్ని సంస్థలు సృష్టించిన మౌలిక వసతులను ఉపయోగించుకోగల సానుకూల అవకాశం ఈ కాంట్రాక్టర్లకు లభించింది. ఫలితంగా 23 కాంట్రాక్టర్ల నుంచి 13 కొత్త కంపెనీలు అవతరించాయి. నిజానికి, డి.ఎస్.ఎఫ్-1 క్షేత్రాల్లో గణనీయమైన ప్రగతి కనిపిస్తోంది. కాంట్రాక్టర్లలో ఉత్సాహం ఎంతగా ఉరకలు వేస్తోందంటే, ఆ క్షేత్రాల నుంచి మొదటగా చమురు 2020 కన్నా ముందే ఉబికి రావచ్చునని ఆయన చెప్పారు. డి.ఎస్.ఎఫ్-2లో పాల్గొనేందుకు పెద్ద సంస్థలపై నిషేధం ఏమీ లేదు. ఈ 60 బ్లాకుల్లో 1.4 బిలియన్ పీపాల చమురు, చమురుతో సమానమైన పదార్థాలు ఉండవచ్చని అంచనా. వాటిలో సగం బ్లాకులు ప్రభుత్వ యాజమాన్యంలోని చమురు, సహజ వాయు సంస్థకు, ఆయిల్ ఇండియా లిమిటెడ్‌కు చెందుతాయి. ''ఇండియాలో 110-120 మిలియన్ టన్నుల చమురుకు డి మాండ్ ఉండగా, ప్రస్తుతం సుమారు 37 మిలియన్ టన్నుల ముడి చమురు ఉత్పత్తి అవుతోంది. 2022 నాటికి చమురు దిగుమతి బి ల్లును కనీసం 10 శాతం తగ్గించాలన్నది మన లక్ష్యం. చమురుకు డిమాండ్ ఏటా 4-4.5 శాతం చొప్పున పెరుగుతోంది'' అని చమ్ముదురు అన్వేషణ విభాగ కేంద్ర సంయుక్త కార్యదర్శి డి.ఎన్. మిశ్రా చెప్పారు.



మనం బాల
ఆదివారం, 25 మార్చి 2018
www.manamnews.com



మీ పిల్లలు ఏదైనా తినడానికి లేదా తాగడానికి చాలా మారాం చేస్తున్నారా? సరే, దానికి కారణాలు చాలా ఉంటాయి. అయితే, మీ పాప/బాబుకు ప్రతి దానికి అప్పటికప్పుడు విసుగు రావడం కుడా కడుపునొప్పి రావడానికి అత్యంత సాధారణ కారణాలలో ఒకటి. కడుపు నొప్పి అనేది పిల్లల్లో సాధారణ విషయం. ప్రత్యేకంగా 4 నుంచి 8 సంవత్సరాల లోపు పిల్లలలో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ కడుపునొప్పికి కలుషిత ఆహారం, మలబద్ధకం, కడుపులో ఇన్ఫెక్షన్ వంటి అనేక కారణాలు కావచ్చు. పిల్లల్లో ఏ కారణం చేత కడుపునొప్పి వచ్చినా, మీరు ముందు ఇంట్లో అందుబాటులో ఉండే సహజమైన వస్తువులతో వాటిని పరిష్కరించండి.

పిల్లల్లో కడుపునొప్పి





మీ పిల్లలు ఎటువంటి సందేహం లేకుండా వాటిని తీసుకునేందుకు మీరు ప్రయత్నం చేయండి. మీరు మీ ఇంట్లోని వస్తువులతో మీ పిల్లల కడుపు నొప్పిని వెంటనే ఎలా తగ్గించవచ్చో తెలుసుకోండి. అల్లం అల్లంలో ''జింజేరోల్'' అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది నష్టం కలిగించే ఫ్రీ రాడికల్స్ పెరుగుదలను తగ్గించడానికి సహాయపడుతుంది. అల్లం అసౌకర్యాన్ని, వికారాన్ని కూడా తగ్గిస్తుంది. అంతేకాకుండా, అల్లంలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు జీర్ణరసాన్ని మెరుగుపరిచి, కడుపు ఆమ్లాలను ఎదుర్కొంటాయి. మీ బాబు/పాప కడుపు నొప్పితో బాధపడుతుంటే మీరు ఇంట్లో అల్లం టీ తయారుచేసి ఇవ్వండి, మీ పాప/బాబు ఎంత ఉపశమనం పొందుతారో చూడండి.

పొట్టమీద వేడి ప్యాడ్

వేడిని అప్లై చేయండి మీ బాబు/పాపను మంచం మీద పడుకున్నపుడు లేదా కూర్చున్నపుడు పొట్టమీద వేడి ప్యాడ్ లేదా వేడి నీటి సంచిని పెట్టండి, ఇది కొంతమేరకు నొప్పిని తగ్గిస్తుంది. మీరు వేడిని అప్లై చేసినపుడు, చర్మం ఉపరితలంలో రక్తప్రవాహం పెరుగుతుంది, ఇది పొట్టలో మొదలైన బాధను తగ్గిస్తుంది. తేలికైన ఆహారం పెట్టండి కడుపులో నొప్పి ఉన్నప్పుడు కూడా మీ బాబు/పాప ఆకలిగా ఉంది అంటే, పెరుగు, టోస్ట్, అన్నం ఓట్మీల్ వంటి తేలికైన పదార్థాలను కొద్ది మోతాదులో తినిపించండి. నూనె, స్పైసీ పదార్థాలు పెట్టొద్దు ఇవి జీర్ణశక్తికి మరింత ఇబ్బందిని కలిగిస్తాయి. తేలికైన ఆహారం వల్ల వాంతులు రావుబీ అవి మీ పొట్టలో ఉన్న ఇబ్బందిని తగ్గించి, తేలికగా అరిగేట్టు చేస్తాయి. అంతేకాకుండా, ఇది మీ పిల్లవాడి జీర్ణవాహిక ప్రేగు మార్గాన్ని తేలిక పరిచి త్వరగా సాధారణ స్థితి వచ్చేట్టు చేస్తుంది.

బైట ఆడుకోవడం...

శారీరక కార్యకలాపాలు తప్పక ఉండాలి. మీ బాబు/పాప మంచం మీద పడుకుని ఉంటే బైటికి వెళ్లి ఆడుకోమని ప్రోత్సహించండి. ఇది బాబు/పాప కడుపు నొప్పిని తగ్గించడానికి సహాయపడుతుంది. శారీరక కార్యకలాపాలు జీర్ణకోశ ప్రేగు కదలికలలో బాగా సహాయపడుతుంది. ఎప్పుడూ మంచంపై పడుకుని ఉంటే అది మలబద్ధకానికి దారితీస్తుంది. బైట ఆడుకోవడం, పరిగెట్టడం, నడవడం మొదలైనవి సహాయపడతాయి. మీరు మీ పిల్లలను కార్ట్ వీల్స్, మంకీ బార్లు, ట్విర్లింగ్ వంటి కడుపును కదిలించే కార్యకలాపాలలో పాల్గొనడానికి ప్రోత్సహించాలి. చమోమిల్ టీ చేమోమిల్ టీ బాధను, శోధ నిరోధక లక్షణాలను కలిగి ఉండడం వల్ల, ఉదరంలోని అసౌకర్యానికి ఉపశమనాన్ని కలిగించడానికి సహాయపడుతుంది. ఒక కప్పు చేమోమిల్ టీ తయారుచేసి ఉంచి, మీ బాబు/పాప కొద్ది కొద్దిగా ఈ టీ ని తీసుకుంటే కడుపు నొప్పి నుండి ఉపశమనం పొందవచ్చు. చమోమిల్ టీ జీర్ణ వ్యవస్థలోని కండరాలను తెలికపరచి, మీ పొత్తలోకి ఆహారాన్ని నెట్టే మార్గంలో కుడుపులను కూడా తగ్గిస్తుంది, అలాగే చిన్న ప్రేగును కూడా తేలిక పరుస్తుంది. ఈ విధంగా కుదుపులను, కండరాలు పట్టి ఉండడాన్ని తగ్గిస్తుంది.







రోజు ఒక కప్పు పెరుగు

పెరుగు అరుగుదలకు మంచి ఉపశమనాలలో ఒకటిగా పరిగణించబడుతుంది. ప్రతిరోజూ మీ పిల్లలకు ఒక కప్పు పెరుగు తినడం అలవాటు చేయండి. పెరుగులో మంచి బాక్టీరియా ఉండడం వల్ల మీ జీర్ణాశయానికి మంచి అరుగుదలను ఇస్తుంది. ప్రతిరోజూ మీ బాబు/పాప ఒక కప్పు పెరుగు తినడం అలవాటు చేసుకుంటే మీ పిల్లలు సాధారణ స్థితిలో ఉంటారు. పుదీనా టీ పుదీనా ఆకులతో చేసిన తాజా టీ మీ పిల్లల కడుపు నొప్పిని తగ్గిస్తుంది. పుదీనాలో మీ కడుపు లోని కండరాలను మృదువుగా చేసే లక్షణాలు ఉన్నాయని అధ్యయనాలు చెప్తున్నాయి. పుదీనా మీ శరీరంలో ఆహారం జీర్ణం కావడానికి ఉపయోగపడే పిత్త ప్రభావాన్ని విస్తరింప చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.

ఇంటి ఫుడ్స్

ప్రత్యేకంగా పిల్లలు, యుక్తవయసు వారికి ఇంట్లో వండిన భోజనం, బైట దొరికే బేబీ ఫుడ్స్ కంటే ఎల్లపుడూ ఆరోగ్యకరం కావు అని కొత్త పరిశోధనలు సూచించాయి. మనం తరచూ ఆరోగ్యంగా భావించే, ఇంట్లో తయారుచేసిన ఆహారంలో శక్తి సాంద్రత, ఆహారంలో కొవ్వు అదనంగా ఉంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇంట్లో తయారుచేసిన ఆహార పదార్థాలలో బైట దొరికే పదార్థాల కంటే సాచురేటేడ్ కొవ్వు తోపాటు 26 శతం కంటే ఎక్కువ శక్తి, 44 శాతం కంటే ఎక్కువ ప్రోటీను, మొత్తం కొవ్వు కూడా కలిసి ఉంటుంది. ''శక్తి సాంద్రత, కొవ్వును తగ్గించడానికి తోడ్పడుతుందని పెద్దవాళ్ళు చెప్పినట్లు కాకుండా, శక్తికి, పెరుగుదలకు సరైన ఆహారాన్ని ఎంచుకోవడం అనేది పిల్లల్లో చాలా అవసరం,'' అని బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ అబెర్డీన్ నుండి ఏ.కార్ స్టెయిర్ చెప్పారు.

ఎల్లపుడూ మంచి భోజనమే

ఇంట్లో తయారుచేసిన భోజనమే పిల్లలకు ఎల్లపుడూ సరైన ఎంపిక కాదని అధ్యయనాలు చెప్తున్నాయి. అంతేకాకుండా, ఇంట్లో తయారుచేసిన ఆహార పదార్థాలలో సగం వరకు బైట తయారుచేసి వాణిజ్యపరంగా అమ్మే పదార్థాలనే వాడుతున్నామని గమనించాలి. (65 శాతం) అంటే దాదాపు రెండు బై మూడు వంతులు వాణిజ్యపరమైన ఉత్పత్తులలో శక్తి సాంద్రత ఉంటే, కేవలం ఒక భాగం మాత్రమే ఇంట్లో తయారుచేసిన పదార్థాల నుండి పొందుతున్నాం, అంటే గరిష్ఠ స్థాయి (52 శాతం) నికి మించిపోతుంది. ఇంట్లో తయారుచేసిన భోజనంలో బైట దొరికే భోజనంలో కంటే ప్రోటీన్లు అధికంగా ఉంటాయి అదేవిధంగా అనేక రకాల కూరగాయలు కూడా ఉంటాయి, కానీ వాణిజ్యపరమైన ఉత్పత్తులలో ఒక భోజనంలో అనేకరకాల కూరగాయలు ఉంటాయి, ఇంట్లో తయారుచేసిన రెండు వంటకాలతో పోలిస్తే అక్కడ మూడు వంటకాలు ఉంటాయి.

రెడీమేడ్ మీల్స్

రెడీమేడ్ భోజనం అనేది అనుకూలమైన ప్రత్యామ్నాయం, కానీ ఏ తల్లిదండ్రులూ రెడీమేడ్ మీల్స్ లో దొరికే వైవిధ్యభరితమైన ఆహారం తమ పిల్లలకు అందివ్వాలని చూడట్లేదని పరిశోధకులు చెప్తున్నారు. ఆహారంలోని కొవ్వు ప్రత్యేకంగా కొవ్వు ఆమ్లాలు, కొవ్వును కరిగించే విటమిన్లు శక్తి, జ్ఞాన లక్షణాలను అందిస్తాయి, ఇవి పెరిగే పిల్లలకు చాలా అవసరంబీ అయితే, వాటిని ఎక్కువ తీసుకుంటే చిన్నతనంలోనే ఊబకాయం, ఆరోగ్య సమస్యలు రావొచ్చని,'' కూడా కార్ స్టెయిర్ చెప్పారు. అధ్యయనం కోసం, ఒక జట్టు వాటి పోషకాలు, ధరను పోలిస్తే, 278 రకాల రెడీమేడ్ సరైన భోజనం తీసుకునే ఒక జట్టు, వీరిలో 174 మంది ఇంట్లో తయారుచేసిన 408 భోజనాలలో 55 అత్యుత్తమ వంట పుస్తకాలను కొనుగోలు చేసి ఆ పుస్తకాలను ఉపయోగించి వారి పిల్లలకు, యుక్త వయసు వారికి తయారు చేస్తున్నారు.





ఆహారంపై అలర్జీ

మీ బిడ్డ ఆందోళన రుగ్మతతో బాధపడుతున్నాడా? జాగ్రత్తగా ఉండండి, ఒక పరిశోధన ప్రకారం అది ఆహారం పట్ల అలర్జీ వల్ల రావచ్చు. ఈ పరిశోధన ఫలితాలను బట్టి ఆహారం అలర్జీ వున్న పిల్లల్లో చిన్నపిల్లల ఆందోళన రుగ్మత ఎక్కువ ఉన్నట్లు తేలింది. పరిశోధకులు ఆహారపు అలర్జీలు ముఖ్యంగా సామాజిక యాంగ్జయిటీ, సమాజంలో తిరస్కరణ, అవమానపు భయాలకు కారణమవుతాయని చెప్పారు. కొలంబియా యూనివర్సిటీ రచయిత రీనీ గుడ్ విన్ మాట్లాడుతూ, ''ప్రాణాంతకమైన వాటితో ఎలా జీవించాలా అన్న ఆలోచన ఆందోళనకి కారణం కావచ్చు, మరియు కొందరు పిల్లలు మిగతావారి కంటే తాము వేరు అన్న భావనతో సోషల్ యాంగ్జయిటీకి గురికావచ్చు. ఇది వారి వయస్సు, ఆహారపు అలర్జీలను పెద్దవారు ఎలా పరిష్కరిస్తున్నారన్నదానిపై ఆధారపడుతుంది.'' అని చెప్పారు. జర్నల్ ఆఫ్ పీడియాట్రిక్స్ లో ప్రచురితమైన అధ్యయనంలో, వారి బృందం 4–12 ఏళ్ళ మధ్య రోగులైన చిన్నపిల్లలను, ఆహారం అలర్జీ ఉన్నవారు, లేనివారుగా మరియు వారిని సంరక్షించే వారి స్థితిని బట్టి విశ్లేషించారు. ఆహారం అలర్జీ ఉన్న పిల్లల్లో, 57 శాతం మంది 48శాతం అలర్జీ లేని పిల్లల కన్నా ఆందోళన ఉన్నట్లు తెలిపారు. ఆహారపు అలర్జీల లక్షణాలు, చిన్నప్పటి డిప్రెషన్ లక్షణాలతో కానీ, ఆందోళన మరియు సంరక్షకుల డిప్రెషన్ తో కానీ సంబంధం ఉన్నట్టు తెలియలేదు.

పిల్లలకు ఎక్కిళ్ళు



సరిగ్గా ఎదిగిన హ్యూమన్ బీయింగ్ కి వర్కింగ్ నమూనాగా పాపాయిని పేర్కొనవచ్చు. చిన్నారి పాప మ్యానరిజమ్స్‌తో పాటు గెస్చర్స్ అనేవి చాలా క్యూట్ గా ఉంటాయి. చిన్నపాపకి ఎక్కిళ్ళు వస్తున్నప్పుడు ఆమె తల్లి ఎక్కువగా అలసిపోతుంది. పాపాయిలో ఏ చిన్న మాత్రం తేడా కనిపించినా తల్లి హృదయం కలత చెందుతుంది. ఎక్కువగా ఆందోళన పడుతుంది. చిన్నారి పాపలోని ప్రతి కదలిక చుట్టూ ఉన్నవారిని కదిలిస్తుంది. పాపాయి కదలిక సంతోషంతో కూడినదైతే చుట్టూ ఉన్నవారు ఆనందంలో తేలియాడుతారు. ఒకవేళ పాపాయి కదలికలో అనారోగ్య సూచనలు కనిపిస్తే చుట్టూ వాతావరణం డల్‌గా మారిపోతుంది. ఈ ఆర్టికల్ అనేది పిల్లలకు ఎక్కిళ్ళు వస్తున్న సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరిస్తుంది. శిశువు జన్మించక ముందు నుంచే అంటే గర్భస్థ శిశువుగా ఉన్నప్పటి నుంచే ఎక్కిళ్ళు ప్రారంభం అవుతాయి. ఆరో నెల గర్భంలో పిల్లల లంగ్స్ అనేవి పూర్తిగా ఎదుగుతాయి. మీ పొత్తికడుపులో మీకు తెలిసే చిన్న చిన్న పాపాయి కదలికలో చాలా మటుకు ఎక్కిళ్ళకు సంబంధించినవే అయుండుంటాయి.

మంచి కథలు చెబుతాను

కథ



కోపంగా, బుంగ మూతిపెట్టుకుని ఒంటరిగా వీధి గుమ్మంలో కూర్చొని ఆకాశం వైపు చూస్తోన్న బుజ్జీని చూసి 'ఏమైందమ్మా.. దిగులుగా ఉన్నావ్' అని అడిగాడు తండ్రి ఆనంద్. అంతే అంతవరకూ మౌనంగా ఉన్న బుజ్జీ.. తండ్రి చెంతకు చేరి 'హూ... ఈ బామ్మతో నేను పడలేక పోతున్నాను డాడీ... టీవీ ఎక్కువ చూడకూడదని, కంప్యూటర్ ముందు రోజంతా కూర్చోకు అని, ఆంక్షలు పెడుతుంది. నా హోమ్‌వర్కు చేసుకోలేక నేను బాధపడుతుంటే నీతి పద్యాలు నేర్పిస్తాను, మంచి కథలు చెబుతాను రావే అంటూ బుర్ర తినేస్తుంది'. అంటూ వరుసగా ఫిర్యాదులు చేసింది బుజ్జీ. 'సరే నేను బామ్మతో చెబుతానులే' అంటుండగానే కొరియర్‌లో ఒక పెద్ద అట్టపెట్టె లాంటిది వచ్చింది. ఆనంద్ సంతకం పెట్టి దాన్ని తీసుకుని తెరిచేసరికి 'ఓ కొత్త లాప్‌టాప్' అంటూ ఆనందంగా అరిచింది బుజ్జీ. తండ్రితోపాటే కూర్చొని దానిలో ఒక్కొక్క ప్రోగ్రాం ఇన్‌స్టాల్ చెయ్యడం గమనిస్తోంది. ఒక సీడీ మీద 'ఏంటీ వైరస్' అని రాసి ఉండటం గమనించిన బుజ్జీ 'డాడీ... కంప్యూటర్‌కి కూడా జబ్బులు వస్తాయా? ఇదెందుకు?' అని ఆసక్తితో అడిగింది. 'మన కంప్యూటర్‌ను అంతర్జాలంతో కలిపాక దీనికి హాని చేసే చెడు తలంపుతో కొంతమంది చెడ్డ ఫైళ్లను పంపిస్తుంటారు. అలాగే పెన్ డ్రైవ్ వంటివి వాడినప్పుడు కూడా హాని చేసే ఈ ఫైళ్లు కంప్యూటర్‌లోకి చేరి దీనిని పాడు చేస్తాయి. అలాంటి వాటి నుంచి రక్షణ కోసం ఇది వాడుతామన్నమాట. ఇది కంప్యూటర్ లోపలే ఉండి దానిని రక్షిస్తుంది'. అంటూ వివరించాడు ఆనంద్. బుజ్జీ ఆలోచనలో పడింది. ఇదే సరైన సమయం అనుకున్న ఆనంద్ 'బుజ్జి తల్లీ... నీకో మాట చెప్పనా? కంప్యూటర్‌లానే మనుషులకూ ఏంటీ వైరస్ అవసరం. సమాజంలో చెడ్డ అలవాట్లు, చెడు స్నేహితులు, హాని చేసే వ్యక్తుల నుంచి మనల్ని రక్షించ గలిగేది మన నడవడికే. బామ్మ నీకు చెప్పే జాగ్రత్తలూ, నీతి కథలు, పద్యాలూ ఇలాంటివే. ఇవి మనసులో నాటుకుని నిన్ను మంచి దారిలో నడిపిస్తూ ఉంటాయ్. టీ.వీ ఎక్కువ చూడటం వల్ల సమయం వృథా అవడమే కాక ఆరోగ్యానికి కూడా హాని చేస్తుంది. కంప్యూటర్, స్మార్టుఫోన్లు కూడా అంతే. వాటిని పరిమితికి మించి వాడకూడదు. చాలామందికి బామ్మలే లేరు, నీకు బామ్మ దేముడిచ్చిన వరం. ఆమె మాట వింటే లోకజ్ఞానంతోపాటు మంచితనం అబ్బి నీ భవిష్యత్తు అంతా బంగారు బాట అవుతుంది' అని చెప్పాడు.

కోతి.. ఏం తింటుంది?

మీకు కోతి అంటే చాలా ఇష్టం కదా! ఎక్కడైనా దేవాలయాల దగ్గర, రహదారి మధ్యలో, పార్కులలో మీరు కోతులను చూసే ఉంటారు. కోతిని చూడగానే మీరు చేసే పని మీ చేతిలో ఉన్న తినుబండరాలను దానికి చూపించడం.. అవును కదా?! చాలామంది కోతి శాఖాహారి మాత్రమే అని అనుకుంటుంటారు. ప్రస్తుతం ప్రపంచం మొత్తం 264 రకాల కోతి జాతులు ఉన్నాయి. ఎక్కువశాతం చెట్లనే నివాసంగా చేసుకుని జీవిస్తే, కొన్నిమాత్రం భూమిపైనే జీవించడానికి ఇష్టపడతాయి. కోతి శాకాహారాన్నే తింటుంది అనుకోవడం అపోహ మాత్రమే. కోతి మాంసాహారి కూడా. ఇవి సుమారు రెండు వందల రకాల పండ్లను తింటాయి. పిల్లలూ మీకు తెలియని ఇంకొక విషయం చెప్పమంటారా! రకరకాల పండ్లు తినడంతోపాటు క్రిమికీటకాలు, పక్షి గుడ్లు వంటి మాంసాహారాన్నీ కోతులు ఇష్టంగానే తింటాయి. అక్కడికి.. ఇక్కడికీ తిరుగుతూ పండ్లను తింటూనే వాటిలోని విత్తనాలను తెలివిగా నేలపై వెదజల్లుతాయి. ఇలా చేయడం వల్ల భవిష్యత్తులోనూ ఆయా ఫలసంపద వాటికి అందుతుంది.





తొలి సెల్ఫీ మ్యూజియం

పిల్లలూ..! మీరు ఎప్పుడైనా సెల్ఫీ తీసుకున్నారా? స్మార్ట్ ఫోన్‌లు వచ్చిన తర్వాత సెల్ఫీ దిగని వారంటూ ఎవరుంటారులే! ఉదయాన్నే నిద్రలేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రపోయే వరకూ రోజులో ఎన్నో సెల్ఫీలు దిగుతున్నారు. నాలుక బయటపెట్టి ఓ సెల్ఫీ, కోపంగా ఓ సెల్ఫీ, మేకలతో, కుక్కలతో మరో సెల్ఫీ ఇలా ప్రస్తుతమంతా సెల్ఫీ ట్రెండ్ నడుస్తోంది. ఇలా సెల్ఫీలు తీసుకునే వారికోసం ఫిలిప్పైన్స్‌లో ప్రపంచంలోనే తొలి 'సెల్ఫీ మ్యూజియం' పెట్టారు. ఈ మ్యూజియంను 2014 డిసెంబర్‌లో ప్రారంభించారు. దీన్నే 'ఆర్ట్ ఇన్ ఐలాండ్' అని కూడా పిలుస్తారు. పిల్లలూ! మీకు ఇంకొక విషయం తెలుసా? ఈ మ్యూజియంలో ఎన్నో త్రీడి చిత్రాలను తీర్చిదిద్దారు. ఒక్కో చిత్రం ఒక్కో థీమ్‌తో ఉంటుంది. ఇక్కడ దాదాపు 200కు పైగా చిత్రాలు ఉన్నాయి. దాదాపు అన్ని మ్యూజియాల్లోనూ వస్తువులను తాకకూడదంటూ, ఫోటోలు తీయకూడదంటూ నిబంధనలు పెడతారు కదా! కానీ ఇక్కడ మాత్రం మనం ఎంచక్కా సెల్ఫీలు దిగవచ్చు.

అహో.. సాహో..



కోల్‌కతా : భారత యువ సంచలనం, వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా పరుగుల విధ్వంసం సృష్టించాడు. ప్రత్యర్థి బౌలర్లను రఫ్ఫా డేశాడు. .బెంగాల్‌లో జరుగుతున్న జెసీ ముఖర్జీ ట్రోఫీ టి20 లీగ్ మ్యాచ్‌లో మోహన్‌బగాన్ జట్టు తరపున ఆడుతున్న సాహా అహో అనిపించే రీతిలో ఆడాడు. కేవలం 20 బంతుల్లో 14 సిక్సర్లు నాలుగు ఫోర్లతో సెంచరీ బాదేసి చరిత్ర తిరగరాశాడు. ప్రపంచ క్రికెట్ చరిత్రలో ఇంత తక్కువ బంతుల్లో సెంచరీ చేయటం ఇదే మొదటిసారి. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన బెంగాల్ నాగపూర్ రైల్వేస్ జట్టు 20 ఓవర్లలో ఏడు వికెట్లు నష్టపోయి 151 పరుగులు చేస్తే.. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన మోహన్ బగాన్ జట్టు సాహా అసాధ్యమైన బ్యాటింగ్‌తో వికెట్ నష్టపోకుండా ఏడు ఓవర్లలోనే 154 పరుగులు చేసి మ్యాచ్ ముగించింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన సాహా పరుగుల వరద పారించాడు. మరో ఓపెనర్ సుభమన్యు దాస్ (22 బంతుల్లో 43 నాటౌట్)తో కలసి వీర విహారం చేశాడు. సిక్సర్లు, బౌండరీలతో రైల్వేస్ జట్టుకు పట్టపగలే ఓపెనర్లు ఇద్దరూ చుక్కలు చూపించారు. మీడియం పేసర్ అమన్ ప్రసాద్ వేసిన ఏడో ఓవర్లో సాహా ఏకంగా 37 పరుగులు చేసి విజయంలో కీలకపాత్ర పోషించాడు. 20 బంతుల్లో సాహా 102 పరుగులు సాధించగా.. ఇందులో 100 పరుగులు బౌండరీల ద్వారా వచ్చినవే కావడం విశేషం.

సన్‌రైజర్స్‌కు గుడ్‌న్యూస్

తన సూపర్ ఫామ్‌తో వచ్చే నెల్లో ప్రారంభం కానున్న ఐపీఎల్ టోర్నీలో ఆడే సన్‌రైజర్స్ జట్టుకు సహా గుడ్‌న్యూస్ అందించాడు. ఐపీఎల్ ఆటగాళ్ల వేలంలో సన్‌రైజర్స్ జట్టు ఐదు కోట్ల రూపాయలకు వృద్ధిమాన్ సాహాను కొనుక్కుంది. సాహా తాజాగా కనబరిచిన విధ్వంసకర బ్యాటింగ్‌తో సన్‌రైజర్స్ ఖుషీగా ఉంది. ఈ సారి ఐపీఎల్‌లో హాట్‌ఫేవరిట్ జట్లలో ఒకటైన సన్‌రైజర్స్ ఆశలు సాహా ఇన్నింగ్స్‌తో రెట్టింపయ్యాయి. గతంలో భారత జట్టుకు ఒకే ఒక్క టెస్టు ఆడిన సాహా దేశవాళీ పోటీల్లో 164 టి20 మ్యాచ్‌లు ఆడాడు. 130.30 స్ట్రైక్ రేట్‌తో 2718 పరుగులు చేశాడు. ఇందులో ఓ సెంచరీ 14 హాఫ్ సెంచరీలు కూడా ఉన్నాయి. ఈ ఐపీఎల్‌లో ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ చేసేందుకు సిద్ధం అన్న సాహా తాజాగా రికార్డు శతకంతో అందరి చూపును తనవైపే తిప్పుకున్నాడు. ఇంతకు ముందు సీజన్లలో చెన్నయ్ సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, కింగ్స్‌లెవెన్ పంజాబ్ జట్లకు సాహా ఆడాడు. ఐపీఎల్‌లోనూ సాహా రికార్డు బ్రహ్మాండంగ ఉంది 105 మ్యాచ్‌లు ఆడిన సాహా 1557 పరుగులు చేశాడు. ఐపీఎల్ ఫైనల్లో సెంచరీ చేసిన ఏకైక ఆటగాడిగా సాహా పేరు రికార్డుల్లో ఉంది. 2014 ఐపీఎల్ ఫైనల్లో నైట్‌రైడర్స్ తరపున సెంచరీ కొట్టిన సాహా చరిత్ర సృష్టిం చాడు.అయితే ఆ మ్యాచ్‌లో నైట్‌రైడర్స్ ఓడిపోయింది.

గేల్ రికార్డు బ్రేక్

ఇప్పటి వరకు టీ20 ఫార్మాట్‌లో అతి తక్కువ బంతుల్లో శతకం సాధించిన రికార్డు విధ్వంసకర బ్యాట్స్‌మెన్ క్రిస్‌గేల్ పేరిట ఉంది. 2013 ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూ రుకు ప్రాతినిధ్యం వహించిన గేల్.. పుణె వారియర్స్‌పై 30 బంతుల్లో శతకం సాధించి రికార్డు సృష్టించాడు.



పురాణాల కాలం నుంచి మన దేశానికి సొంతమైన కుస్తీ క్రీడలో భారత జట్ల సత్తాకు కామన్‌వెల్త్ క్రీడలు మరో సారి పరీక్ష పెట్టబోతున్నాయి. 2018 కామన్‌వెల్త్ క్రీడల్లో భారత యోధులు ఈ సారి ఎన్ని పతకాలు సాధిస్తారోనని దేశమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది. గోల్డ్ కోస్ట్ కామన్‌వెల్త్ క్రీడల్లో మన మల్లయోధుల సత్తా ఏమిటి.. ప్రోరెజ్లింగ్ ప్రభావం మన అథ్లెట్లపై ఏ మాత్రం ఉంది.

కుస్తీమే సవాల్

Gold Coast 2018 XXI Commonwealth Games

కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్ ఖాయంగా పతకాలు గెలుచుకునే ఐదు క్రీడల్లో కుస్తీ ఒకటి. ఇప్పుడిప్పుడే ఒలింపిక్స్ స్థాయికి ఎదిగిన ఈ క్రీడల్లో భారత్‌కు కామన్‌వెల్త్ స్థాయిలో ఆశించిన స్థాయిలోనే పతకాలు దక్కాయి. గోల్డ్‌కోస్ట్‌లో వచ్చేనెల్లో ప్రారంభ మయ్యే 21వ కామన్‌వెల్త్ క్రీడల కుస్తీ విభాగంలో భారత్‌కు 22 దేశాల నుంచి పోటీ ఎదురు కానుంది. మొత్తం 12 మంది రెజ్లర్లతో భారత్ గోల్డ్ కోస్ట్ కామన్‌వెల్త్ బరిలో దిగుతోంది. మెన్స్ ఫ్రీ స్టైల్, ఉమెన్స్ ఫ్రీ స్టైల్ విభాగాల్లో భారత్ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. యోగేశ్వర్ దత్, సుశీకుమార్, నరింగ్ యాదవ్‌లు పురుషుల విభాగంలోనూ, రియో ఒలింపిక్ స్టార్‌సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్, బబితా కుమారిలు మహిళల విభాగంలోనూ భారత్‌కు పతకాలు అందించేందుకు బరిలోకి దిగుతున్నారు. 2014 కామన్‌వెల్త్ క్రీడల్లో స్వర్ణం గెలుచుకున్న యోగేశ్వర్ దత్ వరుసగా మూడో సారి కూడా భారత్‌కు స్వర్ణం అందించేందుకు సిద్ధమవుతున్నాడు. ఇటీవల గాయం కారణంగా కొన్ని నెలలు ప్రాక్టీస్‌కు దూరమైనప్పటికీ దత్ పూర్తి ఫిట్‌నెస్‌తో హ్యాట్రిక్ స్వర్ణం కోసం రెడీ అయ్యాడు. ఇక లండన్ ఒలింపిక్స్‌లో భారత్‌కు కుస్తీలో రజత పతకం అందించి చరిత్ర సృష్టించిన సుశీల్‌కుమార్ చాలా కాలం తర్వాత మళ్లీ ఫామ్‌లోకొచ్చి అందరి దృష్టినీ ఆకట్టుకుంటున్నాడు. గాయాల పాలై మూడేళ్ల విరామం తర్వాత మళ్లీ బరిలో దిగుతున్న సుశీల్ 2010లో, 2014ల్లో కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్‌కు స్వర్ణాలు అందించాడు. మహిళల విభాగంలో రియో ఒలింపిక్ స్టార్ సాక్షి మాలిక్‌తో పాటు మరో స్టార్ రెజ్లర్ వినేశ్‌ఫోగట్ కూడా పతకం ఆశలు పెంచుతోంది. రెజ్లర్ కుటుంబం నుంచి వచ్చిన ఫోగట్ ఆ వారసత్వాన్ని నిలుపు తానని ఆత్మ విశ్వాసంతో ఉంది.



హ్యాట్రిక్‌కు సుశీల్‌కుమార్ రెడీ...

ఈ కామన్‌వెల్త్ క్రీడల్లో స్వర్ణ పతకం గెలుచుకుని టోక్యో ఒలింపిక్స్ దిశగా అడుగులేస్తున్నాడు స్టార్ రెజ్లర్ సుశీల్‌కుమార్. ఒలింపిక్స్‌లో రెండు పతకాలు, కామన్‌వెల్త్ క్రీడల్లో మరో రెండు స్వర్ణాలు గెలుచుకున్న సుశీల్‌కుమార్ కలగా మిగిలిన ఒలింపిక్ స్వర్ణం కోసం ఈ కామన్‌వెల్త్ పోటీలను ఉపయోగించుకోనున్నాడు. బీజింగ్, లండన్ ఒలింపిక్స్‌లో కాంస్య, రజతాలు గెలిచిన ఈ హీరో ఇప్పటి నుంచే టోక్యో ఒలింపిక్స్‌కు సన్నాహాలు మొదలు పెట్టాడు. 66 కిలలో విభాగంలో స్వర్ణం గెలిచి కామన్‌వెల్త్‌లో గోల్డెన్ హ్యాట్రిక్ సాధించాలని ఉత్సాహంతో ఉన్నాడు.

కెనడా ఆధిపత్యానికి బ్రేక్...



కామన్‌వెల్త్ క్రీడల్లో కెనడాదే ఆధిపత్యం. 2010లో ఢిల్లీలో జరిగిన పోటీల్లో భారత్ 10 స్వర్ణాలు, ఐదు రజతాలు, నాలుగు కాంస్య పతకాల సాధించి మిగతా దేశాలకు సవాల్ విసిరింది. అయితే ఆ తర్వాత గ్లాస్గోలో జరిగిన 2014 కామన్‌వెల్త్ పోటీల్లో భారత్‌కు కెనడా నుంచి గట్టి పోటీ ఎదురైంది. అన్నివిభాగాల్లోనూ కెనడాదే ఆధిపత్యం అయింది. మొత్తంగా ఆ పోటీల్ల నాలుగు స్వర్ణాలు, ఐదు రజత, ఐదు కాంస్య పతకాలతో భారత్ సంతృప్తి పడింది. ఇక గోల్డ్ కోస్ట్ కామన్‌వెల్త్ పోటీల్లో భారత్ అన్ని విభాగాల్లోనూ ప్రత్యర్థులకు గట్టిపోటీ ఇచ్చేందుకు రెడీ అయింది.

ప్రో రెజ్లింగ్‌తో మారిన రూపురేఖలు

భారత్‌కు సొంతమైన ఈ కుస్తీలోనూ చాలా ఏళ్లపాటు పరాయి దేశాలదే ఆధిపత్యంగా ఉండేది. అయితే మూడేళ్ల క్రితం భారత్‌లో మిగతా క్రీడల్లోలాగే ప్రొఫెషనల్ లీగ్ పోటీలను ప్రవేశపె ట్టడంతో రూపురేఖలే మారిపోయాయి. యువతీ యువకుల్లో ఉత్సాహం వెల్లువెత్తింది. అనేక మంది జాతీయ క్రీడాకా రులు ఈ ప్రొరెజ్లింగ్ ద్వారా జాతీయ జట్టుకు అందుబాటు లోకొ చ్చారు. ఈ సారి కామన్‌వెల్త్ క్రీడల్లో పాల్గొంటున్న పలు వురు క్రీడాకారులు ప్రొ రెజ్లింగ్ ఈవెంట్‌లో ఆడిన వాళ్లే.



స్వర్ణం ఖాయం : సాక్షి మాలిక్

రెండేళ్లక్రితం జరిగిన రియో ఒలింపిక్స్‌లో భారత్‌కి తొలి పతకం అందించిన రెజ్లర్ సాక్షిమాలిక్‌పై ఈసారి దేశం గంపెడాశలు పెట్టుకుంది. నాలుగేళ్లక్రితం జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో రజతం సాధించిన సాక్షి.. ఈసారి స్వర్ణం గెలుచుకుంటానని ఖాయంగా చెబుతోంది. 2014లో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో తొలిసారి అంతర్జాతీయ పతకం గెలుపొందిన సాక్షి.. ఆ తర్వాత ఏడాది జరిగిన ఆసియా ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించి అంచనాల్ని అందుకుంది. 2016లో జరిగిన రియో ఒలింపిక్స్‌లో ఖాతా తెరవలేక ఢీలా పడిన భారత్‌కి రెజ్లింగ్ ద్వారా తొలి పతకాన్ని అందించి భారతీయుల్ని గర్వపడేలా చేసింది.

నేను నిర్దోషిని

కేసు నుంచి బయట పడతా: షమి



కోల్‌కతా: తాను నిర్దోషినని త్వరలో కేసులన్నింటి నుంచి బయటపడతానని టీమిండియా పేస్ బౌలర్ షమి ధీమాగా ఉన్నాడు బీసీసీఐ కాంట్రాక్టు నుంచి తప్పించడంతో తాను ఎంతో మానసిక క్షోభకు గురయ్యానని షమి చెప్పారు. మ్యాచ్ ఫిక్సింగ్, ఇతర మహిళలతో సంబంధాలు, హత్యాయత్నానికి పాల్ప డ్డాడంటూ షమి భార్య హసీన్ జహాన్ సంచనల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో బీసీసీఐ షమికి కాంట్రాక్టులో స్థానం కల్పించలేదు. అయితే బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం దర్యాప్తులో షమి ఎలాంటి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడలేదని తేలడంతో బీసీసీఐ 'బి' గ్రేడ్ కాంట్రాక్టులో చోటు దక్కింది. దీంతో ఈ ఏడాది ఐపీఎల్‌లో ఆడేందుకు మార్గం సుగమమైంది. వేలంలో ఢిల్లీ డేర్‌డెవిల్స్ షమిని రూ.3కోట్లకు దక్కించుకున్న సంగతి తెలిసిందే. మ్యాచ్ ఫిక్సింగ్ పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల్లో నిజం లేకపోవడం, బీసీసీఐ కాంట్రాక్టు దక్కడం, ఐపీఎల్‌లో ఆడటంపై షమి తాజాగా సంతోషం వ్యక్తం చేశాడు. 'ఇది పూర్తిగా కుటుంబానికి సంబంధించిన సమస్య. నాకు వ్యతిరేకంగా వచ్చిన వార్తల్లో ఏ మాత్రం నిజం లేదు. గత 10-15 రోజులుగా ఎంతో మానసిక క్షోభకు గురయ్యా. ఈ రోజులన్ని ఎంతో కఠినంగా గడిచాయి. వీలైనంత త్వరగా వీటన్నింటి నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నా' అని తెలిపాడు షమి.

బీసీసీఐపై జహాన్ ఆగ్రహం

బీసీసీఐపై టీమిండియా పేసర్ మహమ్మద్ షమీ భార్య హసీన్ జహాన్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యాచ్ పిక్సింగ్ ఆరోపణలపై బీసీసీఐ జరిపిన దర్యాప్తు తీరును తప్పుబట్టారు. విచారణలో దర్యాప్తు బృందం షమీ క్యారెక్టర్‌ను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. అతడి వ్యక్తిగత విషయాలను బీసీసీఐ పక్కనపెట్టేసిందని విమర్శించారు.

ఆస్ట్రేలియా -దక్షిణాఫ్రికా టెస్ట్‌లో

బాల్ టాంపరింగ్!



కేప్‌టౌన్ : ఆస్ట్రేలియా -దక్షిణాఫ్రికా మధ్య కేప్‌టౌన్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టు మూడో రోజు ఆటలో ఆసీస్ ఆటగాడు బెన్ క్రాఫ్ట్ మైదానంలో ప్రవర్తించిన తీరు చర్చనీయాంశమైంది. ఆట మధ్యలో ప్యాంట్‌లో పసుపు రంగు వస్తువును బెన్‌క్రాఫ్ట్ దాచడం కెమెరాల్లో స్పష్టంగా కనిపించింది. బెన్‌క్రాఫ్ట్ బాల్ ట్యాంపరింగ్ యత్నించాడని ఫీల్డ్ అంపైర్లకు ఫిర్యాదు రావడంతో ఆట మధ్యలోనే అతన్ని పిలిచి వివరణ కోరారు. అయితే తన వద్ద ఏమి లేదని బంతిని తుడిచే వస్త్రం ఉందని అంపైర్లకు బెన్‌క్రాఫ్ట్ చూపెట్టాడు. దీనికి సంతృప్తి చెందిన అంపైర్లు ఆటను కొనసాగించారు. అయితే తొలుత కెమెరాల్లో కనిపించిన వస్తువు.. తీరా అంపైర్ల కు చూపించినది వేరు కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. రివర్స్ స్వింగ్ కోసం ఆసీస్ ఆటగాళ్లు బాల్ ట్యాంపరింగ్‌కు యత్నించారని ఆరోపణలు మొదలయ్యాయి.

నైల్‌కు గాయం

కోహ్లీ జట్టులో ఆండర్సన్

చెన్నయ్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ -2018 సీజన్ ఆరంభంకాక ముందే విరాట్ కోహ్లీ నాయకత్వంలోని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) జట్టుకు పెద్ద దెబ్బ తగిలింది. వేలంలో బెంగళూరు దక్కించుకున్న స్టార్ ఫాస్ట్ బౌలర్ నాథన్ కౌల్టర్ నైల్(ఆస్ట్రేలియా) గాయం కారణంగా ఐపీఎల్-2018 నుంచి తప్పుకున్నాడు. నాథన్ స్థానంలో న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ కోరె ఆండర్సన్‌ను రాయల్ చాలెంజర్స్ జట్టులోకి తీసుకుంది. నైల్ గతేడాది కోల్‌కతా నైట్ రైడర్స్‌కు ఆడి 8 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు పడగొట్టి ఆకట్టుకున్నాడు. నైల్ తీవ్రమైన గాయంతో బాధపడుతున్నందున విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఐపీఎల్ వేలం సందర్భంగా కివీస్ ఆల్‌రౌండర్‌కు అండర్సన్‌కు కనీస ధర రూ.2 కోట్లతో తాజాగా బెంగళూరు జట్టులోకి తీసుకున్నట్లు బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఆండర్సన్‌లో అపార ప్రతిభ ఉందని, అతడు చాలా విధ్వంసకరమైన రీతిలో ఆడతాడని, ఆర్‌సీబీ టీమ్‌లోకి స్వాగతం పలుకుతున్నామని ఆర్‌సీబీ హెడ్ కోచ్ డేనియల్ వెటోరీ చెప్పాడు. ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో ఆర్‌సీబీ ఏప్రిల్ 8న కోల్‌కతాతో తలపడనుంది.



మనుకు మరో రెండు స్వర్ణాలు



న్యూఢిల్లీ : ఐఎస్‌ఎస్‌ఎఫ్ సీనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో రెండు స్వర్ణ పతకాలతో సంచలనాలు సృష్టించిన 16 ఏళ్ల స్టార్ షూటర్ మనూ బాకర్ ఇప్పుడు జూనియర్ ప్రపంచకప్‌లోనూ తన సత్తా చాటుతోంది. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో లో జరుగుతున్న జూనియర్ ప్రపంచ కప్ పోటీల్లో 10మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో మను స్వర్ణం సొంతం చేసుకుంది. అలాగే 10మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో మను జట్టు స్వర్ణం సొంతం చేసుకుంది. వ్యక్తిగత విభాగంలో 235.9 పాయింట్లతో మను స్వర్ణం గెలుచుకోగా.. థాయ్‌లాండ్(234.9), చైనా(214.2) క్రీడాకారిణీలు ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. మరో భారత క్రీడాకారిణి దేవాన్షి రాణా 195.3 పాయింట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.మను బాకర్, దేవాన్షి రాణా, మహిమా అగర్వాల్ కలిసి 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం కైవసం చేసుకున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో చైనా, థాయ్‌లాండ్ నిలిచింది.

కామన్‌వెల్త్‌లో భారత జట్టు పతాకధారి సింధు



ఢిల్లీ: ఏప్రిల్ 4 నుంచి ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో ప్రారంభం కానున్న కామన్‌వెల్త్ క్రీడల్లో తెలుగుతేజం పీ.వి. సింధుకు అరుదైన గౌరవం దక్కింది. సుమారు 222మంది క్రీడాకారులు ఈ సారి కామన్వెల్త్ క్రీడల్లో తమ అదృష్టాన్ని పరీక్షించు కోనుండగా ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు వీరికి నాయకత్వం వహించనుంది. టోర్నీలో భాగం గా ఏప్రిల్ 4న గోల్డ్‌కోస్ట్‌లోని కరార స్టేడియంలో ఆరంభ వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా పీవీ సింధు త్రివర్ణ పతాకాన్ని చేత పట్టుకుని భారత జట్టుకు నాయకత్వం వహించనుంది.భారత జట్టులో మేరి కోమ్, సైనా నెహ్వాల్ లాంటి సీనియర్ క్రీడాకారులున్నప్పటికీ ఈ మధ్య కాలంలో సింధు సాధిస్తున్న విజయాలు ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తున్నాయి. అందుకే ఆమెను పతాకధారిగా ఎంపిక చేసినట్లు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధికారి తెలిపారు. క్రీడాకారుల అభ్యర్థన మేరకు ఈసారి ప్రారంభ వేడుకల్లో భారత క్రీడాకారిణీలు చీరలకు బదులు కోటు, ట్రౌజర్ ధరించనున్న సంగతి తెలిసిందే. కామన్వెల్త్ క్రీడల్లో భారత్ పాల్గొనడం ఇది 15వ సారి. మొత్తం 15 క్రీడాంశాల్లో భారత్ క్రీడాకారులు బరిలోకి దిగుతున్నారు. మొత్తం 70 దేశాలు ఈ కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొంటున్నాయి. 1930లో ప్రారంభమైన క్రీడల్లో భారత్ మొత్తం 438 పతకాలు సాధించింది.

ఇంగ్లీష్ కౌంటీలకు విరాట్ కోహ్లీ

ఆఫ్ఘనిస్తాన్‌తో టెస్ట్‌కు దూరం



న్యూఢిల్లీ :మిగతా అన్ని దేశాల్లో కోహ్లికి చక్కటి రికార్డ్ ఉన్నప్పటికీ.. ఇంగ్లాండ్ గడ్డ మీద చెప్పుకోదగిన రికార్డులు లేవు. దక్షిణాఫ్రికా గడ్డ మీద జరిగిన టెస్టు సిరీస్‌లో కోహ్లీ పరుగుల వరద పారించాడు. ఆ టూర్లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కానీ ఇంగ్లాండ్ గడ్డ మీద మాత్రం కోహ్లికి పేలవమైన రికార్డ్ ఉంది. 2014 పర్యటనలో కోహ్లి ఐదు టెస్టుల్లో కలిపి 13.40 యావరేజ్‌తో 134 రన్స్ మాత్రమే చేయలిగాడు. వరుసగా 1, 8, 25, 0, 39, 28, 0,7, 6, 20 రన్స్ మాత్రమే చేశాడు. ఏడాది ఇంగ్లాండ్‌లో పర్యటించనున్న టీమిండియా ఇంగ్లిష్ గడ్డపై టెస్టు సిరీస్ గెలవాలని తహతహలాడుతోంది. ఈ టూర్లో కోహ్లి రాణిస్తే.. విమర్శకుల నోళ్లు మూయించడంతోపాటు భారత్ ఇంగ్లండ్ గడ్డ మీద సిరీస్ గెలుస్తుంది.ఆగస్టులో ఇరు జట్ల మధ్య ఐదు టెస్టుల సిరీస్ ప్రారంభం కానుండగా.. కోహ్లి ముందుగానే ఇంగ్లాండ్ గడ్డ మీద అడుగు పెట్టబోతున్నాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు సిద్ధం కావడం కోసం సర్రే జట్టు తరపున కౌంటీల్లో ఆడనున్నాడు. ఇంగ్లీష్ కౌంటీ జట్టు సర్రేకు ఓ భారత ఆటగాడు ఆడటం ఇదే తొలి సారి. ఐపీఎల్ ముగిసిన వెంటనే విరాట్ ఇంగ్లాండ్‌కు బయల్దేరి వెళ్లనున్నాడు. దీంతో బెంగళూరు వేదికగా జూన్ 14 నుంచి అఫ్ఘాన్‌తో జరగనున్న ఏకైక టెస్టుకు కోహ్లి దూరం కానున్నాడు. భారత్‌తో జరిగే ఏకైక మ్యాచ్‌తో ఆఫ్ఘనిస్తాన్ టెస్టు క్రికెట్‌లో అడుగుపెడుతోంది. ఇక జులై 3న ప్రారంభంకానున్న ఇంగ్లండ్ సిరీస్‌లో భారత జ్టు మొదట మూడు టీ20లు, ఆ తర్వాత మూడు వన్డేలు, చివర్లో ఐదు టెస్టులు ఆడుతుంది.

ఇంగ్లండ్ టూర్‌లో రాణిస్తాం : ధావన్

ఇంగ్లాండ్ పర్యటనలో భారత జట్టు రాణిస్తుందని ఓపెనర్ శిఖర్ ధావన్ ధీమా వ్యక్తం చేశాడు. ఆగస్టులో ఆ గడ్డపై జరగనున్న ఐదు టెస్టుల సిరీస్ కోసం ముందుగానే అక్కడికి భారత జట్టు వెళ్లి ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడితే సిరీస్ గెలవడం కష్టంకాదని ధావన్ అభిప్రాయపడ్డాడు. ఇటీవల ముగిసిన దక్షిణాఫ్రికా పర్యటనకి ముందు భారత్ జట్టు అక్కడ ఎలాంటి ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడకపోవడంతోనే టెస్టు సిరీస్‌ని చేజార్చుకోవాల్సి వచ్చిందని విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇంగ్లాండ్ పర్యటనలో అలాంటి విమర్శలకి అడ్డుకట్ట వేయాలని టీమిండియా యోచిస్తోంది. ప్రస్తుతం ఐపీఎల్ 2018 సీజన్ కోసం సిద్ధమవుతున్న ధావన్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఇంగ్లాండ్ పర్యటన రూపంలో భారత జట్టుకి కఠిన పరీక్ష ఎదురుకానుంది. అందుకే.. సిరీస్ ఆరంభానికి ముందే అక్కడి పిచ్‌లపై అవగాహన పెంచుకునేందుకు ప్రయత్నిస్తాం. ఆ గడ్డపై ప్రాక్టీస్ మెరుగ్గా సాగితే.. కచ్చితంగా సిరీస్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చగలం' అని ధావన్ ధీమా వ్యక్తం చేశాడు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.